# కథామంజరి


## పది కథల సమాహారం



నవంబర్ 2024

# కథామంజరి

## పది కథల సమాహారం



**కథా మార్గదర్శి**

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకటరావు
ప్రచురణ కర్త

**నవంబర్ 2024**

సంపుటి : 5 ♦ సంచిక : 11

# కథామంజరి

## శ్రీమతి పాడూరి నాగమణిశ్రీ స్మారక "సంక్రాంతి కథల పోటీ"

సాహితీ ప్రియులకు సాహితీ పండగ సంక్రాంతి! ఈ పండగ సందర్భంగా "కథామంజరి" నిర్వహించే కథల పోటీకి పాఠక హృదయాలను రంజింపజేయగలిగే మంచి కథలను ఆహ్వానిస్తున్నాం! వివరాలు ..

| ప్రధమ బహుమతి | ద్వితీయ బహుమతి | తృతీయ బహుమతి |
|---|---|---|
| ₹ 5116/- | ₹ 3116/- | ₹ 2116/- |
| 10 ప్రత్యేక బహుమతులు ₹ 516/- చొప్పున | | |

### నిబంధనలు

- ఇతివృత్తం ఏదైనా పర్వాలేదు. 1200 పదాల కంటే మించరాదు.
- కథను వర్డ్‌లో యూనికోడ్‌లో టైపు చేసి పంపాలి. పిడియఫ్‌లో పంపే కథలు అనుమతించబడవు. కథలను submit@kathamanjari.in మెయిల్ ద్వారా పంపాలి.
- కథతో పాటు హామీపత్రం జతచెయ్యాలి. ఆ పత్రంలో.. కథ స్వీయరచన అని, మరే ఇతర పత్రికలకు పంపలేదని, సాంఘిక మాధ్యమాలలో గాని, బ్లాగులలో గాని ప్రచురణ/ప్రసరణ జరగలేదని, సుస్పష్టంగా పొందుపరచాలి.
- పోటీకి వచ్చిన కథలలో సాధారణ ప్రచురణకు కూడా కొన్ని కథలు ఎంపికచేసుకుని, వీలువెంబడి ప్రచురణ చేస్తాము. అలా ప్రచురణకు తీసుకునే కథలను ఎట్టి పరిస్థితుల్లోనూ తిరిగి పంపడం జరగదు. దయచేసి రచయితలు "పోటీలో బహుమతులు పొందకపోతే మా కథని తిప్పి పంపమని" మాకు అభ్యర్థనలు పంపవలదు. ఈ విషయం ప్రత్యేకంగా గమనించవలసిందిగా కోరుతున్నాం.
- కథ హామీపత్రంలో "సంక్రాంతి కథల పోటీకి" అని వ్రాసి పంపాలి.
- కథలు మాకు చేరడానికి చివరి తేదీ 30.11.2024 రాత్రి 10 గంటల లోపు.

కథామంజరి బృందం



# మా జట్టు

సంపాదకుడు

జయంతి ప్రకాశ శర్మ

ప్రచురణ కర్త

అవసరాల వెంకటరావు

సంపాదక సహకారం

ఎం.ఏ. పద్మనాభరావు
కృపాకర్ పోతుల
నండూరి సుందరీ నాగమణి

ప్రచురణా సహకారం

ఎం.ఎల్. కాంతారావు

సాంకేతిక సహకారం

Harbinger Publishing

బొమ్మలు

కొయిలాడ రామ్మోహనరావు
కొచ్చెర్ల వి.ఆర్.
సూరంపూడి చలపతిరావు



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి సహకారం అందించిన గళాకారులు

*శ్రీ/శ్రీమతి/కుమారి*

- *పప్పు భోగారావు గారు*
- *వెంపటి కామేశ్వర రావు గారు*
- *భువనపల్లి రంగనాథం గారు*
- *కరవది సరస్వతి గారు*
- *బి.ఎస్. మూర్తి గారు*
- *అవసరాల రాఘవరావు గారు*
- *లలితా గోవిందరాజు గారు*
- *భమిడిపాటి శరత్ జ్యోత్స్న గారు*
- *అవసరాల వెంకటరావు గారు*
- *చీమలపాటి శ్రీనివాసరావు గారు*
- *సమ్మెట ఉమాదేవి గారు*

**శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి**

# ప్రకటన

మాతో కలిసి "కథామంజరి" లో సేవలు అందించడానికి ఔత్సాహికులైన కథాప్రియులు కావాలి. తెలుగు భాష మీద పట్టు, సాహిత్యాభిలాష, సాంకేతికపరంగా మంచి అవగాహన, ముఖ్యంగా కథా సాహిత్యంపై మక్కువ ఉంటే ... మీ పేరు, ఫోన్ నెంబరు మా మెయిల్ కి పంపండి.

*submission@kathamanjari.in*

మేమే ఫోన్ చేసి మాట్లాడతాం!

కథామంజరి ఎంపిక చేసుకున్నవారిని ప్రచురణ, సంపాదకత్వం, సాంకేతిక శాఖలలో గల కార్యాలకు వినియోగించడం జరుగుతుంది.

నెలలో ఒకట్రెండు రోజుల సమయం మీరు కేటాయిస్తే చాలు.

'కథామంజరి'బృందంఅంతాస్వచ్ఛందంగాసేవలుఅందించేవారే. సమాజ సేవాదృక్పథంతో నడిపిస్తున్న 'కథామంజరి' కి అందించే సేవలకు పారితోషికాలు ఉండవని గమనించగలరు.

........................... కథామంజరి ...........................




## శీర్షికలు


| | |
|---|---|
| కథాకీయం | i |
| విశిష్ట అతిథి | ii |
| కథామార్గదర్శి | iv |
| కథా పరిచయం | vi |
| వినదగునెవ్వరు చెప్పిన | viii |
| కథాపుస్తక పరిచయం | x |


## కథలు, వ్యాసాలు


| | | |
|---|---|---|
| పంటపొలాలు | చొప్పదండి సుధాకర్ | 1 |
| ఊరి చివర మనిషి | పి. సీతారామ రాజు | 7 |
| నేనెట్లా చచ్చిపోతా...! | రావుల కిరణ్మయి | 11 |
| అమ్మడు కాఫీ హోటల్ | భమిడిపాటి గౌరీశంకర్ | 14 |
| ముందుచూపు | భాగవతుల కృష్ణారావు | 20 |
| వానప్రస్థం | డా. మజ్జి భారతి | 26 |
| దేవుడూ.. దయ్యాలూ.. నమ్మకమూ | వసుంధర | 31 |
| కుక్కతోక పట్టి గోదారి ఈదినట్లు | కాశీ విశ్వనాథం పట్రాయుడు | 35 |
| వాల్తేరత్త | "గొరుసు" | 37 |
| ఆకాశం ఇంత విశాలంగా ఎందుకుంది | కీ.శే. రంధి సోమరాజు | 50 |


Cover Page Credit : Ivan Rojas, San Jose, Costa Rica

# కథాకీయం

***శిశుర్వేత్తి పశుర్వేత్తి, వేత్తి గానరసం ఫణిః***
***కో వేత్తి కవితా తత్త్వం, శివో జానాతి వా నవా!***

పై శ్లోకాన్ని చెపుతూ.. పసిపిల్లలు, పశువులు, పాములు సంగీతాన్ని ఆస్వాదిస్తాయని చెపుతారు. ఆ విషయం మీద శాస్త్రీయ పరిశోధనలు, వాటి మీద వివరణలు, విమర్శల జోలికి వెళ్ళకుండా ఆలోచిస్తే, నాకో చిన్న విషయం స్ఫురణకు వచ్చింది. సాహిత్యానికి సంగీతాన్ని జోడిస్తే.. అది రసరమ్యంగా శ్రవ్యానందాన్ని కలుగచేస్తుంది. మన శాస్త్రీయసంగీతం.. సాహిత్యంతో ముడిపడి ఉంటుంది. ముఖ్యంగా అటు హిందుస్థానీ సంగీతానికి గాని, ఇటు కర్ణాటక సంగీతానికి గాని... వెన్ను దన్ను సాహిత్యమే!

సరే.. కథల మీద కాకుండా, సంగీతం మీదకు దృష్టి మరలిందేమిటని సందేహం రావడం సహజమే! ఆ సందేహమే వలదు... ఆ విషయం చెప్పేముందు, ఆ మాత్రం ఆలాపన ఉండాలి కదా!

ఇటీవల కాలంలో "వినిపించే" కథలు చాలా ప్రాచుర్యంలోకి వచ్చాయి. ఆదరణ రోజురోజుకి పెరుగుతోంది. కథలు వినిపించడంలో కొత్త కొత్త ప్రక్రియలతో, సొగసులు అద్దుకుని పాఠకుల ముందుకు వస్తున్నాయి. కొండకచో ఆ గాత్రధారులకు కొద్దో గొప్పో మన్ననలతో పాటు, ఆదాయం కూడా వస్తోంది. ఇది చాలా మంచి పరిణామం! కథకి మంచి ఆదరణ లభిస్తుంది! అయితే.. కథలని వినిపించడం కొత్త ప్రక్రియ కాదు. పాత కాలంలో.. పదిమంది కూర్చుని, ఎవరో ఒకరు పత్రికలలో వచ్చే కథలని చదివి వినిపించేవారు. హరికథ, బుర్రకథ వంటి మన ప్రాచీన కళాప్రక్రియల్లో.. ఇతిహాస, చారిత్రాత్మక కథలనే శ్రావ్యంగా ఆలపిస్తూ చెప్పేవారు. మధ్యమధ్యలో పిట్టకథలు కూడా వినిపించేవారు! ఇప్పుడు ఆ ప్రక్రియ సాంఘిక మాధ్యమాల ద్వారా, అరచేతిలోకి వచ్చేసింది! ఇది ఏ వయసు పాఠకులకైనా సరే సౌకర్యంగా ఉందనే మాట వినబడుతోంది! కిందటి సంచికలో, 34 నిమిషాల పాటు సాగిన కథకు వచ్చిన ప్రసంశలు చూస్తే, కథ చిన్నదా, పెద్దదా.. సమయం ఎక్కువా, తక్కువా.. అని లెక్కలు వేయకుండా, కథతో పాటు శ్రవ్యానికి కూడా శ్రోతలు పెద్దపీట వేస్తారని అనిపించింది. ఏదైతేనేం.. కథ నిలబడుతోంది!!

కథామంజరి శ్రావ్యసంచికకి మొదటి నుంచి మంచి ఆదరణ రావడమే కాకుండా, చాలమంది సాహితీమిత్రులు ముందుకు వచ్చి తమతమ గాత్రాలని అందిస్తున్నారు. ఏదో విధంగా కథని ముందుకు తీసుకువెళ్ళాలనే మా ప్రయత్నాలకి శ్రావ్యసంచిక ఓ నిచ్చెన అనిపించింది. అందుకే... ఎందరో గాత్రధారులకు, అందరికీ వందనం!

అన్నట్టు.. ఈ శ్రావ్యకథలకి పశుపక్ష్యాదుల స్పందన ఎలా ఉంటుందో.. పరిశోధకులే చెప్పాలి!!

***సంపాదకుడు.***



# విశిష్ట అతిథి

"గొరుసు"

"మాండలికం అంటే అమితంగా ఇష్టపడతాను నేను... అది ఏ ప్రాంతానికి చెందినదైనా సరే! ఎందుకంటే మాండలికం జీవంతో తొణికిసలాడుతూ సచేతనంగా ఉంటుందని నా నమ్మకం గనుక! అందుచేతనే నేను పెరిగి పెద్దయిన పాలమూరు మాండలికంతో పాటూ, నా మూలాలున్న విశాఖ యాసలోకూడా కథలు రాసేను!" అని చెప్పే ఆయన.. "అభ్యుదయ దృక్పథంతో రాయబడ్డ రచన... అది ఏ రచయిత రాసినదైనా సరే, ఇష్టమే నాకు!" అని అంటారు.

రాసిన కథలు మొత్తం... ముచ్చటగా ముప్పై! అందులో పదంటే పది కథలతో మాత్రం ఒక చిన్న సంపుటి! దాని మీదో ముప్పై పైచిలుకు సమీక్షలు, తెలుగులో పేరున్న ప్రతీ పత్రికలోనూ వచ్చాయి! సమీక్షించిన వారిలో శ్రీమతి బీనాదేవి, శ్రీ మునిపల్లె రాజు, సుప్రభాతమ్ పక్షపత్రిక/ఆంధ్రప్రభ వారపత్రిక సంపాదకులు శ్రీ వాసుదేవరావు, ఆంధ్రజ్యోతి సంపాదకులు శ్రీ శ్రీనివాస్... వంటి లబ్ధప్రతిష్టులు ఉన్నారు! సమీక్షలతో పాటు అనేకమైన పురస్కారాలు కూడా వచ్చాయి! వాటిలో ప్రతిష్టాత్మకమైనదీ, ముఖ్యమైనదీ 'పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం' వారు 2009వ సంవత్సరంలో ప్రదానము చేసిన పురస్కారం. అంతే కాదు.. ఈ సంపుటిపై పని చేసిన పరిశోధకులకు శ్రీ వెంకటేశ్వరా విశ్వవిద్యాలయంలో ఒక ఎంఫిల్లూ, మొత్తం కథలపై ఒక పీహెచ్డీ ప్రదానం చేశారు!

ఇవి మాత్రమే కాకుండా, సంపుటిలో కథలను ఎంతగానో ఇష్టపడ్డ బీనాదేవిగారు, మొత్తం పది కథలనూ ఇంగ్లీషులోకి అనువదించడం ఒక ఎత్తైతే, కొ.కు.గారి కుమార్తె శాంతా సుందరిగారు వాటిలో కొన్నింటిని హిందీలోకి అనువదించడం ఇంకొక ఎత్తు! అందులోనే మరో కథను అల్లాడి ఉమ, ఎం శ్రీధరగార్లు ఇంగ్లీషులోకి అనువదించడం, ఆ అనువాదం అమెరికాలోని 'ఆస్టిన్' నగరంలో ఉన్న 'యూనివర్సిటీ ఆఫ్ టెక్సస్' వారి 'జర్నల్'లో ప్రచురింపబడడం...ఇది మరో ఎత్తు!

ఇక, ఈ రచయిత విషయానికి వస్తే...ఆయన రాసిన కథల్లో కొట్టొచ్చినట్టు కనిపించేదీ, పాఠకుడ్ని కట్టిపడేసేదీ మాండలికం! అది కూడా ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితమైన మాండలికం కాదు. రెండుగా చీల్చబడ్డ ఉమ్మడి తెలుగురాష్ట్రంలో ఒక చివరనున్న ఉత్తరాంధ్ర మాండలికంలో రాసిన కథలు కొన్నైతే, తెలంగాణాలోని పాలమూరు ప్రాంతానికి సొంతమైన మాండలికంలో రాసిన కథలు మరికొన్ని! ఒక పాత్ర మధురమైన ఉత్తరాంధ్ర యాసలో మాట్లాడితే, మరొక పాత్ర సొగసైన పాలమూరు మాండలికంలో సంభాషించడం... సంగీతంలో జుగల్బందీ అంటారు కదా... అటువంటి అరుదైన ప్రయోగం చూస్తాం ఒక కథలో!

ఆ కథాసంపుటి పేరు "గజ ఈతరాలు". ఆ కథా రచనతో 'రెండు ప్రాంతాల వారధి' గా ప్రశంసలు అందుకున్న, ఆ కథా రచయితే 'గొరుసు'. ఆయన పూర్తి పేరు "గొరుసు జగదీశ్వర రెడ్డి" !

'వాసి' తప్ప, 'రాసి'ని ఏమాత్రం లక్ష్యపెట్టని విలక్షమైన రచయిత!

ఉత్తరాంధ్ర మూలాలున్న విశాఖపట్నంలోనే పుట్టిన 'గొరుసు' గారు, బాల్యం, చదువూ రెండూ గడిచింది మాత్రం తెలంగాణాలోని మహబూబ్‌నగర్ జిల్లాలో! యాభయ్యవ దశకంలోనే ఆయన తండ్రి ఉద్యోగరీత్యా 'నైజాము'కు వలసరావడం దానికి కారణం.


'పదిహేనేళ్ళ వయసులోనే సాహిత్యం చదవడం అలవాటైందని' గర్వంగా చెప్పే 'గొరుసు, "ఆ రోజుల్లో మా వనపర్తిలో ప్రముఖ రచయిత్రి పోల్కంపల్లి శాంతాదేవిగారు ఉండేవారు, తరుచూ వాళ్ళ ఇంటికి వెళ్ళేవాడ్ని. నా సాహిత్యాభిలాషకు శాంతాదేవిగారే కారణం!" అంటారు.

మెకానికల్ ఇంజనీరింగులో డిప్లొమా చేసిన 'గొరుసు' ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. 'ఆల్విన్ వాచెస్'లో పదమూడేళ్లూ, ఆంధ్రప్రదేశ్ టూరిజంలో అయిదేళ్లూ పని చేశాక, 'వృత్తీ, ప్రవృత్తీ ఒకటే అయితే బాగుంటుందని భావించి' 2006వ సంవత్సరంలో ఆంధ్రజ్యోతిలో చేరారు. పదకొండేళ్ళు కొలువు తరవాత, 2017లో రిటైర్ అయ్యారు. 'రాయడం కంటే చదవడం చాలా ఇష్టం' అని గర్వంగా చెప్పుకునే గొరుసు, బహుశా ఆ కారణం చేతనేనేమో, 2006లోనే తన కలానికి మూత పెట్టేశారు.

"రాయక తెలుగుకథకి ద్రోహం చేస్తున్నావు నువ్వు" అని చనువున్నవారు ఎవరైనా చిన్న చురక అంటిస్తే... చిరునవ్వు తప్ప సమాధానం ఉండదు ఆయన దగ్గర నుండి!

అసాధారణమైన కథలు వ్రాసి, పేరు సంపాదించుకున్నా.. చాలా సాధారణ వ్యక్తిగా ఉండడానికే ఇష్టపడతారు! మేం మాటాడగానే.. అభిమానంగా ఈ సంచిక విశిష్ట అతిథిగా విచ్చేయడానికి అంగీకరించినందులకు శ్రీ గొరుసు జగదీశ్వర రెడ్డి గారికి ధన్యవాదాలు తెలియచేసుకుంటూ.. మళ్ళీ కలం పట్టి యువ రచయితలకు స్ఫూర్తి కలిగించే కథలను అందించగలరని ఆశిస్తున్నాం!

*కథామంజరి బృందం.*



# కథా మార్గదర్శి

## కీ. శే. రంధి సోమరాజు

ఉత్తరాంధ్ర చరిత్రలోకి వెళితే.. తెలుగు వాడుకభాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తిగారి నుంచి.. తెలుగు సాహితీలోకానికి మణికిరీటం వంటి గురజాడ అప్పారావుగారి నుంచి.. తెలుగుకథా నవలాలోకానికి దివిటీలా వెలుగులనిచ్చే రావిశాస్త్రి వంటి ఎందరో కథా రచయితలు, రచయిత్రులు కనబడతారు. బాగా జనబాహుళ్యం ఉన్న వారే కాకుండా.. ఇంకెంతో మంది ఆణిముత్యాల్లాంటి కథలు అందించినవారు కూడా చరిత్రపుటల్లో కనబడతారు. రావిశాస్త్రి, చాసో, కారా మాష్టారు..వంటి కథామార్గదర్శకుల తరానికి చెందిన మరో సుప్రసిద్ధ కథకులు, కవి కీ.శే. రంధి సోమరాజుగారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. వ్యాపార, సాహిత్య రంగాలు ఓ విధంగా భిన్నధృవాలని అంటారు. ఈ రెండు రంగాల్లో ఏ రంగంలో ఉన్నా.. రెండో రంగం వైపు కన్నెత్తి చూడరు. ఓ రకంగా పొసగదు కూడా! కాని అతి తక్కువలో తక్కువ మంది మాత్రమే ఈ రెండు రంగాల్లో రాణించారు. వ్యాపారరంగంలో ఉంటూ సాహిత్యాభిమానం చూపించేవారు, పోషించేవారు మనకి తటస్థ పడతారు గాని, రెంటిలో నైపుణ్యం చూపెట్టిన బహు తక్కువ కథారచయితల్లో మొన్నటి తరానికి చెందిన సోమరాజుగారిలో చాలా ప్రత్యేకతలు ఉన్నాయి. స్వతహాగా ఆయన కవి. ఉత్తరాంధ్ర మాండలికంలో కవిత్వం వ్రాసిన తొలి సాహితీమూర్తిగా ఆయనకి పేరుంది. ఆ అనుభవం తోనే అనేక కథలు కూడా ఆ మాండలికంలో వ్రాసారు. సోమరాజుగారి కవిత్వంలో కథలు కనబడవు, కథల్లో కవిత్వం కనబడదు.. ఇదో ప్రత్యేకత అని చెప్పుకోవాలి! తన దైనందిన జీవితంలో ఎదురయ్యే.. ఎన్నో విషయాల మీదే కథలు వ్రాసారు. విలక్షణమైన శైలిలో సోమరాజుగారి కవిత లైనా, కథలైనా, నవలలైనా, వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టినట్టే ఉంటాయి. “ఆకాశం ఇంత విశాలంగా ఎందుకుంది, ఈ మనిషి ఈ లోకం, పనికిరాని మనిషి, పురాణం కబుర్లు, బలే సినిమాలు, బాధ పడిన గుండే...” వంటి అరవై డెబ్బై కథలు వ్రాసిన సోమరాజుగారు.. నాలుగు నవలలు, గేయ నాటికలు, గేయాలు కూడా వ్రాసారు. 1970లో ఆంధ్రాలో విద్యార్థులు చాలా ఉద్యమాలు నడుపుతున్న రోజుల్లో సోమరాజు గారు వ్రాసిన “పొద్దు” కవిత్వం చాలా జనరంజకం అయింది. ఆర్.ఎస్. సుదర్శనం, శ్రీశ్రీ, ఆరుద్ర, దాశరథి, సంజీవ్‌దేవ్, యస్వీ జోగారావు, పురాణం సుబ్రహ్మణ్య శర్మ, కాళోజి.. వంటి సాహితీ దిగ్గజాలు కూడా సోమరాజుగారి రచనలని మెచ్చుకునేవారు!

విజయనగరం జిల్లా బొబ్బిలి ప్రాంతంలో వ్యవసాయ కుటుంబంలో, 1 మార్చి, 1927వ తేదిన జన్మించిన సోమరాజుగారు.. తర్వాత కాలంలో రాజమండ్రి వలస వెళ్ళిపోయారు. సమకాలీన సాహిత్యాన్ని బాగా ఆకళింపు చేసుకుని, తన పదమూడో ఏటే కథ వ్రాసారు. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ, మరో చేత్తో రచనలు చేసిన సోమరాజుగారు, తర్వాత కాలంలో విశాఖపట్నం చేరి, ఓ ప్రముఖ కూల్‌డ్రింక్ పరిశ్రమలో వాటాదారుడిగా, ఆ పరిశ్రమన్ని జయప్రదంగా నడిపారు.

జీవితంలో చాల ఒడిదుడుకులు ఎదురైనా సరే, ధైర్యంగా ఎదుర్కుంటూ, మరో వైపు సాహితీ వ్యాపకాన్ని నిరాటంకంగా కొనసాగించారు. ఎంత ఎత్తు ఎదిగినా సరే, ఒదిగి ఉండే మహామనిషి సోమరాజుగారు.

చాలా కాలం నుంచి రంధి సోమరాజుగారి గురించి అన్వేషిస్తుంటే, చివరికి మిత్రులు, ప్రముఖ పాత్రికేయులు శ్రీ బి.వి. అప్పారావు గారు.. వివరాలు అందించారు. వారికి ధన్యవాదాలు. మొన్నటి తరంలో కనుమరుగై పోతున్న రత్నాలలో మేలిరత్నం కీ.శే. రంధి సోమరాజు గారిని ఈ సంచిక కథామార్గదర్శిగా తలుచుకోవడం అదృష్టంగా భావిస్తూ, వారికి ఘనమైన నివాళి తెలియజేసుకుంటున్నాం!

**కథామంజరి బృందం**

పత్రికా పరిచయం

## ఆనందవాణి

*1934 లో ఈ వారపత్రిక తొలి సంచిక వెలువడింది. మద్రాసు నగరం నుండి ప్రతీ ఆదివారం ఈ సంచిక విడుదలైయేది. ఈ వారపత్రికలో.. కథలు, ధారావాహికలు, రాజకీయ విషయాలు, జోకులు, సాహిత్య వ్యాసాలు, పుస్తక విశ్లేషణలతో పాటు నక్షత్రఫలాలు కూడా ప్రచురింపబడేవి. శ్రీశ్రీ, పురిపండ, గరిమెళ్ళ సత్యనారాయణ, భోగరాజు సీతారామయ్య, బుచ్చిబాబు.. వంటి ఎందరో ప్రముఖుల రచనలు ఈ పత్రికలో చోటుచేసుకున్నాయి! ఆరుద్ర, రావి కొండలరావు వంటివారు ఈ పత్రికలో సబ్ ఎడిటర్స్‌గా పనిచేసారు. ఇంతమంది సాహితీ ప్రముఖుల హస్తాల మధ్య ఈ పత్రిక ముస్తాబు అయ్యేదంటే.. ఎంత విలువైన సాహిత్యం అందించేదో వేరేగా చెప్పక్కర్లేదు!*

*మూడు దశాబ్దాల పాటు పాఠకులను అలరించిన ఈ పత్రికలో ప్రచురింపబడ్డ రచనలకి పారితోషికాలు ఇచ్చేవారు కాదుట! అయితే ప్రముఖ కథా రచయిత భమిడిపాటి రామగోపాలం గారి రచన ఈ పత్రికలో ప్రచురింపబడిన తర్వాత, పారితోషికం కోసం ఉత్తరాల మీద ఉత్తరాలు వ్రాసి, చివరికి పారితోషికం అందుకున్నారుట!*

## చంద్ర కన్నెగంటి గారి " కథ కథ"

చంద్ర కన్నెగంటి గారు రాసిన ఈ 'కథ కథ' ఒక ప్రయోగం. ఆయన రాసిన చాలా కథల్లో వైవిధ్యమైన కథనం కనిపిస్తూంటుంది. అమెరికాలోని డల్లాసు నగరంలో నివసిస్తూన్న ఈ రచయిత గత మూడున్నర దశాబ్దాలుగా రాసిన ఎన్నో కథలు, కవితలు వివిధ పత్రికలలో అచ్చయ్యాయి. సంకలనాలుగా కూడా వచ్చాయి. "రచయితగా నేనేమీ పాఠకుడి కంటే నైతికంగానూ, భౌతికంగానూ ఉన్నతస్థాయిలో లేను" అన్న, అనగలిగిన అతి వినయమూర్తి చంద్రగారు.

చంద్రగారు రాసిన ఈ కథ ఓ కథ కథ. కథ పేరు కూడా అదే. కథ తన కథంతా పాఠకుడితో సంభాషణా రూపంలో మాట్లాడుతూంటుంది. అదొక ఏక దిశా సంభాషణ. కథలో రెండే పాత్రలు. కథ, పాఠకుడు. పాఠకుడితో 'కథ' చెప్పే కథ ఇది. కథకు అస్తిత్వాన్నిచ్చే రచయిత ఇక్కడ లేడు.

కథకు ఒక అంతరంగమంటూ ఉంటే అదెలా ఉంటుంది? కథ తన మనసులో మాట బయట పెడితే? కథని పాఠకుడెందుకు చదువుతాడు? ఏమాశిస్తాడు? కథ చదివే పాఠకుడికీ, కథకీ ఉన్న అనుబంధమేమిటి?

మీరు చదివే కథలకన్నా భిన్నంగా ఉండబోతున్నానని చెబుతూ, "మీరు నన్ను ఎందుకు చదువుతున్నారో, నా నుంచి ఏమి ఆశిస్తున్నారో నాకు తెలియదు. మీకు నిరాశ కలగనివ్వనని హామీ ఇవ్వలేను." అంటుంది.

అంతే కదా! నిరాశ ఇవ్వనని, ఇస్తానని ఏ కథ హామీ ఇవ్వగలదు? నీతులు కావాలనుకుంటున్నారా? అయితే ఈ కథ చదవక్కరలేదంటుంది.

కథను చదివిన తరువాత పాఠకుడు ఒక విమర్శకుడిగా మారిపోతే?

"నాకు తెలుసు మీరు నా ప్రతి అక్షరాన్నీ చదువుతూ ఉన్నారనీ, వాక్యం వాక్యాన్నీ శల్య పరీక్ష చేస్తూ ఉన్నారనీ. బహుశా ఆద్యంతమూ రకరకాల కోణాల్లో పరిశీలిస్తున్నారేమో! పాత్రలూ, సన్నివేశాలూ, సంభాషణలూ, వర్ణనలూ, శిల్పమూ, శైలీ – ఒక్కొక్కటీ వొలిచి చూడాలని ప్రయత్నిస్తారేమో! మీ తీర్పు కోసం నగ్నంగా పరుచుకుని ఉన్నాను. సిగ్గూ కాదు, గర్వమూ లేదు. గుచ్చి గుచ్చి చూసి ఒక్కో లోపాన్నీ ఎత్తి చూపినా, మౌనంగా స్వీకరించక తప్పదని తెలుసు."

కథలలో లోపాలుండవా? తనైనా అంతే కదా!

"నాలో లోపాలు లేవని చెప్పను. అక్కడక్కడా అచ్చుతప్పులు ఉంటాయి. కొన్ని చోట్ల అరాలే ఎరిపోవ. వాక్యం సగంలో. అనవసరమైన చోట కామాలు ఉంటాయి. చెప్పిన దాన్నే తిరిగి చెప్పడం ఉంటుంది. తప్పుడు సామెతలు, పాయసంలో ఎముకలా అడ్డు తగులుతాయి. సరిగ్గా అతకని పోలికలు, బొట్టు బిళ్ళల్లా జారుతూ ఇబ్బంది పెడతాయి. చెప్పిన దాన్నే తిరిగి చెప్పడం ఉంటుంది. ఉన్న తప్పులకూ ఒక క్రమం ఉండదు, నిలకడ ఉండదు. ఒక్కసారిగా లభించిన స్వేచ్ఛ వల్ల కలిగిన అతిలాలసత్వం మరొకటి. ఇవి కాకుండా నాకు తెలియనివీ, తెలిసీ చెప్పనిచ్చగించనివీ మరికొన్ని."

కథంతా పాఠకుడికి ఏం కావాలో అదే ఉంటుందా? నిక్కచ్చిగా చెప్తుంది.

“మీ వినోదానికై మూతికి లిప్‌స్టిక్ రాసుకున్న కోతిని కాలేను. మీ కాళ్ళ చుట్టూ తెరుగుతూ మీ అటెన్షన్ కోసం పాట్లు పడే కుక్కపిల్లను అంతకంటే కాను. ఆ ప్రయాసలన్నీ పడబోను.”

మరి రచయిత కథను తనకిష్టమైనట్లు రాస్తానంటే కథకు కష్టంగా ఉండదా?

“తన తెలివితేటలు చూపుకోవడానికో, తనకే తెలుసునన్నట్టో, తను కనక ఇట్లా రాయగలనని చాటింపు వేసుకోడానికో, నలుగురి మెప్పు కోసమో నన్ను నానా తిప్పలు పెట్టడం చిరాగ్గా ఉంటుంది.

“ఆ చెత్తంతా ఎందుకు మోయాలి నేను? రచయిత చేతుల్లో కీలుబొమ్మల్లా ఆడే పాత్రలూ, సానుకూలంగా జరిగే సంఘటనలూ, పొద్దికగా కుదిరే ముగింపు తోటీ ప్రణాళికాబద్ధంగా ఎక్కడికక్కడ సర్దుకుని భలే భలే అనుకుంటూ పడుండలేను. అవసరమయితే అనవసరమూ అవ్వాలని ఉంటుంది.”

మరి కథకూ, పాఠకుడికీ మధ్య ఏం జరుగుతోంది?

“మీరు చదువుతున్నంతసేపూ నేను ఉంటాను. మీరూ ఉంటారు. ఇక్కడ రెండే పాత్రలు. మీరూ, నేనూ. మరొకరి ప్రమేయం లేదు. అంతా మనిద్దరి మధ్యే. మీరు చేయగలిగిందల్లా చదవడం. నేను చేయగలిగిందల్లా చదవబడడం. నన్ను చదివినట్టు మిమ్మల్నీ చదవాలన్న తీవ్రమైన కాంక్ష కలుగుతుంది. నా వొక్కో వాక్యమూ మీ మనసులో ఏ భావాన్ని రాజేస్తుందో తెలుసుకోవాలని ఉంటుంది.”

పాఠకులు లేకపోతే కథలున్నాయా?

“...మీరు చదవందే నేను లేనట్టే. ఎవరూ గమనించకపోతే మీరైనా జీవించనట్టే కదా! నిజమే, మీకు నా అవసరం కంటే నాకు మీ అవసరమే ఎక్కువ. ఇక్కడ మాత్రం అనిపిస్తుంది హఠాత్తుగా మీ మనసును రంజింపజేసే బాధ్యత నామీద ఉందేమోనని. ఒక పాత్రకన్నా నాలో చోటిద్దామని. కనీసం మీలాంటి పాత్రకి.”

“... నేను మీకు నచ్చకపోయి ఉండవచ్చు. ఫర్వాలేదు. నాకంటే బాగున్న కథ మీకు ఆ పక్కనే దొరకవచ్చు. మీకంటే మెచ్చుకునే పాఠకుడూ మరొకరు నాకు దొరకొచ్చు. మీరు మళ్ళీ చదవాలని వస్తే నేనిక్కడే ఉంటాను. కానీ మరవకండి, మీకు నచ్చినా నచ్చకపోయినా ఇప్పుడు నేను మీలో ఒక భాగం.”

“ఇది నా చివరి వాక్యం కావడం కంటే విశేషమూ లేదు, ఇక చెప్పదగిందీ లేదు”

సరిగ్గా అతకని పోలికలు బొట్టు బిళ్ళల్లా జారుతూ ఇబ్బంది పెడతాయని చెప్పడం రచయితగా చంద్రగారి కలం నుండి జాలువారిన ఒక మంచి ఉపమానం.

రచయిత చేసిన అద్భుత ప్రయోగం ఇది. కథకి ఆలోచనుంటే, మాటలొస్తే..... కథ చెప్పిన ఈ కథ చదవాలి తప్పనిసరిగా.

ఈ కథ ఈమాట అంతర్జాల పత్రిక, మార్చి 2011 సంచికలో ప్రచురితమైంది. చదవదల్చుకున్నవారు ఈ క్రింది లంకెలో చూడవచ్చు. https://eemaata.com/em/issues/201103/1700.html

***పరిచయకర్త – శాయి రాచకొండ,***

**‖ అక్టోబర్ 2024 శ్రావ్య సంచిక కథల మీద యూట్యూబ్‌లో వచ్చిన స్పందనల్లో కొన్ని.. ‖**

“జ్ఞాపకాల మణిహారాలు” కథలో.. నీరజ బాల్యస్మృతులను, వర్తమాన సంఘటనలతో పెనవేసుకుంటూ నడిచిన కథ కన్నా, భావయుక్తంగా చదివిన తీరు బాగుంది. ఇద్దరికీ అభినందనలు.

**పి. విశ్వప్రసాద్ రెడ్డి**

నేను రాసిన “జ్ఞాపకాల మణిహారాలు” కథకు మీ గళం తొడవ్వడం ఎంతో సంతోషంగా ఉందండి. మనసుకు హత్తుకునేలా చదివారు. చాలా చాలా థాంక్స్ శరత్ జ్యోత్స్న గారు... కథామంజరి టీమ్‌కు నా నమస్సుమాంజలులు...!

**సీత సుస్మితా**

“సంక్షేమం” కథ చాలా చాలా బాగుంది. మంచి ఆలోచన తో కథ సాగింది. కథ పేరు కూడా సరిగ్గా సరిపోయింది. శ్రీమతి సరస్వతి గారు చక్కగా చదివి వినిపించారు.

**భాను కొవ్వలి**

రిక్షా ప్రయాణం... అర్నాద్‌గారు చాలా అంటే చాలా సున్నితంగా అన్నికోణాలని తన కథలో సృజించారు. ‘ముందిస్తరాకు కష్టజీవికే వెయ్యాల’ ఈ కథలో ఇస్తరాకు ముందెవరికి యెయ్యాల? రాసినోరికా సదివి యినిపించినోరికా! ఇద్దరినీ మనసులో కూకో పెట్టీసుకుని ఆప్యాయంగా బువ్వ పెట్టీస్తాను. ఈ బోగారావు అనబడే అయన దిబ్బమ్మలో వున్నారా, చిట్టిలో వున్నారా, చిట్టికి జాం కాయిచ్చిన రిక్షావాళ్ళో కనిపిస్తారా? యిది బహుశా కథామాజరిలో ఈనెల ‘హై లైట్’ ... దాచుకుని మళ్ళీ మళ్ళీ వింటాను! మా వాళ్ళకి వినిపిస్తాను. ముందు నేను యేవిట్రా బాబూ ఇంత నిడివి కథ.. అనుకున్నా.. కానీ నన్ను నేను మరిచిపోయా! ఆరోజుల్లోకి వెళ్ళిపోయా!! భోగారావు గారిని పొగడటం దేనికి? యిలాటి కథలని ఆయనే భుజాని కెత్తుకుని చదువుతారు. మన పొగడ్తలు దిబ్బమ్మ రిక్షా వాడికి పెట్టిన అన్నం కన్నా, పాతిక రూపాయలుకన్నా తక్కువే!

**వి, విజయకుమార్**

"మడత పేచీ" కథని చక్కని స్వరంలో వినిపించిన మంచి హాస్య కథ. అయితే నేపథ్య సంగీతం హెచ్చు స్థాయిలో ఉన్నందువల్ల సరిగ్గా ఆస్వాదించలేకపోయాం.. సరి చేయగలరు.

**లక్ష్మీ బి.**

"జంబువనంలో ఒక రోజు .." వస్తువు చిన్నదైనా చక్కగా చెప్పారు.. వినిపించారు... జంతువులకి పేర్లు పెట్టడంలో కూడా నవ్యత వుంది... కథలో కాస్త పంచతంత్రం సింహం కుందేలు ప్రస్తావన జగడం తేవడం విశేషం! కథ వినిపించిన వారు తన ప్రయత్నంలో సఫలీకృతులు అయ్యారు... ఇట్ ఇస్ ప్లేసెంట్.... మెసేజ్, వెల్ సెడ్!

**వి. విజయకుమార్**

కథ బావుంది. సింపుల్‌గా అర్థం అయ్యే లాగా ఉంది. పంచతంత్రం కథ వింటున్న భావన కలిగింది. శ్రీ రాఘవరావు గారు కుందేలు పాత్రకి గొంతు మార్చి భలే చెప్పారు. చక్కగా స్పష్టంగా చదివి వినిపించారు.


**భాను కొవ్వలి**

## బాలకథ

బాలకథ ప్రకటనలకు అనూహ్యమైన స్పందన వచ్చింది. కథలు వ్రాయడంలో పిల్లల్ని ప్రోత్సహించాలని తలపెట్టిన ఈ మా ప్రయత్నంలో. రెండు కథలే పిల్లలు వ్రాసినవి వచ్చాయి. ప్రచురించడానికి స్వీకరించిన వాటిలో పెద్దల కథలే ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. ప్రస్తుతం ప్రచురణకి స్వీకరించిన బాలకథల ప్రచురణకు కనీసం ఎనిమిది మాసములు పడుతుంది. ఈ విషయాన్ని రచయితలు గమనించవలసిందిగా కోరుతున్నాం. అయితే పిల్లల రచనలకు మాత్రం ఈ సూచన వర్తించదు. వారి కథలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది!

**కథామంజరి బృందం**

# కథాపుస్తక పరిచయం




## జక్కదొన

తెలుగు కథాసాహిత్యంలో.. ఈ తరం కథకుల్లో శ్రీ ఆర్. సి. కృష్ణస్వామి రాజుగారి పేరు వినని కథాప్రియులు ఉండరు. ప్రతి జీవిలోనూ మంచిని చూపెట్టే కథలు, వాదాల వెంట కాకుండా, మానవతావాదంతో కట్టిపడేసే కథనంతో కథలు వ్రాసే కృష్ణస్వామి రాజుగారి 17వ పుస్తకం ఇది. సెప్టెంబర్ 2024 లో విడుదలైన ఈ కథల సంపుటి వెల రు.140/-.

ప్రతులకు

22-4-71, బ్యాంక్ ఎంప్లాయీస్ కాలనీ,
అక్కరాంపల్లి పోస్ట్,
**తిరుపతి - 517507**
✆ 9393662821
Email: rckrajulic@gmail.com

*ఈ కథాసంపుటి ప్రముఖ పుస్తకాల షాపుల్లో కూడా లభ్యమవుతుంది.*

---

పత్రికా పరిచయం

## చిత్రగుప్త

*జాతీయ హాస్యరస పక్షపత్రికగా ఆచార్య ఎన్.జి. ఆచార్య గారి సంపాదకత్వంలో మద్రాసు నుంచి ఈ పత్రిక 1928లో పురుడుపోసుకుంది. ముఖచిత్రంగా ఓ రాజకీయ కార్టున్, వెనుక అట్ట మీద మరో కార్టూన్ వేసేవారు. ఈ సంచికలో చిత్రసీమ విషయాలు, వ్యంగ్యరచనలు ఎక్కువగా ఉండేవి. సుమారు మూడుదశాబ్దాలు పైగా నడిచిన ఈ సంచికలో లేఖలు, కార్డు కథలు, చిత్రగుప్త డైరీ, ఇతరత్రా శీర్షికలు ఉండేవి. రాయప్రోలు సుబ్బారావు, అనిసెట్టి, ఘండికోట బ్రహ్మాజీరావు, తూమాటి దోణప్ప, కప్పగంతుల సత్యనారాయణ మొదలగు ప్రముఖుల రచనలు ఈ సంచికలో ప్రచురింపబడ్డాయి! ఎన్. మునుస్వామి మొదిలియార్ గారు ఈ పత్రిక ప్రచురణకర్త. ఈ పత్రికను, ఓ రకంగా.. మొట్టమొదటి తెలుగు సినీ పత్రికగా చెప్పుకోవచ్చు!!*

# పంట పొలాలు

చొప్పదండి సుధాకర్

✆ 9177348349

> *"చదువంటే లోకజ్ఞానం కోసం, ఉద్యోగం అంటే ఏ బతుకుతెరువూ లేని వాళ్ళ కోసం! మన కెందుకు నాయనా? భూతల్లిని నమ్ముకో నాయనా... ఆమె నిన్నెప్పుడూ మోసం చేయదు! పదేళ్ళు ఉద్యోగం వెలగబెట్టిన వాడే మళ్ళీ భూతల్లి ఒడిలోకి రావాలని ఆశ పడుతున్నాడు కదరా! మళ్ళీ నువ్వు పదేళ్ళు గొడ్డు చాకిరి చేసి, తిరిగి పంటపొలాల వైపు తిరిగి రావడం కన్నా.."*

అతడు రమేష్ ......!

రమేష్ చెరువు కట్టపై అచేతనంగా కూర్చొని ఉన్నాడు. సాయంకాలం సూర్యుడు పడమర వైపు దిగిపోతూ 'ఇంకాసేపటికి వెళ్లొచ్చులే' అన్నట్టు నిదానంగా కదులుతున్నాడు. రమేష్ ఆలోచనలు వివిధ కోణాల్లో ఇష్టారాజ్యంగా కదులుతున్నాయి. వెనకవైపు చెరువు గలగలలు లయబద్ధంగా వినిపిస్తోన్నా, మనసు మాత్రం ఇక్కడ లేదు.

నీటి మీదుగా మంద్రంగా వీచిన గాలి, శరీరాన్ని సున్నితంగా పలకరిస్తోంటే ఒకింత స్పృహలోకొచ్చి చుట్టూ చూశాడు. సగానికి పైగా నిండిన చెరువులో రకరకాల చేపలు పక్షులు ఉబుసుపోక అటూ, ఇటూ ఎగురుతూ జలదృశ్యానికి మరింత రమణీయతను సంతరింపచేస్తున్నాయి. కుడిపక్క చెరువు, ఎడంపక్క కట్టకింద కళ్ళకు తమ శక్తి మేర ఆహ్లాదాన్ని పంచుతూ పంటపొలాలు, పొదలు తుప్పలు. ఎవరూ పట్టించుకోకున్నా ఏపుగా పెరిగిన వేపచెట్లు... ఇంకా కంచి పట్టుచీరకు జరీ అంచులా పక్కనే ఒంపుసొంపులు మెలికలుగా తిరిగి ఒయ్యారాలు పోతోన్న చిన్నపాటి సెలయేరు!

రోజూ చూసేదే అయినా అతడికా దృశ్యం నిత్య నూతనంగా కనిపిస్తుంటుంది. అక్కడక్కడా విరిసిన పుష్పసమూహాలు అన్నీ గమనిస్తూ మౌనంగా మిగిలిపోతోన్న పరిసరాలు... ఎవరో అదృశ్యంగా చిలకరించిన పరిమళాల సహజ సుగంధాలు విరజిమ్ముతాయి. వీటన్నిటికి తోడుగా కొద్ది దూరంలో నిటారుగా నిలబడి సాటిమనిషికి ధైర్యం చెబుతున్నట్టుగా కొలువైన తాటివనం.

ప్రకృతిని చూసి మనిషి బొమ్మలేయడం నేర్చుకున్నాడా, బొమ్మలను చూసి ప్రకృతి అందంగా ముస్తాబయిందా...? ఏం పిచ్చి ప్రశ్న! తాత మొహం అచ్చు మనవడిలా ఉన్నదన్నట్టు... ఎక్కడో చదివినట్టు గుర్తు! మనిషి అమ్ముడు పోతూ, భూమి అమ్ముతున్నానని చెప్పడంలాంటిదే! వాస్తవానికి భూమిని ఎవరు అమ్మగలరు? ఆ మాట వింటే భూమి ఫక్కున నవ్వదా!?

దూరంగా నాలుగైదు మోటారు సైకిళ్ళు ఆగి ఉన్నాయి. వాటి పక్కనే కొంతమంది దళారులు అటూ ఇటూ చేతులు ఊపుతూ పెద్దగా మాట్లాడుతున్నారు. మధ్య మధ్య నవ్వుతూ ఆ ప్రాంత గొప్పదనాన్ని విశ్లేషిస్తున్నారు. దూరంగా ఉన్నా మాటలు స్పష్టంగానే వినిపిస్తున్నాయి. పొన్నాల.. సిద్ధిపేట పట్టణానికి ఆనుకొని ఉన్న కుగ్రామం. ఏం జరిగిందో ఏమో గాని, గత

మూడేళ్ళుగా ఒకటే ల్యాండ్ బూమ్... సునామీలా దాన్ని చుట్టుముట్టింది. పట్టణానికి పది కిలోమీటర్ల పరిధిలో అన్ని రకాల భూముల ధరలకు రెక్కలొచ్చాయి. వేలు విలువ చేసేవి లక్షల్లో, లక్షలవి కోట్లలో ధరలు పెరిగి మండిపోతున్నాయి. సిద్ధిపేట రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో రోజూ సందడే... కొమురవెల్లి జాతర చందమే! సైట్ మ్యాపులు దస్తావేజులూ నోటరీలు, చెట్లకిందనే బయానాలు.. అకడక్కడా ఛాలెంజిలు, సిగపట్లు, మారుబేరాలు.. అబ్బో అదో వర్ణింప అలవికాని దృశ్య సమూహం!




దళారులు, అమ్మేవారు, కొనేవారు అంతా మనవారే... మనుషులు కదా! ఏది లాభంగా ఉంటే అదే చేస్తారు. పైసాలోనే పరమాత్మ ఉందంటే అతిశయోక్తి ఏమీ కాదు!

"నర్సింలూ అనేది అదే!" రమేష్ గుర్తు చేసుకొన్నాడు.

"ఒరే చెబితే కొంచం అసహ్యంగా ఉంటుందేమో గానీ, ఇవాళ జనం సుఖాలకు విపరీతంగా అలవాటు పడిపోయారు. కాదు కాదు అడిక్ట్ అయిపోయారు. రిమోట్ దొరక్కపోయినా టీవి చానల్ మార్చవచ్చని తెలిసినా, దానికోసం కొట్టుకు చస్తున్నారు. అది దొరికేదాకా బీపి పెంచుకు చస్తున్నారు. ఒకప్పటి పారిశ్రామిక విప్లవం ఇలా బెడిసికొడుతుందని తెలిస్తే, ఆ ప్రక్రియ అప్పుడే ధ్వంసం చేసేవారేమో? మనిషికిపుడు సుఖమే పరమావధి! అందునా ఈజీమనీ కావాలి. తాను కష్టపడకుండా ఎవరి కష్టం మీదో బతకాలి. ఇందుకు ఆడా మగా తేడా లేదు. పల్లె, పట్టణం అనే మాటే లేదు!

నర్సింలూ, రమేషూ డిగ్రీ క్లాసు మేట్స్... నిర్మల కూడా! అదేమిటో గానీ నర్సింలు పట్టిందల్లా బంగారమే. వాడికి పెళ్ళయి ఆరేళ్ళు దాటిపోయింది. అబ్బాయి స్కూల్ కెళుతున్నాడు కూడా! రమేష్ ప్రేమ మాత్రం నిర్మల దగ్గరే ఆగిపోయింది. పదేళ్ల

ప్రేమకు ఇంకా ముగింపు దొరకలేదు.

రమేష్ పెదాలపై ఓ చిరునవ్వు రాబోతూ ఆగిపోయింది. కారణం చేతిలోని స్మార్ట్‌ఫోన్ మోగడమే. దాని వైపు చూసాక ఇందాక రాబోతూ ఆగిపోయిన చిరునవ్వు నిస్సంకోచంగా ఆవిష్కృతమైంది!

"నిమ్మీ" నిర్మలను తలచుకొని ఫోన్ లిఫ్ట్ చేయబోయాడు. అంతలోనే కాల్ కట్ అయింది!

నర్సింలుకి తాము ప్రేమలో ఉన్నట్టు తెలుసు. గతం గుర్తు చేసుకున్నాడు రమేష్. నిర్మల గుర్తుకి రాగానే మనసంతా అదోలా అయిపోయింది. కొంత ఆనందం, ఎక్కువ విషాదం, ఎక్కువ ఆనందం, కొంత విషాదం కలగలసిన ఒకానొక మానసిక స్థితి... అనిర్వచనీయ అనుభూతి! రమేష్‌కి చదువు పుష్కలంగా ఉన్నా కోరుకున్న ఉద్యోగం రావడం లేదు. నిర్మలకేమో ఉద్యోగం సిద్ధంగా ఉన్నా చేయడానికి మనసొప్పడం లేదు.

"నిన్ను పెళ్లి చేసుకొని, ఇద్దరు ముగ్గురు పిల్లల్ని కనేసి, చచ్చేదాకా నీకు వాళ్లకు సేవ చేసుకోవడమే నా అసలయిన ఉద్యోగం!" అంటుంది స్వచ్ఛంగా!

"అదేం పాత చింతకాయ బుద్ధీ!" ఎగతాళిగా అన్నాడు.

"ఎందుకూ...?" ఉడుక్కుంది నయనమనోహరంగా.

"చక్కగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్కో... అదీ అద్దాల మేడలో!"

"ఏమొద్దు! నా దృష్టిలో కాపురం చేసుకోవడమే మంచి ఉద్యోగం. అదీ ఎవరూ ఊహించని రీతిలో మొగుణ్ణీ, అత్తామామలని ప్రేమిస్తూ, పిల్లల్ని పెంచి పెద్ద చేస్తూ, వంటలు వండుతూ, కోపానికి గురవుతూ, ప్రతిగా అలుగుతూ తిడుతూ, తిట్లు పడుతూ ఓహ్... అదో అద్భుతలోకం!" నిర్మల గొంతులో పరవశం.

"వెర్రి బాగా ముదిరింది!" తెచ్చిపెట్టుకొన్న కోపంతో అన్నాడు రమేష్.

"ఉహూ... దీన్ని మీ ఊళ్ళో వెర్రి అంటారేమో, మా ఊళ్ళో ప్రేమా, ఉత్తమ ఇల్లాలు, ఆదర్శదాంపత్యం... ఇంకా అదేదో అంటారు!" దీర్ఘం తీస్తూ చెప్పింది .

"నిన్నెవడు చేసుకుంటాడో గానీ... వాడు ఉద్యోగం సద్యోగం ఏదీ చేయడు. నీ కొంగు పట్టుకొని తిరిగి సర్వ నాశనమై పోతాడు"

"హూ... నీకలా అర్థమైందా..." అటు నుండి గాఢమైన నిట్టూర్పు.

"ఒక వేళ మన పెళ్ళే కాలేదనుకో... ఎలా?"

నిర్మలనుండి అయిదారు సెకన్ల మౌనం.

"కొంపదీసి చచ్చిపోతావా ఏమిటి?" సరదాగా అడిగినట్టు అనిపించినా, అతడి గొంతులో లీలగా భయం పొడసూపింది.

"నో... అసలు పెళ్ళే నా జీవితంలోంచి బహిష్కరిస్తాను!" కళ్ళు చెమర్చినాయి కాబోలు... మొహం అటువైపు తిప్పుకొనేది.

ఆ తడి గొంతులో ప్రతిఫలించేది. అయిదేళ్లుగా ఇదే తంతు. కలిసిన ప్రతిసారి ఇవే మాటలు!

ఫోన్ మళ్ళీ మోగింది. అదే నిర్మల... అదే నిమ్మీ! ఈసారి లిఫ్ట్ చేయక తప్పలేదు. ఎందుకంటే ఆలోచనల్లో పడి గమనించలేదు గాని, అది ఐదో మిస్డ్ కాల్!

"చెప్పండి నిర్మలా మేడం!" నిర్లిప్తంగా విష్ చేశాడు రమేష్.

అటు నుండి నిశబ్దం మాట్లాడుతున్నట్టు, మళ్ళీ మౌనమే!

"ఇందుకేనా ఫోన్ చేసింది?" అతడి గొంతులో ఇష్టమైన నిష్టూరం.

"కాదు నీ గొంతు వినాలని!" ఆమె మాట స్థిరంగా, మంద్రంగా ఉంది.

"నిర్మలా! ఒత్తిడితో తల్లడిల్లిపోతున్నాను."

"ఇక్కడ నా గతీ అంతే! రామకోటి రాసినట్టు ఒకటే మాట... 'పెళ్లి చేసుకో, పెళ్లి చేసుకో' అని చంపుతున్నారు!"

"ఏం చేయాలో తోచడం లేదు!" రమేష్ అభావంగా అన్నాడు.

"చేసేదేముంది? అనుకున్నది సాధించే శక్తి లేనపుడు, జీవితం ఎటు తీసికెళ్తే అటు వెళ్ళడమే!"

కొద్దిసేపటి తర్వాత కాల్ కట్ అయింది. రమేష్‌కి మళ్ళీ ఫోన్ చేయాలనిపించలేదు. ఎందుకో గాని మనసుని కొద్దిసేపు బాధగానే ఉంచాలనిపించింది. అలాగయినా తన పిరికితనానికి తగిన శిక్ష విధించుకొన్నట్టుగా ఉంటుందేమోనని... మసక చీకట్లు కమ్ముకొంటుంటే, నిస్సత్తువగా కట్ట మీది నుంచి లేచి ఇంటి వైపు బయల్దేరాడు. మనసంతా ఖాళీ ఖాళీగా ఉంది. ఇంటి నుండి పొలానికి వెళ్తున్నాడో, పొలం నుండి ఇంటికి వెళ్తున్నాడో తెలియడం లేదు.

చేతిలో సెల్ ఫోన్ మళ్ళీ మోగింది.

'మళ్ళీ నిమ్మీయే' అనుకొంటూ ఫోన్‌కేసి చూశాడు. ఈ సారి నిమ్మి కాదు... నర్సింలు! లిఫ్ట్ చేశాడు.

"హాయ్‌రా రమేష్" అటు నుండి పలకరింపు!

"హాయ్..." అన్యమనస్కంగానే బదులిచ్చాడు.

"ఏరా... డల్‌గా ఉన్నావ్" నర్సింలు అసలే ఆవులిస్తే పేగులు లెక్కబెట్టే రకం! రమేష్ బదులివ్వలేకపోయాడు.

"సర్లే... నీ సంగతి తెలియందేముంది, అన్నిటికీ తటపటాయింపే! అది పోనీ మీ ఊళ్ళో ఎక్కడయినా పదెకరాల పొలమయినా, మెట్టభూమయినా ఉందా... కొనడానికి!"

"ఎందుకురా?" షాకుల మీద షాకులు తట్టుకోలేకపోతున్నాడు.

"ఎందుకేమిట్రా... కొనేస్తా! ఈ సాఫ్ట్వేర్ ఉద్యోగం ఎపుడుంటుందో, ఎపుడు ఊడుతుందో తెలియడంలేదు. కాసింత జేబులు చల్లగా ఉన్నపుడే కొని పడేస్తే, నేలతల్లితో కొంచెం అనుబంధమైనా పెరుగుతుంది. బతుక్కి భరోసాగా ఉంటుంది.

అదీగాక ఆ పొలాలు, ఆ గాలి, చెట్లు, వాటి సామీప్యం ఓహ్... ఆ థ్రిల్లే వేరూ!” నర్సింలు మాటలో ఒక ఆనంద పారవశ్యం!

“ఉందిరా! చాలా భూమి అమ్మకానికి ఉంది. రోజూ ఇక్కడ జరుగుతున్నది ఇదే! ఉన్నవాళ్ళు తేలిగ్గా అమ్ముకోవడం, లేనివాళ్ళు అపురూపంగా కొనుక్కోవడం... ఇదే తంతు!”

“అయితే నాకో పదెకరాల పొలమో, స్థలమో చూడు! అట్లా కాకపోతే ఓ యాభై నుండి డెభై లక్షల మధ్య ఎంత వస్తే అంతకి కొనడం మాత్రం పక్కా! అదీ మీ ఊళ్లోనే కుదిరితే నీ పొలం పక్కనే... ఎందుకంటే దాని బాగోగులు అన్నీ నువ్వే చూసుకోవాలి” రమేష్‌కి ఒక్కసారి చిర్రెత్తుకొచ్చింది.

“అంటే... నేనేమో జీవితాంతం మట్టి పిసుక్కుంటూనే ఉండాలి. మీలాంటి వాళ్ళేమో, అద్దాల మేడల్లో ఉంటూ లైఫ్ ఎంజాయ్ చేయాలా?” గొంతులో తీవ్రమైన ఉక్రోషం ధ్వనించింది.

“ఒరే పిచ్చి రమేషూ, నేను నీతో రెండు మూడు విషయాలు చాల నిర్మొహమాటంగా మాట్లాడతాను. వాటిపై నీ అభిప్రాయం లేదా విశ్లేషణ, రేపు లేదా వారం తర్వాత చెప్పు. వెంటనే మాత్రం అసలు వద్దు!”

రమేష్ చాలాసేపు ఏమి మాట్లాడలేకపోయాడు. నర్సింలు చెప్పబోయే లాజిక్ ఏమిటో అతడికి ఎప్పట్లాగే అర్థం కాలేదు. మళ్ళీ నర్సింలులే మాట్లాడాడు.

“ఒరే మిత్రమా... విను! ముందు నువ్వు నీలో ఉన్న ఆత్మన్యూనతా భావాన్ని వదిలేయి. నువ్వెంత ఉన్నత స్థాయిలో ఉన్నావో గమనించుకో! ఇన్ని ఏళ్ళయ్యాక కూడా, నేను మళ్ళీ నీ వర్గంలోకి రావాలని ఎందుకు ఆరాట పడుతున్నానంటావూ? సొంత ఊరూ, తల్లిదండ్రుల సాన్నిహిత్యం పది పదిహేను ఎకరాల పొలమూ! నిజానికి నీ అంత లక్కీ ఫెలో ఎవరూ ఉండరురా! అన్నింటికన్నా గొప్పదైన నిర్మల యొక్క ప్రేమా... ఇంకా నీకు ఏం కావాలిరా స్టుపిడ్!” ఫోన్ కట్ చేశాడు నర్సింలు.

రమేష్ వెంటనే చెంపలు తడుముకొన్నాడు. నర్సింలు మాట్లాడిన మాటలు అచ్చు చెంపదెబ్బల్లాగే తగిలాయి! ఎట్లా ఇంటికి వచ్చాడో అస్సలు తెలియలేదు. వచ్చీరావడంతోనే వాకిట్లో మంచంపై వాలిపోయాడు. కాని ఆ నిస్సత్తువలోనే ఏదో తెలియని సత్తువ!

“ఒరేయ్ రమేషూ... నర్సింలు ఫోన్ చేసాడ్రా!” తండ్రి నాగయ్య పలకరింపుతో ఈ లోకంలోకి వచ్చాడు.

“అంటే నాన్నగారూ, మీకు ముందే చేసాడా? ఏం మాట్లాడాడు?”

“ఏం మాట్లాడలేదురా! నీ ఫోన్ పదే పదే ఎంగేజ్ వస్తుందని నాకు చేశాడ్రా, అంతే!”

“అలాగా...” తాను అంతసేపు నిర్మలతో మాట్లాడిన సంగతి గుర్తొచ్చి, లోలోన ఏదో పరవశపు తెర రెపరెపలాడింది!

రమేష్ ఏదో ముఖ్యమైన విషయం చెప్పబోతున్నట్టు సుదీర్ఘంగా నిట్టూర్చాడు. పూర్ణమ్మ దగ్గరగా జరిగింది. తల్లి చేయి తన చేతుల్లోకి తీసుకొన్నాడు. అందాక కొట్టుమిట్టాడిన వీధి లైట్ ఒకటి ఒక్కసారిగా ప్రకాశవంతంగా వెలిగింది. రమేష్ పెదాలపై చిరునవ్వులాగే!

“నర్సింలని నా ఫ్రెండ్ ఉన్నాడు కదా అమ్మా! మన ఊళ్లోనే, ఇంకా వీలయితే మన పొలం పక్కనే కొంత పొలం

తీసుకొంటాడట! దాని బాగోగులు కూడా నన్నే చూడమని అంటున్నాడు. ఏం చెప్పాలి?"

"కొనుక్కొమ్మను బిడ్డా! మన పొలంతో బాటు, తన పొలం చూసుకొంటూ ఊళ్లోనే ఉండవచ్చు మాతోబాటు!" పూర్ణమ్మ నవ్వింది ఆశగా!

"మరీ నా చదువూ, ఉద్యోగమూ?" రమేష్ ప్రశ్న, ముగ్గురి మధ్య మెయిడెన్ ఓవర్ లాంటి నిశ్శబ్దం!

"చదువంటే లోకజ్ఞానం కోసం, ఉద్యోగం అంటే ఏ బతుకుతెరువూ లేని వాళ్ళ కోసం! మనకెందుకు నాయనా? భూతల్లిని నమ్ముకో నాయనా... ఆమె నిన్నెపుడూ మోసం చేయదు! పదేళ్ళు ఉద్యోగం వెలగబెట్టిన వాడే మళ్ళీ భూతల్లి ఒడిలోకి రావాలని ఆశ పడుతున్నాడు కదరా! మళ్ళీ నువ్వు పదేళ్ళు గొడ్డు చాకిరీ చేసి, తిరిగి పంటపొలాల వైపు తిరిగి రావడం కన్నా, నీకు నచ్చిన అమ్మాయిని పెళ్లి చేసుకొని, మా కళ్ళముందే పిల్లాపాపలతో ఉంటే బాగుంటుంది కదయ్యా!"

"మరీ అమ్మా! నన్నెవరూ గేలి చేయరా?"

"చేస్తారు నాయనా... కాని అట్లా చేసేవారెవరూ నీకు అవసరానికి ఒక్క రూపాయి కూడా సాయం చేయరు!"

అంతా నిశ్శబ్దం... నిశ్శబ్దమే! నిజం... నర్సింలు గాడి ఫోన్‌కాల్ తన జీవితాన్నే మార్చేసిందా! ఒక ఫోన్‌కాల్ కూడా జీవితాని మార్చగలదా?

"సరేనమ్మా. ఒక ఫోన్ చేసి వస్తా... అయిదు నిమిషాల్లో!"

"ఎవరికయ్యా... నర్సింలుకా?" పూర్ణమ్మ అడిగింది.

"కాదు నిమ్మికి" నాగయ్య గుసగుసగా అని, బోసిగా నవ్వాడు.

అయినా అతడికి వినిపించనే వినిపించింది. రమేష్ ఇంట్లో లైట్లన్నీ వేసి, ఫోన్ తీసుకొని, నిశ్శబ్దంగా పెరట్లోకి నడిచాడు.

# ఊరు చివర మనిషి

పి. సీతారామ రాజు

✆ 9948849607

*ఇన్నాళ్లూ ఏం సాధించాను? తన ఆలనా పాలనా చూసిన తండ్రికి అవసాన దశలో తోడుగా లేకుండా పోయాను. నేను ఉన్నాను అనే ధైర్యం ఇచ్చే మా నాన్నకు, నేను నీతోనే ఉంటాను అని చెప్పే ధైర్యం చేయలేక పోయాను. ధనం ధనం అంటూ మాయా ప్రపంచంలో మునిగిపోయి ఇక్కడికి రాలేకపోయాను. నా కొడుకు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేక తప్పక ఇండియాకు వచ్చాను.*

మాదో పల్లెటూరు! దానిని ఆనుకుని ఓ నది ఉంది. నది ఒడ్డున ఓ పెద్ద రావిచెట్టు, దాని చుట్టూ పెద్ద అరుగు. సాయంకాలం సూర్యుడు నదిలో నుండి దిగిపోతుంటే చూసే జనంతో మా ఊరు చూడముచ్చటగా ఉండేది. నది ప్రవాహం మెల్లగా సాగిపోతుంది. ఆ నది ఆవల కొన్ని గ్రామాలు! అక్కడికి చేరుకోవాలంటే పడవ ఎక్కాల్సిందే. అప్పుడు రేవు జనంతో కలిసి ఉండేది. తెల్లారితే నిత్యం అక్కడ తిరణాళ్ళలా ఉండేది.

చిన్నప్పుడు చాలాసార్లు రాయి తీసుకుని నదిలోకి విసిరేవాడిని. రావిచెట్టు దిమ్మ మీద కూర్చుని చూస్తుంటే తరంగాలు నా కాళ్ళ దగ్గరికి వచ్చి ఆగిపోయేవి. ఈ రావి చెట్టు నాకు ఎప్పటికీ వీడని జ్ఞాపకంలా నన్నూ భూమిని పట్టుకుని భవిష్యత్తులోకి విస్తరించినట్లు కనిపించేది.

★★★

నాన్న నన్ను డిగ్రీ వరకు మా ఊరిలోనే చదివించి, నాతో పాటు కలిసి చదువుతున్న మా ఊరి జమీందారుగారి అబ్బాయి సుందరంతో పాటు నన్ను అమెరికా పంపించాడు. పైచదువులతో పాటు అక్కడే ఉద్యోగంలో స్థిరపడిపోవడం. పెళ్లి, పిల్లలు అన్నీ చకచక జరిగిపోయాయి. అమ్మ అప్పటికే మాకు దూరమైంది. నాన్న ఆశీర్వాదం కోసం మేమంతా కలిసి ఒకసారి కూడా వెళ్ళలేకపోయాము.

నన్నూ, పిల్లలను, నా భార్యను నాన్న అక్కడి నుంచి చూసే ఏర్పాటు ఇక్కడ చేసాను. అదే భ్రమలో కాలం గడుపుతున్నానేమో అనుకుంటూ ఉంటాను. ఇంతకాలం నేను మా ఊరు వెళ్లకపోయినా నన్ను మా నాన్న ఏమీ అనలేదు. జీవితగమనంలో పాతికేళ్ళు దాటిపోయాయి. నాతో పాటు అమెరికా వచ్చిన సుందరం, అతని తండ్రి హఠాత్తుగా చనిపోవడంతో ఇండియా వెళ్లిపోయాడు, మళ్లీ రాలేదు. ఇక్కడ ఉండి స్థిరపడాలనుకున్న అతను వెళ్ళిపోయాడు. ఇక్కడ ఉండకూడదు అనుకున్న నేను మాత్రం ఇక్కడే స్థిర పడిపోయాను.


అమెరికా వచ్చిన కొత్తలో ఇక్కడ జీవనశైలి, వాళ్ల స్వభావం, మాటలు యంత్రాల్లో తయారు చేసుకుని ఒంటికి పూసుకున్నట్లు కనిపించేవి. అదో కృత్రిమ జీవన ప్రయాణం. సంస్కృతి, సాంప్రదాయం కనుమరుగై బతకడానికో, విలాసాలకో, డబ్బు

సంపాదించడానికి పరుగులెత్తిపోయే జీవన ప్రవాహం అది! అవసరాలు, అత్యాశ, అతి జ్ఞానాలకి పరాకాష్ట. అలాంటి నాగరికత మానవ మనుగడను మళ్లీ వెనక్కి తేలేని స్థితి, నిరంతరం మారిపోయే జీవుల సృజన... నాకు అక్కడ కనిపించింది. అది మానవ శ్రేయస్సుకో, మానవ వినాశనానికో నాకు మాత్రం అర్థం కాలేదు.

ఇప్పుడు నేను ఇండియా వెళ్లాల్సిన పరిస్థితి ఆసన్నమైంది. అక్కడ ఎవరూ లేరు నాన్న తప్ప! వృద్ధాప్యంతో చివరిదశలోనున్న ఆ దేహాన్ని చూడడానికి తప్ప! అంతా కలిసి బయలుదేరి ఇండియా వచ్చాం. మొత్తం అంతా మారిపోయింది. మా ఊరి రూపురేఖలు కనిపించకుండా పోయాయి. నది మీద వంతెన పడింది. ఇప్పుడు రేవు ఒంటరిదయింది. రావిచెట్టు కొట్టేసి అక్కడ గ్రామ సచివాలయం కట్టారు. శూన్యానికి, నిశ్శబ్దానికి మధ్య వేలాడుతున్న మనసులా ఉంది మా ఊరు. స్వచ్ఛత లేని గాలి, కలుషితమైన ఆహారం ఆక్రమించాయి మా ఊరిని! ఒకప్పుడు మా పల్లెటూరు నిండు ముత్తయిదువులా పెద్ద బొట్టు పెట్టుకున్న మా అమ్మలా ఉండేది. నాకు మా అమ్మ దూరమైనా, నాన్నతో పాటు కనీసం అమ్మలాంటి నా ఊరు కనిపిస్తుంది అనుకున్నాను. సెజ్ ఏర్పాటులో ప్రభుత్వం మా ఊర్లో పొలాలు అన్నీ లాగేసుకుంది. పచ్చని పైరుతో కళకళలాడే మా పొలాల్లో ఇప్పుడు పొగ గొట్టాల ఫ్యాక్టరీలు మొలిచాయి. వ్యవసాయ భారతావని... కర్మాగారాల దేశంగా మారిపోతూ, ఒకనాటికి నా దేశం పొగచూరి, మరుభూమిగా మారిపోతుందేమో...!

స్వచ్ఛతగా ప్రవహించే మా ఊరి జీవనదికి కాలుష్యాన్ని మోసే రోజు వస్తుందని తెలియదు. వర్తమానాన్ని భవిష్యత్తుకు ముడిపెట్టి ఊహించుకుంటే రాబోయే కాలపు దృశ్యాలు కన్నీటితో నా కళ్ళను తడిపాయి.

★★★



ఒకప్పటి ఊరు చివర, ఇప్పుడు వంతెన రాకతో మొదలు అయ్యింది. ఊరులోకి అడుగు పెట్టాను. నా జ్ఞాపకాల గురుతుల కోసం చూస్తూ ఉన్నాను. తరాలు గడిచి గుడిసెలు అంతస్థులుగా మారాయి. ఎక్కడో కొన్ని ఇంకా అలానే ఉన్నాయి. కాళ్ళను హత్తుకునే మట్టిబాటలు, కాంక్రీట్ బాటలుగా మారిపోయాయి. ఒకప్పుడు ఊరిలోకి కొత్తమనిషి వస్తే ఊరంతా తెలిసేది. ఎవరు మీరు? మీకు ఎవరు కావాలనే ప్రశ్నల ఊసులు చుట్టుముట్టేవి. కారు దిగిన నాకు, నా మనసుకి తప్ప నేనెవరో తెలియదు. మా నాన్న మొండితనం, మా ఇల్లుని ఇంటి జ్ఞాపకాలను పదిలంగా ఉంచింది. ఇరుగు పొరుగు మారింది. 'హమ్మయ్య నా ఇల్లైనా మారలేదు' అని మనసు ఆనంద పడింది. ఇప్పుడు మా ఇల్లు కాలం కుదుపులకి కూలబడిపోకుండా, నాన్న మరమత్తులు చేయించి ఉన్నట్టున్నాడు. ఇంటి పెరట్లోకి వెళ్లాను, నాన్న ఎక్కడా కనబడక పోయేసరికి! పెరట్లో పూలమొక్కలకు బదులు, పిచ్చిమొక్కలు పెరిగివున్నాయి. ఇంటి పైకప్పు పెంకులన్నీ నాచుపట్టి పచ్చని రంగు పులుముకున్నాయి. అక్కడే అమ్మ రోజూ పూజచేసే తులసికోట కూలబడిపోయి వుంది. దాని పక్కనే కాస్తంత దూరంలో ఆనాటి రుబ్బురాయి ఇంకా అలానే వుంది. చెక్కపీట మీద అమ్మ కూర్చుని, మినప్పిండి రుబ్బుతుంటే, నేను అమ్మ వెనకగా పాక్కుంటూ వెళ్లి, గిన్నెలోకి తీసిన మినప్పిండి ముఖానికి రాసుకునే వాడినట. పసిప్రాయంలో నా జ్ఞాపకాలు ఇంటిలోకి అడుగుపెట్టగానే గుండెను బరువు చేశాయి. ఇప్పుడు అమ్మ బతికుంటే ఇలా ఉండేదా ఇల్లు? చెమ్మగిల్లిన కళ్లతో, హాలు మధ్య వాలుకుర్చీలో కళ్లు మూసుకుని విశ్రమిస్తున్న మా నాన్న కాళ్ల దగ్గర కూలబడ్డాను. నా రెండు చేతులతో ఆయన పాదాలను తాకి "నన్ను క్షమించు నాన్నా. ఇకపై జీవితాంతం ఇక్కడే వున్నా, నీ ఋణం మాత్రం తీర్చుకోలేను. ఆకలి మింగేసిన కష్టం నీది, నా భవిష్యత్తు కోసం బంగారు బాట వేసి ఎక్కడో కూర్చోబెట్టావే, దానికి త్యాగం నీ జన్మ..." ఆయన పాదాల మీద పడిన నా కన్నీటి తడికి నా వైపు తలెత్తి చూసారు.

చూపు మందగించినా రక్తసంబంధం గుర్తు పట్టింది.

ఒళ్ళంతా తడుముతూ... "పోనీ లేరా, ఇప్పుడైనా వచ్చావు. నువ్వు వస్తున్నావని తెలిసి అన్ని ఏర్పాట్లు చేసాను" అంటూ పైకి లేపి నా భుజం మీద చెయ్యేసి గదిలోకి తీసుకెళ్లాడు.

సాయంకాలం నేను ఊరిలోకి నడిచాను... నా మిత్రుడుని పలకరించాలని! ఊరి మధ్యలో ఉండే జమీందారు ఇల్లు వైపు అడుగులేసాను.

బయట నన్ను ఆపిన వ్యక్తి కొత్తగా కనిపించాడు. ఇప్పుడు నా స్నేహితుడు అక్కడ లేడని, ఇల్లు అమ్మేసి ఊరి చివర ఉంటున్నాడని తెలుసుకొని అటుగా అడుగులు వేసాను. ఒకప్పుడు ఊరు మొదలు ఇప్పుడు చివర అయ్యింది.

పొలం గట్లు దాటుతూ మధ్యలో కనపడుతున్న విశాలమైన స్థలంలో ఉన్న పూరిపాక దగ్గరకు వెళ్ళాను. కర్రలతో చేసిన గేటు మూసి ఉంది. దానికి చేరువలో పొలంలో పని చేస్తున్న రైతు కూలీని పిలిచాను స్నేహితుని వివరం కోసం. నా పిలుపుకి అతను తలెత్తి చూసాడు. తువ్వాలు తలకి కట్టి, మాసిన గెడ్డంతో ఉన్న అతనిని చూసిన నాకు ఓ క్షణం మతి స్తంభించింది. అతనే నా మిత్రుడు, జమీందారు కొడుకు సుందరం. విదేశాల్లో పెద్ద పెద్ద చదువులు చదివిన వ్యక్తిని... ఇలా రైతు కూలీగా చూసిన అతన్ని నేను నమ్మలేక పోయాను.

నన్ను చూసి గుర్తుపట్టి, ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నాడు. "మొత్తానికి చాలా పెద్దవాడివి అయ్యావు. నీ మీద నమ్మకంతో నిన్ను నాతో పంపించమని చెప్పిన మా నాన్న మాటని, మా నాన్న మాటకు గౌరవించి పంపిన మీ నాన్న ఆశని,

నెరవేర్చావురా! నాకు చాలా సంతోషంగా ఉందిరా!"

ఏమీ మాట్లాడక, నేను వాడి ఇంటి చుట్టూ చూస్తూ ఉన్న నాలో సంశయం.. వాడికి అర్థమై చెప్పాడు.

"ఒరేయ్ నీకు తెలుసుగా మా నాన్నకు దానధర్మాలు ఎక్కువని. ఆస్తులు కరిగాయి. ఆయన ఆరోగ్యం పాడై మిగిలిన ఆస్తి మందుల ఖర్చులకు కూడా సరిపోలేదు. అప్పులు మిగిలాయి. ఆయన చనిపోయాక ఉన్న ఇల్లు, పొలం అమ్మేసి మొత్తం అప్పులు తీర్చేసాను. ఇది మాత్రం మా అమ్మ నా కోసం కొన్న పొలం. దీన్నే సేద్యం చేస్తున్నాను. కాయకష్టం అలవాటు అయ్యిందిరా!"

"ఒరేయ్ నేను నిన్ను ఇలా చూడలేక పోతున్నాను రా! నాతో వచ్చేయిరా. ఒక్కసారి కూడా నన్ను ఏదైనా సహాయం అడగాలని, నీ బాధలు చెప్పుకోవాలని అనిపించలేదురా?"

ఆ మాటకు సుందరం ఓ నవ్వు నవ్వి, "నువ్వు చూస్తుంది బయట స్థితిరా. నిజం చెప్పాలంటే ఇప్పుడు నేను చాలా ఆనందంగా ఉన్నాను. మనసు ప్రశాంతంగా ఉంది. ఏసీ గదుల్లో నిద్ర పట్టక అటూ ఇటూ దొర్లుతూ ఉన్నదాని కంటే, అదిగో ఆ వేపచెట్టు నీడన తలకింద తువ్వాలు పెట్టుకొని పడుకుంటే ప్రశాంతమైన నిద్ర పడుతుంది. నేను నిజంగా ఇప్పుడే సంతోషంగా ఉన్నాను. మనిషికి సౌఖ్యాన్ని ఇచ్చేది ఆత్మతృప్తి, ప్రశాంతమైన మనసు. ఆ రెండూ నాకున్నాయి. అందుకే ఎవరినీ అడగాలని అనిపించలేదు. నాకీ జీవితం చాలురా. మళ్లీ అక్కడికి రాలేనురా. మన ఊరి గాలి, మన దేశ సంస్కృతిని వదిలిపెట్టి రాలేనురా!"

మిత్రుడి మాటలు నన్ను ఆత్మవిమర్శకు గురి చేసాయి. ఇన్నాళ్లూ ఏం సాధించాను? నా ఆలనా పాలనా చూసిన తండ్రికి అవసాన దశలో తోడుగా లేకుండా పోయాను. నేను ఉన్నాను అనే ధైర్యం ఇచ్చే మా నాన్నకు, నేను నీతోనే ఉంటాను అని చెప్పే ధైర్యం చేయలేకపోయాను. ధనం ధనం అంటూ మాయాప్రపంచంలో మునిగిపోయి ఇక్కడికి రాలేకపోయాను. నా కొడుకు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేక తప్పక ఇండియాకు వచ్చాను ఇదంతా చూపించి వెళ్దామని... ఆలోచనలతో, ఎందుకో నా మనసుకి సర్దిచెప్పలేక పోతున్నాను.

"ఒరేయ్" అన్న మిత్రుని పిలుపుకి ఆలోచనల నుంచి బయటకు వచ్చాను.

"రారా కాస్త ఎంగిలి పడుదువు గానీ." అంటూ భుజం మీద చెయ్యేసి పాకలోకి తీసుకెళ్లాడు. మజ్జిగ కలిపిన రాగిజావ చెంబులో పోసి ఇచ్చాడు.

పూర్తిగా త్రాగి, "నేను ఇక్కడే ఉండి పోదాం అనుకుంటున్నా" అన్న నా మాటకి... "ఏం నా కోసమా?" అన్నాడు సుందరం.

"ఉహూ... నీ కోసం కాదు. నా కోసం... నన్ను కన్న ఈ నేల కోసం. నా అనుకునే వాళ్ళ కోసం."

అంటూ బయటకు అడుగేసాను.

# నేనెట్లా చచ్చిపోతా..!

రావుల కిరణ్మయి

***తాగుబోతు మొగుడు చావమని కొట్టే దెబ్బలను భరిస్తూ, 'నేనెట్లా చచ్చిపోతా' అంటూ పసిగుడ్డునైన నన్ను పట్టుకొని ఏడ్చిందే తప్ప, తాళి మీది గౌరవంతో ఎన్నడూ ఎదురు తిరగలేదు.***
***తాగి... తాగి... అలసిపోయాడో, కొట్టి... కొట్టి... అలసిపోయాడో, కానీ***
***నాన్న మాత్రం నా మూడో ఏట చచ్చిపోయాడు.***

అంతర్జాతీయ ప్రకృతి పరిరక్షణ దినాన్ని పురస్కరించుకొని, 'వృక్షోరక్షతి రక్షితః' అన్న శీర్షికతో వ్యాసం రాసి పంపించడానికి రాయటం మొదలుపెట్టాను. చెట్లపై కోతుల్లా గెంతులు వేస్తూ ఆడిన కోతి కొమ్మచ్చి ఆట నేడు కనుమరుగవడానికి, చెట్లు లేకపోవడమూ ఒక కారణమే! ప్రతి ఇంటి పట్టున పండ్లనిచ్చే చెట్టు ఇప్పుడు కనిపించడం లేదెందుకు? గ్రామాల్లో అరక దున్ని అలసిన రైతన్నను సేద తీర్చేందుకు, పొలం గట్టుపై పెద్ద పెద్ద వృక్షాలుండేవి. ప్రతి ఊరూ చిన్నపాటి వనాన్ని తలపించేది. వనాలను పెంచే జనాలేరి? 'ఆక్సిజన్ అందిస్తూ కాలుష్యం తగ్గించే వేప, రావి, మర్రి, మద్ది, చింత లాంటి మొక్కలు నాటితేనే గ్రీన్‌బెల్ట్ పెరిగి, కాలుష్యం యూవీ సెగ నుంచి విముక్తి లభిస్తుంది' అని నేటి సమాజానికి తెలియజేస్తూ, 'చెట్టు మానవాళి ప్రగతికి మెట్టు, చెట్టు మనిషికి ఆయువు పట్టు' అని చాటి చెబుతూ ఉద్యమంలా మొక్కలను నాటవలసిన ఆవశ్యకత ఉందని పచ్చదనం గురించి ప్రకృతిని గురించి మమేకమై రాస్తుంటే, నాలో ఏదో ఒక చిన్న అలజడి!

నేను రాసినట్టు జరగక... ఈ భూమీ, చెట్టు లేని మరుభూమిగా మారితే, జనారణ్యం అంతరిస్తుందని, ఇప్పటికైనా మేల్కొనాలి... మేల్కొనాలి అంటూ కళ్ళు మూసుకొని కలవరిస్తున్న నన్ను, మా ఆవిడ తట్టి పిలిచేసరికి కల చెదిరింది. కానీ గుండె దిగులు మాత్రం తగ్గలేదు!

"గంగాధర్‌గారు సాయంత్రం వస్తానన్నారు. డబ్బులు ఇచ్చి వెళ్ళటానికి కాబోలు..." అని చెప్పి వెళ్లిపోయింది.

"గంగాధర్, డబ్బుతో వస్తున్నాడా? అంటే నా పొలం అమ్ముకున్నట్టేనా? వాడు పెట్టడానికి ఒప్పుకోనంత ఖరీదు చెప్పాను కదా! ఐనా వాడు ఎలా సిద్ధపడుతున్నాడు? వీల్లేదు, రావద్దని చెప్పు" అన్నాను, కాఫీగ్లాసుతో నా దగ్గరికి మళ్ళీ వచ్చిన నా భార్యతో!

నా భార్య, 'ఏమిటో ఈ పిచ్చి?' అన్నట్టుగా చూసి వెళ్ళిన చూపు కళ్ళలో కదలాడుతుండగా, మళ్ళీ కళ్ళు మూసుకొని జ్ఞాపకాల ముసుగు తొలగించుకొని మేల్కొన్నా.

నా వాళ్ళు అనబడే నా భార్యా, కొడుకులు ఇద్దరు విదేశీ మోజులో పడి, నా ఊరి ఆస్తిని బేరానికి పెట్టారు. పరదేశం వెళ్ళే

అవసరం లేనంత ఆస్తి, నేను కూడబెట్టలేదు కాబట్టి, నా ఊరి ఆస్తిని వాళ్ళకి పునాదిగా ఇస్తే, రెక్కలు కట్టుకొని వెళ్లి, అక్కడే గూడు కట్టుకొని, వలసపక్షుల్లా బతకాలని వారి లక్ష్యం! ఇంతా చేసినందుకు నాకిచ్చే బహుమతి... నన్నూ వాళ్ళతో పాటు చచ్చేంత వరకు ఏ వృద్ధాశ్రమంలో పెట్టకుండా కంటికి రెప్పలా కాపాడుకుంటారట! ఇది వాళ్ళ వరకు వాళ్ళకు న్యాయంగానే తోస్తున్నది. కానీ ఎవరికీ తెలియని అనుబంధం నా ఆత్మ ఆ ఊరిలోనే ఉందంటే నమ్ముతారా?

నావాళ్లకు 'ఆ ఊరిలోని గుడిసె, ఆ కొద్దిపాటి సాగుభూమి, గట్టు మీది రావిచెట్టు. ఇంతే, ఏముందందులో? ఇంతకన్న ఎక్కువ ఉన్న వాళ్ళు లేరా? చాదస్తంగా ఆలోచిస్తున్నారు?' అంటూ దీన్నే ఇంచు మించు పిచ్చిలా రూఢి చేసి, కొంతకాలం నుండి అలానే చూస్తున్నారు. ఏం చేయను? నా గుండెకోత చెప్పుకోవడానికి నాకెవరున్నారు? నాకు ఉన్న ఒక్కగానొక్క ఆత్మీయబంధం అమ్మను, వీళ్ళే కదా పొట్టన పెట్టుకున్నది! జీవితమంతా ఆటుపోట్ల సంద్రంలో కన్నీళ్లను దిగమింగుతూ గుండెనిబ్బరంతో నేనెట్లా చచ్చిపోతా, అంటూ జీవితంతో ఎడతెగని యుద్ధం చేసిన అమ్మను మలిదశలోనైనా తెచ్చుకొని, కళ్ళముందు పెట్టుకుంటానంటే ఒప్పుకున్నారా? కొడుకుగా నా ధర్మం నెరవేర్చనిచ్చారా? తండ్రిగా నీ బాధ్యతే గొప్పదన్నట్టు వాళ్ళ అవసరాలకు బలిపశువును చేసి, నా నోరు నొక్కేయలేదూ? పైపెచ్చు మీరు కొడుకుగా చేయలేని ధర్మమును, మీ కొడుకులుగా మీకు చేసి చూపాలంటే పెట్టుబడి పెట్టాల్సిందేనన్నట్టు... హుకుం జారీ చేసీ ఆ వైపుగా సాగుతున్నారు. ఆ ప్రయత్నమే కదా భూమి అమ్మకం! అమ్మ గుర్తుకు రాగానే లోలోపల దుఃఖం పొంగి పొర్లింది. సాయంత్రం ఊరు వెళ్ళాలి అనుకొని గంగాధర్‌కు నేనే వస్తున్నట్టు ఫోన్ చేసి, చెప్పి బయలుదేరి వెళ్లాను.



నేను వెళ్లేసరికి అతను పొలంలోనే ఉండటంతో అక్కడికే వెళ్లాను. ఎండాకాలమైనా గట్లపై చెట్లు పచ్చగా ఉండటం ఆశ్చర్యానికి గురి చేసింది. కారణమేమిటాని ఆరా తీస్తే, చుట్టూ ఉన్న నేల పదే పదే చదును చేయడం, మట్టి పై పొరలు పాదులు చేయడం కారణమని తెలుసుకున్నాను. అమ్మ కూడా బతికినంత కాలం తన మనసును, బాధలను తుడిచిపెడుతూ, చదును చేస్తూ కొత్త ఆలోచనలతో నింపుకుంటూ, మట్టిలోనే పొర్లాడుతూ జీవితానికి పరిమళం అద్దుకొని

నా జీవితానికీ అందించింది. అందుకే ఈ చెట్లకు మల్లే ఈ కాలమైనా పచ్చగా ఉంది. చిన్నతనంలోనే సవతితల్లి నిరాదరణకు గురై, సమస్యలతోనే సమస్యగానే పెరిగింది. కన్నతల్లి ఆస్తి, అమ్మ పేర ఉండటంతో ఆస్తి మీది ఆశతో అమ్మను సొంత తాగుబోతు తమ్ముడికి కట్టబెట్టింది. చావైనా, బతుకైనా వానితోనే అని శాసించింది. తాగుబోతు మొగుడు చావమని కొట్టే దెబ్బలను భరిస్తూ, 'నేనెట్లా చచ్చిపోతా' అంటూ పసిగుడ్డునైన నన్ను పట్టుకొని ఏడ్చిందే తప్ప, తాళి మీది గౌరవంతో ఎన్నడూ ఎదురు తిరగలేదు. తాగి... తాగి... అలసిపోయాడో, కొట్టి... కొట్టి... అలసిపోయాడో, కానీ నాన్న మాత్రం నా మూడో ఏట చచ్చిపోయాడు. అప్పుడూ అందరూ జాలిగా ఈ లోకం నిన్ను ఒంటరిగా బతకనీయదు, సూటిపోటి మాటలతో అనుక్షణం అనుమానిస్తూ చంపివేస్తుందని భయపెడుతూ, మూడు పదులు కూడా దాటని అమ్మని, రెండింతలు పెద్దైనవాడు కూడా తోడుకు ఉంచుకుంటానంటే, ధైర్యం కోల్పోక, అప్పుడు కూడా 'నేనెట్లా చచ్చిపోతా' అని ఈ పొలం గట్టు మీది రావి చెట్టుకే ఊయల కట్టి ఊపి నా ఊపిరయింది. చేవ ఉన్నంత కాలం, నీరున్నంత కాలం సాగు చేసి, తరువాత నిమ్మ, ఉసిరి, సపోటా, జామ పండ్ల మొక్కలు నాటించి పండ్ల సాగులోనే తానూ పండిపోయింది.

అప్పుడే నా ఆకలి తీర్చినా నోట్లోకి నాలుగు వేళ్ళు పోయేలా నాకు అన్నమైన అమ్మని తెచ్చుకుంటానంటే వీల్లేదని ముఖం మీద చెప్పక పోయినా, తనకు అలాగే అర్థమయ్యేలా చాలా తెలివిగా చెప్పినప్పుడు కూడా దిగులుతో కుంగలే... 'నేనెట్లా చచ్చిపోతా' అని ఊరు చేరి బతికింది... వారానికోసారి నేను వచ్చే ఆదివారం కోసం ఎదురు చూస్తూ!

ఆ రావిచెట్టు కిందే ఆమె జీవనం. చుట్టూ ఉన్న పొలాలలో పని చేసే కూలీలే ఆమె బంధువులు. వారిని కాసేపు విశ్రమించేలా చేసీ సేద తీర్చేది... అమ్మా, ఆ రావి చెట్టే! ఒక ఆదివారం వెళ్ళినప్పుడు మాటల మధ్యలో ఊర్లోకి పెద్ద డాక్టర్లు వచ్చి అవయవదానం మీద కలిగించిన అవగాహన చెప్పి, 'ఆరోగ్యంగా ఉన్న నా శరీరాన్ని ఇలాగే కాల్చివేయకురా. డాక్టర్లకు నేను మనస్ఫూర్తిగా రాసిచ్చినట్లే చేయమని' మాట తీసుకున్నది. ఆ తరువాతి సంవత్సరం ప్రశాంతంగా, అనాయాసంగా కన్ను మూసింది. అమ్మ మాట గెలిపించాను. ఆ సమయంలోనే నా వాళ్ళు అనబడే నా కుటుంబం పైపైకి మొసలి కన్నీరు కారుస్తూనే ఆ భూమిపై కన్నేశారు. అమ్మలేదు కాబట్టి దూరపు బంధువు గంగాధర్‌కి దాన్ని అమ్మి, సొమ్ము చేసుకుంటే తమ విదేశీ ప్రయాణం సాగుతుందని, ఆశల రెక్కలు కట్టుకొని ఎగరడానికి సిద్ధమయ్యారు. కానీ, నేను ఒప్పుకోనందున వాళ్లకి ఇలా చాదస్తపు పిచ్చివానిలా కనిపిస్తున్నాను. కానీ తండ్రిగా నా బాధ్యత విడువలేను కదా! అందుకే గంగాధర్‌తో మాట్లాడి డబ్బులు సర్దుబాటు చెయ్యమని అడగడానికే వచ్చాను. గంగాధర్ అయినా 'ఆ పొలం పరాయి వాళ్ళు కొనడం ఇష్టం లేకే తానడిగా'నన్నాడు. 'నువ్విలాగే ఉంచుకుంటానంటే నాకే బాధా లేదన్నాడు. డబ్బులు కూడా సంతోషంగా సర్దుతానన్నాడు. ఒక గట్టు మీది రావిచెట్టును తీసివేయిస్తేనే బాగుంటుందేమో.. అన్నాడు. దాన్ని పెకలించడమంటే నా బాల్యాన్ని చంపుకున్నట్టే. అందుకే మౌనంగా వెనుతిరుగుతుంటే కొత్త టెక్నాలజీ ట్రాన్స్‌లోకేషన్ ద్వారా తరలించి కాపాడే విషయం చెప్పగానే అంగీకరించా. మళ్ళీ చెట్టు దగ్గరికెళ్ళి గట్టిగా హత్తుకుంటుంటే అమ్మ అవయవదానం చేసీ 'నేనెట్లా చచ్చిపోతా!' అని మరో నలుగురికి ప్రాణమై బతుకుతున్నట్టే, రావిచెట్టు కూడా 'నేనెట్లా చచ్చిపోతా' అంటూ తల నిమురుతూ అమ్మలా ఓదార్చినట్టే అనిపించింది. సాగు మోడుబారనీయక, కూడునివ్వడానికే నేను తరలుతున్నానని గాలికి ఊగుతూ హాయిగా మా అమ్మ అన్నపూర్ణలాగే 'నేనెట్లా చచ్చిపోతా' అని అంటున్నట్టుగా అనిపించి తృప్తి చెందాను.

# అమ్మడు కాఫీ హోటల్

భమిడిపాటి గౌరీశంకర్

✆ 9492858395

***పల్లె రాజకీయాలకు, పడుచు వారి ప్రేమ వ్యవహారాలకు, రాత్రులకు,
అనేక రకాల 'కార్యకలాపాలకు' అదో కేరాఫ్ అడ్రస్సు!
అమ్మడు అందరినీ, అన్ని రకాలుగా. ఎవరికి కావలసిన సహాయం
వారికి చేస్తుంది. తన ప్రతిఫలం తను తీసుకుంటుంది. బాగా సంపాదించింది.***

"ఒక స్త్రీ యొక్క అందం ఒక పురుషుడు ఆమెను మెచ్చుకునేలా చేస్తుంది. కానీ, ఒక స్త్రీ యొక్క గెలుపు ఆమెను ఆనందించేలా చేస్తుంది. ఒక స్త్రీ యొక్క 'ఒద్దిక' ఒక పురుషుడు ఆమెను అభిమానించేలా చేస్తుంది. ఒక స్త్రీ యొక్క వ్యక్తిత్వం... ప్రపంచం ఆమెను అభినందించేలా చేస్తుంది..." ఈ వ్యాఖ్యానం.. తునివలస గ్రామంలోని 'అమ్మడు'ని తలచుకున్నప్పుడల్లా నాకు గుర్తుకు వస్తుంది..

'ఆమె అంత గొప్పదా' అని మీరు ప్రశ్నిస్తే... 'ఏమో గాని, నా వరకు నాకు అంతే!' అని జవాబు చెబుతాను.

ఆమె గురించి మీకు చెబుతాను... ఆ తరువాత మీ ఇష్టం!

★★★

"మన గ్రామదేవత పండుగ ఈనెల ఇరవై నాలుగు, ఇరవై ఐదు తేదీల్లో జరుపుదామనుకుంటున్నాము. నువ్వు తప్పకుండా రావాలి బావా" ఇవి నాకు ఫోన్ చేసి మా చిట్టి బావ మాటలు.

నేను ప్రతీ సంవత్సరం వెళుతుంటాను. వాడు ప్రతీ సంవత్సరం పిలుస్తుంటాడు, వాడు పిలవకపోయినా నేను వెళతాను.

తునివలస, విజయనగరం నుంచి సింహాచలం వెళ్ళే దారిలో ఉంది. ఒక విధంగా లూపు లైన్లో ఉంది. కానీ, ఆర్టీసీ వారు ఓ నాలుగు సంవత్సరాలుగా, ఆ మార్గంలో ఉదయం ఐదు నుంచి రాత్రి పది వరకు బస్సులు త్రిప్పుతున్నారు. ఈ గ్రామానికి పదిహేను కిలోమీటర్ల దూరంలో పద్మనాభం కొండ ఉంది, ప్రక్కన పొంత్యాం ఉంది. ఇక్కడ కృష్ణదేవరాయలు వేయించిన విజయ స్థూపముంది.

పచ్చని గ్రామం. చుట్టూ తోటలు, పొలాలు, ఒకవైపు కొండ, గ్రామం పొలిమేరలోనే బంగారమ్మతల్లి గుడి ఉంది. మా అమ్మగారిది ఈ ఊరే! ఇది మా తాతగారిల్లు!

అమ్మవారి పండుగ అనగానే నేను పాతికేళ్లు వెనక్కి వెళతాను. ఆ ప్రయాణం నాలో పూర్వపు ఉత్సాహాన్నీ, ఉత్తేజాన్నీ ఇస్తుంది. చెరువులో గెంతటం, వేసవి సెలవుల్లో తాటి ముంజులు బ్రొటనవేలుతో తీసుకుని తినటం, లేలేత మామిడి

ముక్కలు కారం, ఉప్పు అద్దుకుని తినడం, రాచిప్పలోని తరవాణి అన్నం, లాంతరు వెలుగులో జరిగిన చీకటి ముచ్చట్లు... రాధ, చిన్నతల్లి, బాల, రమణ, బంగారం, జగదీష్‌లతో సరదాలు, మా పెద్దత్త కోపంతో చూపిన ప్రేమాభిమానాలు, చిన్నత్త అభిమానంతో పెట్టే ఉప్మా బూరెలు, అబ్బో... అవన్నీ టేప్‌రికార్డర్‌కి రివైండ్ చేసుకునే స్విచ్ ఉన్నట్టుగా జీవితానికి కూడా ఉంటే... తునివలస అగ్రహారంతో నా అనుభవాలను కూడా వెనక్కి రప్పించవచ్చు!

'సార్... వచ్చేసాం... దిగండి...' విజయనగరంలో నాతోపాటు ఎక్కిన, నన్ను తెలిసిన నరసింహం... తట్టి లేపే వరకు... నేను ఆ జ్ఞాపకాలతోనే ఉండిపోయాను.



బస్సు దిగాను. ఊరినిండా లైట్స్. రకరకాల ఆటలతో, ప్రతి సంవత్సరం వస్తున్నా... నాకు కొత్తగానే అనిపిస్తుంది. నేను తిన్నగా మా బావ ఇంటికి చేరుకున్నాను.

"రా అన్నయ్యా" అని పలకరించింది చిట్టి బావ భార్య. మేనల్లుడు, మేనకోడలు, వారి పిల్లలతో ఇల్లు సందడిగా ఉంది. పూర్వమంత కాదు... ఎక్కడో ఏదో వెలితి...

లక్షలు ఖర్చు చేస్తున్నారు, కానీ లక్షణమైన మనుషులు గ్రామంలో కరువయ్యారు. బెల్టు షాపులు ఎక్కువయ్యాయి. స్త్రీపురుషులు సమానంగానే త్రాగుతున్నారు.. రాష్ట్ర ఆర్థిక పురోభివృద్ధికి ఇతోధికంగా దోహదపడుతున్నారు.

మా బావకు ఈ ఇల్లు ఎలా

వచ్చిందో నాకు తెలుసు. అయినా ఆ జాగాలో మంచి మేడ కట్టుకున్నాడు. నేను స్నానం చేసి, టిఫిన్ చేసి, బయటకు వచ్చి కూర్చున్నాను.

అప్పుడే ఒక ముసలాయన వచ్చాడు. వయసు డెభై, ఎనభై మధ్య ఉండవచ్చు. నా ముందుకు వచ్చి, ముఖంలో ముఖం పెట్టి, "నువ్వు.. మా అన్నపూర్ణ కొడుకువి కదా" అన్నాడు. నోట్లోంచి లైట్ గా బ్రాందీ వాసన...

"అవును! ఆఖరి వాడిని" అన్నాను, గౌరవంగా లేచి!

ఇంతలో లోపల నుంచి బావ వచ్చి, "ఏంటి మల్లేసు... ఇలా వచ్చేవు?" అన్నాడు.

"పండగ కదా, అన్నయ్యగారి కోసం వచ్చాను!" అన్నాడు అతను.

ఆ వయసువారు 'అన్నయ్య' అని మా మామయ్యని పిలుస్తారు. కానీ మామయ్య చనిపోయి రెండేళ్లు అయింది. కానీ ఇప్పుడు వచ్చింది... మా పెద్దబావ రమణ కోసం! ఈసారి పండుగకు రమణ రాలేదు. మల్లేసుకు కావలసిన డబ్బులు ఇచ్చి పంపేశాడు చిట్టిబావ.

"అతనెవరో తెలుసా?" నన్ను అడిగాడు.

"తెలీదు... గుర్తుకు రావడం లేదు" అన్నాను.

"అమ్మడు మొగుడు! అమ్మడి ఆస్తంతా ఉన్న ఒక్కగానొక్క కొడుకు తన పేరున రాయించేసుకున్నాడు. తండ్రికి తిండి పెట్టడం కూడా వాడికి కష్టమే. వీడికి వృద్ధాప్య పెన్షన్ వస్తుంది. అదే ఇతడికి ఆధారం! ఇలా మనవాళ్ళు సహాయం చేస్తుంటారు!" అని, చెల్లి పిలవడంతో లోనికి వెళ్ళాడు.

ఊరంతా డప్పులమ్రోత... ఘటాలుంచిన చోట ఏవో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నట్టు ఉన్నాయి.

సమయం రాత్రి తొమ్మిదిన్నర! ఏప్రియల్ నెల. ఉగాది తర్వాత రోజులేమో... గాలి లేదు. కళ్ళాపి జల్లుకొనే నేలలు. కాంక్రీట్ రోడ్లుగా మారిపోయాయి. చక్కని తాటాకుల ఇళ్ళు మేడలైపోయాయి. పచ్చని పొలాలు ప్లాట్స్‌గా రూపాంతరం చెందాయి. కేబుల్‌వైర్లు, మద్యం షాపులు, అనైతిక విధానాలు, విలువల లేమి... బాగా కనబడుతున్నాయి. రామాలయం కూడా 'అద్భుతంగా కడదామని' కూల్చేశారు. విగ్రహాలు ఎక్కడో పెట్టారు. పచ్చని నా గ్రామం, అభివృద్ధితో ఎండిన... ఎండలను మండిస్తున్న ఆ పల్లెకు పోదామని ఎలా అనుకోవాలి!

నా ఆలోచనలు... అమ్మడు దగ్గర ఆగిపోయాయి.

పాతిక సంవత్సరాల క్రిందకు వెళ్లాను...

★★★

తునివలస వందన్నర గడపల గ్రామం. కరెంటు లేదు. అన్నీ తాటాకు గుడిసెలే! ఎక్కువ బ్రాహ్మణ కుటుంబాలు ఉండేవి. ఒకటి అరా మిగిలారు. ఒకే ఒక టిఫిన్‌కొట్టు! అదే అమ్మడు కాఫీ హోటల్! మా తునివలస అగ్రహారానికి రెండే రెండు బస్సు

సర్వీసులు! వేపాడ బస్సు, రామకృష్ణ బస్సు. రోజుకు నాలుగు సార్లు, విజయనగరం, విశాఖపట్నం మధ్య నడిచేవి, రాత్రి ఎనిమిదిన్నరకు చివరి సర్వీసు! ఆ తర్వాత రావాలంటే చిన్నాపురం జంక్షన్ వద్ద దిగి, అడవిలాంటి ఆ మార్గం గుండా నడిచి రావాలి. అమావాస్య రోజులైతే కష్టమే!

అప్పటి నా వయసు ఇరవై రెండు! భయంలేని తత్వం! పీ.జీ. పూర్తి చేసిన ఉత్సాహం. ఒకసారి వేసవి సెలవులకు తాతగారి ఊరు బయలుదేరాను. విజయనగరం చేరేసరికి ఎనిమిదయింది. తెగింపు వలన చిన్నాపురం జంక్షన్ వరకు వెళ్లి, నడక ప్రారంభించాను. చీకటి. సన్నని గాలి, ఏదో తెలియని ధైర్యం... మెల్లగా నడుస్తున్నాను.

సన్నగా ఏదో అలికిడి.. ప్రక్కనున్న తోటలో నుంచి! ఈ తోటలు కొన్ని అనైతిక కార్యక్రమాలకు నిలయమని మా బావలు చెప్పిన కథలు గుర్తుకు వచ్చాయి. ఆసక్తి స్థానంలో భయం! ఎవరివో అడుగుల శబ్దాలు, మాటలు, నవ్వులు... భయం పెరిగింది. ఆగిపోయాను!

చీకటిలో నుంచి రెండు ఆకారాలు, ఒకటి మళ్ళీ చీకట్లో కలిసిపోయిన మగ ఆకారం! రెండోది నాకు దగ్గరగా వచ్చింది!

“భయమొద్దు బిడ్డ! నువ్వు మా అన్నపూర్ణ బిడ్డవి. దా... కలిసి పోదాం! అవును, ఈవేళయిందేమిరా?” అంది.

నేను చెప్పాను. ఆమె, నన్ను దగ్గరగా తీసుకొని, చంకనున్న గంపలో నుంచి బన్ రొట్టిచ్చి... “తినరా! బాగుంటది” అంది.

ఆమె తల్లిలా నా ఆకలి తీర్చింది. అమ్మమ్మలా భయం వదిలించింది. అక్కలా నా చేయి పట్టుకుని, ఆ రాత్రివేళ ఇంటికి చేర్చింది. “ఒసేయ్ పూర్ణ, ఇదిగో... నీ చదువుకున్న కొడుకు! కాస్త దిష్టి తీయి చెల్లి”

అమ్మ నన్ను లోపలికి తీసుకు వెళ్ళింది.

మరుసటి రోజు ఉదయం... పది గంటల సమయం!

“అమ్మా అన్నపూర్ణా... రామ్మా మంచి కూరలున్నాయి, రా చెల్లీ” అని గుమ్మంలో నుంచి కేకలు!

అమ్మ కట్టెల పొయ్యి మీదనున్న అన్నం గిన్నెపై మూత పెట్టి, వచ్చింది. “ఏమున్నాయి అక్కా?” అంది.

“అన్నీ ఉన్నాయి. ఇంద... తీసుకో!” అని గంపలోని వంకాయలు, దొండకాయలను నేలపై పోసి, వెళ్ళిపోయింది.

“ఆమె అమ్మడులే! నోరు దురుసు... చేయి దురుసు కూడా! చూశావుగా మనిషిని, రౌడీ వేషం! కానీ, మంచిది. ‘నువ్వే నిలబడాలని’ ఎవరు సహాయం కోసం అడిగినా, దేవుడినైనా ఎదిరిస్తుంది. కానీ, ఆమె మీద రకరకాల పుకార్లున్నాయి. ఎవరితోనో రాత్రులు... చిన్నాపురం తోటల్లో...” అంటూ వెంటనే “సర్లే, వెళ్ళు! నీ పని చూసుకో!” అని మాట మార్చింది..

నాకు తెలుసు... నేను చూసాను!

ఒక స్త్రీ తన విలువల్ని కోల్పోవడానికి ఎన్నో పెద్దపెద్ద కారణాలు ఉండవచ్చు. అవి కేవలం పురాణాల్లోనూ, పాఠకుల్ని మెప్పించడానికి వ్రాసే నవలల్లోనూ మాత్రమే చదువుతాం! నిజజీవితంలో అన్ని కారణాలవసరం ఉండదు!

ఆ సాయంత్రం రోడ్డు మీదకు షికారుకు వెళ్లాను. ఏమీలేని ఆనాటి పల్లె అది. చీకట్లు ముసురుకుంటున్నాయి.

రోడ్డుకి ఎడమవైపు, చిన్న 'పాకా విలాస్', దానికి పేరు లేదు. అమ్మడు ఉండే ఇల్లు. కనుక 'అమ్మడు కాఫీ హోటల్'. అక్కడ కాఫీ దొరకదు, కేవలం క్రికెట్ బంతి సైజు ఉన్న ఇడ్లీలు, బొంబాయి చట్నీ మాత్రమే దొరుకుతాయి వేడిగా!

పల్లె రాజకీయాలకు, పడుచు వారి ప్రేమ వ్యవహారాలకు, రాత్రులకు, అనేక రకాల 'కార్యకలాపాలకు' అదో కేరాఫ్ అడ్రస్సు!

అమ్మడు అందరినీ, అన్ని రకాలుగా ఎవరికి కావలసిన సహాయం వారికి చేస్తుంది. తన ప్రతిఫలం తను తీసుకుంటుంది. బాగా సంపాదించింది. ఒక్కడే కొడుకు!

ఒకరోజు... మా బావ అమ్మడు దగ్గరికి వెళ్ళాడు. నేనూ వెళ్లాను. మా మామయ్య ఇంటి ప్రక్కన ఓ పాడుబడిన ఇల్లు ఉంది. దాని వారసులు ఎక్కడో కలకత్తాలో ఉన్నారు. ఆ జాగా తనకు కావాలి. కలకత్తా వెళ్లాలి. ఇదంతా మామయ్య వల్ల కాదని తెలిసి, అమ్మడిని రంగంలోకి దింపారు.

ఏం చేసిందో ఎలా చేసిందో... తతంగమంతా కాఫీ కొట్టు కేంద్రంగా చేసింది. రెండు రోజుల తర్వాత ఆ జాగా మా బావకు రాసేసారు. పైసా ఖర్చు కాలేదు. నాటి నుంచి నేటి వరకు అమ్మడంటే తెలియని వారు, ఈ జనరేషన్లో కూడా లేరు!

'ఏంటి బావా ఆలోచనలు? దా... టిఫిన్ చేద్దాం! తరువాత అమ్మవారు బయలుదేరితే తినలేము'' అన్నాడు చిట్టిబావ.

పిల్లలంతా హుషారుగా టపాసులు కాల్చుకుంటున్నారు... సెల్ఫీలు తీసుకుంటున్నారు.

రాత్రి వేళలో ఆనాడు... ఎంతో నిరాడంబరంగా, ఆనందంగా కలిసిమెలిసి, పెట్రోమాక్స్ వెలుగుల మధ్య దబ్బాకుల తరవాణి అన్నం, పులిహోరలతో తిన్నదానికీ... ఈరోజు లక్షలు ఖర్చు చేసి 'ఎవరికి వారే యమునా తీరే' అన్న విధంగా చేసుకుంటున్న దానికీ ఎంత తేడా! ఏదో వెలితి...

అన్నీ ఉన్నాయి పల్లెలో, అయినా "ఏమున్నదక్కో.. ఏమున్నదక్కా'' అని పాడుకుంటూ పండగ అనగానే వెళ్ళక తప్పదు. మళ్ళీ ఎప్పుడో 'పల్లెకి పోదామనే' ఆశ!

అమ్మడు మాత్రం... తునివలస గాలిలో ఉండిపోయింది. నాడు... నేడు కూడా!

★★★

పండుగ అయిపోయిన మరుసటి రోజు ఉదయం ఆరు గంటలకు, నేను బయలుదేరి రోడ్డుకు వచ్చాను.

అప్రయత్నంగా కుడివైపు చూశాను. రాజభవనాన్ని పోలిన పెద్ద భవంతి. గేటు... ఖరీదైన కుక్క కాపలా! కారు, ట్రాక్టర్... 'మహేష్' అనే నేమ్ ప్లేట్... 'అమ్మడు కాఫీ హోటల్' ఉండే జాగాలో... అమ్మడు ఒక్కగానొక్క కొడుకు!

బస్సు వచ్చింది, ఎక్కేసాను! ఎవరో నా ప్రక్కన కూర్చున్నట్లు అయింది. రాత్రి ఇంటికి వచ్చిన మల్లేసు!

బస్సు బయలుదేరింది. గాలి చల్లగా ఉంది.

"ఆ రాత్రి అమ్మడు, చిన్నాపురం నుంచి తీసుకువచ్చింది, నిన్నే అనుకుంటా!'' అన్నాడు నీరసంగా దగ్గుతూ!

"అవును'' అన్నాను.

"ఓహో" అని ఊరుకున్నాడు.

నా మనసులో ఓ అస్పష్ట చిత్రం యొక్క స్పష్టమైన ఆకృతి క్రమంగా దృశ్యమానమైంది.

బస్సు వేగంగా వెళుతున్నది. అతను నిద్రపోతున్నట్టున్నాడు.

ప్రతీ స్త్రీ చుట్టూ ఒక నైతిక విలువల లక్ష్మణరేఖ ఉంటుందనుకుంటాను. దీన్ని పురుషుడు గాని, సమాజంగాని నిర్మించలేదు. స్త్రీ తన చుట్టూ తానే ఏర్పరచుకుంటుంది. దీని నుంచి బయటపడటం అంత సులభం కాదు!

అమ్మడు... ఇందుకు మినహాయింపు కాదు!

# ముందుచూపు

భాగవతుల కృష్ణారావు

✆ 77025523025

***ఆనంద్ నాస్తికుడు... అయితే విపరీతంగా పుస్తకాలు చదివే అలవాటున్న ఆనంద్‌కి భగవద్గీత చదవాలనిపించింది. సంస్కృత, ఆంధ్ర అనువాదాల సైతంగా పూర్తిగా చదవడానికి అతనికి రెండేళ్లు పట్టింది. అదే సమయంలో ధ్యానకేంద్ర ఆకర్షితుడై ఆన్లైన్లో వెతికి తనకు దగ్గరగా ఉన్న ఈ ధర్మగంగలో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు.***

చేతిలో బేగ్‌తో ఎదురుగా కనపడ్డ పెద్ద భవనం గేట్ లోంచి లోపలికి నడిచాడు ఆనంద్.

గేట్ పైన ఆర్చి మీద 'ధర్మగంగ' అని పెద్దక్షరాలతో వ్రాసి ఉంది. నిజానికి ధర్మగంగనే వాళ్లలా పలుకుతారు. కింద చిన్న అక్షరాలతో చిరునామా కూడా ఉంది.

కలకత్తా మహా నగరానికి ఉత్తరాన ఉన్న శోధపూర్ అనే చిన్న గ్రామం. ధ్యాన తరగతులు నడిపే బౌద్ధ కేంద్రం. గంగానది పక్కనే ప్రవహిస్తుంది.

లోపలికి నడుస్తూ, చుట్టూ చూసాడు ఆనంద్.

దాదాపు రెండెకరాల ప్రదేశంలో పరుచుకునుంది ఆశ్రమం. గేటు నుండి రెండు ఫర్లాంగుల దూరంలో పెద్ద భవనం... మెట్లు... కుడివేపు బారక్స్‌లా కట్టిన గదుల సముదాయం. కాస్త ఎడంగా పగోడాని తలపిస్తున్న కట్టడం. చెట్లు, పూలమొక్కలతో నిజంగానే ప్రశాంత ఆశ్రమ వాతావరణాన్ని తలపిస్తోంది.

ఎడంవేపు ఉన్న భవన సముదాయాలు కాస్త దూరంగా ఉన్నాయి. అవి స్త్రీల కోసమని తర్వాత తెలిసింది.

అసలు తనిక్కడకి రావాలనుకోవడమే గమ్మత్తుగా జరిగింది.

చిన్నదైన సుఖసంసారం... భార్య చదువుకున్నది, దగ్గర్లో ఉన్న స్కూల్లో పనిచేస్తుంది. ఇద్దరు ముత్యాల్లాంటి పిల్లలు... మృదుల, విపుల బిటెక్ అయ్యాక పూనేలో పనిచేస్తున్నారు. తను ఫ్రీలాన్స్ ఫైనాన్షియల్ కన్సల్టెంట్‌గా చేసి, ఈ మధ్యే విసుగుపుట్టి రిటైర్ అయ్యాడు. సొంతిల్లు, ఆర్థిక సమస్యలు లేవు!

భార్య, తల్లి అత్తాకోడళ్లలా కాక తల్లీకూతుర్లా కలసిమెలసి ఉంటారు. అదో సుగుణం!

రిటైర్ అయ్యాక తను ఎన్నాళ్లుగానో అనుకుంటున్న తీరని కోరికలు తీర్చుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాడు.

ఒకటి విపాశన అనే ధ్యాన కేంద్రంలో పదిరోజుల కోర్సుకి హాజరవడం... రెండవది ట్రెక్కింగ్! అందులో భాగంగానే ఈ ప్రయాణం!

అసలు విషయానికొస్తే ఆనంద్ నాస్తికుడు... అయితే విపరీతంగా పుస్తకాలు చదివే అలవాటున్న ఆనంద్‌కి భగవద్గీత చదవాలనిపించింది. సంస్కృత, ఆంధ్ర అనువాదాల సైతంగా పూర్తిగా చదవడానికి అతనికి రెండేళ్లు పట్టింది. అదే సమయంలో ధ్యానకేంద్ర ఆకర్షితుడై ఆన్లైన్లో వెతికి తనకు దగ్గరగా ఉన్న ఈ ధర్మగంగలో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. అనుకున్న ప్రకారం నిర్ణీత సమయానికి చేరాడు.



ఆలోచనల్లో ఉండగానే రిసెప్షన్ హాలు సమీపించడంతో ఆలోచనలు కట్టి పెట్టి, అక్కడి ప్రక్రియ చూడటం మొదలు పెట్టాడు. పనులు జరుగుతున్నాయి కానీ ఎవరూ బిగ్గరగా మాట్లాడటం వినపడలేదు. అక్కడి వ్యక్తులు కాషాయ వేషభూషితులై ఉంటారనుకున్నాడు ఆనంద్, కానీ మామూలుగా పాంటు, షర్టు, బనీన్లతోనే ఉన్నారు. దాదాపు అరవైమంది దాకా ఉన్నారు సాధకులు! ఒకొక్కరిని పిలిచి, వారి గుర్తింపు పత్రాలను చూసి ధృవీకరించాక, నాయకుడిలాటి వ్యక్తి అందరినీ ఉద్దేశించి ఇలా అన్నాడు. “జిజ్ఞాసువులందరికీ ధర్మగంగ స్వాగతం చెబుతోంది. మీరు చివరిసారిగా మీ కుటుంబంతో మాట్లాడాలనుకుంటే ఇప్పుడే మాట్లాడుకోండి! తర్వాత మీ ఫోను జమచెయ్యాలి. దానితో పాటు మీ పర్సు, వాచి, బంగారు నగలు, ఇతర విలువైన సామాను అంతా ఇక్కడి లాకర్లో పెట్టాలి. దానికి మీరు మీ తాళం వేసుకోండి. మళ్లీ పదిరోజుల కోర్సు పూర్తయ్యాక మీ సామాను మీకు అప్పగించబడుతుంది.

మరో విషయం... ఇప్పటి నుండి మీరు పూర్తిగా మౌనధారణలో ఉండాలి. ఒకరితో ఒకరు మాట్లాడటం, సౌంజ్ఞలు చేయడం నిషిద్ధం! దానినే ‘ఆర్యమౌన్’ అంటారు.మీతో మాట్లాడే ఒకే వ్యక్తి మీ ఆధ్యాత్మిక గురువు లేదా గైడ్!

మరో ఇద్దరు సహాయకులు మీకు కావలసిన ఏర్పాట్లు చూస్తారు. వాళ్లతో కూడా అవసరాన్ని మించి మాట్లాడకూడదు.

ఇక్కడ వస్తువులు జమ కాగానే మీ చేతిసంచితో పాటు, మంచినీళ్ల సీసా ఒక్కటే మీరు మీకోసం కేటాయించిన రూముకి తీసుకువెళ్లగలరు. మీ ప్రశిక్షణ రేపటినుండి ప్రారంభమవుతుంది.ఇవాళ లంచ్ పూర్తయ్యాక మీరు ఇక్కడ భవన సముదాయం, తోటలు చూడవచ్చు. కానీ గేటు దాటి బాహ్య ప్రపంచంతో మీకు సంబంధం ఉండదు. మీ కుటుంబ సభ్యులకు ఇక్కడి నెంబరు తెలియజేయగలరు. వారు మీకేదైనా సమాచారం ఇస్తే మేము అవసరాన్ని బట్టి మీకు తెలియజేస్తాం. ఇహ గదిలో కూడా ఇద్దరు ఉంటే ఒకరితో ఒకరు మాట్లాడరాదు. వారి ముఖాలలోకి, కళ్లలోకి సూటిగా చూడరాదు.

ఇహ ఇక్కడి కార్యక్రమం వివరాలు... వేకువ జామున నాలుగు గంటలకి గంట వినగానే నిద్ర లేచిపోవాలి. కాలకృత్యాలు తీర్చుకుని నాలుగున్నరకి ధ్యానకేంద్రానికి చేరాలి. ఆరువరకు ధ్యానం. ఆరు నుండి ఆరున్నర వరకు జలపానం... అంటే బ్రేక్‌ఫాస్ట్... పూర్తిగా సాత్విక శాకాహారం. టీ, కాఫీ, పాలు ఉంటాయి. అదయ్యాక గదికి వచ్చి స్నానాదికాలు పూర్తి కానిచ్చి మళ్లీ ఎనిమిది గంటలకి ధ్యానమందిరం చేరుకోవాలి. ఎనిమిది నుండి పదకొండున్నర వరకూ ధ్యానమయ్యాక లంచ్. ఆ తర్వాత గంట విశ్రాంతి. మళ్లీ ఒంటిగంట నుండి ఐదు వరకు ధ్యానం. ఆ తర్వాత టీ, స్నాక్స్. అదే మీ డిన్నరు కూడా. పది రోజులు ఇలాగే గడపాలి. మీ ప్లేటు, గ్లాసు మీరే కడుక్కోవాలి. మీగది మీరే శుభ్రం చేసుకోవాలి. ఆశ్రమ నియమాలు పాటిస్తారని ఆశిస్తాను"

ఇదే విషయం హిందీ, బెంగాలీ, ఇంగ్లీషులో చెప్పారు.

ఆ తర్వాత అందరూ వారివారి ఫోన్లు, వాచీలు, ఇతర విలువైన సామాను చిక్కపు సంచిలాంటి దాన్లో పడేసి లాకర్‌లో పెట్టడం జరిగింది.

బాహ్య ప్రపంచంతో సంబంధం తెగిపోయింది.

ఆనంద్ తనకు కేటాయించిన గది వేపు నడిచాడు. చుట్టూ చెట్లతో నిండిన ఆ వాతావరణం చల్లగా బావుంది. ఫిబ్రవరి నెల చలి తగ్గినా ఎక్కువ వేడి అనిపించలేదు ఇంకా. గదిలోకి అడుగు పెట్టి చుట్టూ చూసాడు. పది బై పన్నెండు గది. ఒక లైట్, ఫాన్, అటాచ్డ్ వెస్ట్రన్ టాయిలెట్... గది గోడలకి ఆనుకుని జైల్లోలా రెండు సిమెంట్ దిమ్మలు వున్నాయి. అంతే... మరో వస్తువు లేదక్కడ! తలుపు వార చీపురు కట్ట, చెత్త ఎత్తి పోయడానికి చేట ఉన్నాయి. బాత్రూం నీట్‌గా ఉంది. బయట వరండాలో ఆక్వా ఫిల్టర్ బిగించబడి ఉంది. బాగ్‌లో సీసా తీసుకుని ముందు నీళ్లు నింపి పెట్టుకున్నాడు ఆనంద్. ఒక సిమెంట్ దిమ్మ మీద తలగడ, రెండు పల్చని దుప్పట్లు ఉన్నాయి. తన పక్క సరి చేసుకుంటుండగా ఆనంద్ ఉన్న గదిలోకి ఒక కుర్రవాడు వచ్చాడు. బహుశా పాతికేళ్లుంటాయి. స్ఫురద్రూపి... బాగా చదువుకున్న వాడిలా కనపడ్డాడు. 'అతడే తన రూమ్మేటు కాబోలు' అనుకున్నాడు ఆనంద్. గదికి వచ్చే ముందే బారక్స్‌లో తొంగి చూసాడు. అక్కడంతా దార్మిటరీ లా బంకులు వున్నాయి. అందరూ యువకులే ఉన్నారక్కడ. తన అంచనా ప్రకారం అందరూ పెద్దవాళ్లే ఉంటారనుకున్నాడు... వానప్రస్థాశ్రమంలా! కానీ యువకులే ఎక్కువగా ఉన్నారు. అరవైకి దగ్గర పడిన తనలాంటి వాళ్లు తక్కువమందే ఉన్నారు. ఆడవారు కూడా ఉన్నారు గాని, వాళ్ల రిజిస్ట్రేషన్ తర్వాత వాళ్లు విడిగా ఉంచబడ్డారు.

అంతలో లంచ్ కోసం గంట వినపడింది.

ఆనంద్ డైనింగ్ హాలుకి నడిచాడు. భోజనం బావుంది. పప్పు, రెండు కూరలు, ఒక పచ్చడి, పెరుగు కావాలంటే అడగాలి. బెంగాల్‌లో పెరుగు, మజ్జిగ అన్నంలో మనలా కలుపుకోరు. విడిగా తియ్యపెరుగు తింటారు.

భోజనమయ్యాక గదికి వచ్చి జైలు దిమ్మలాంటి పడక మీద నడుం చేరేసాడు. భుక్తాయాసం తగ్గాక లేచి కూర్చున్నాడు. తన రూమ్మేటు లేడు. గదిలో నిశ్శబ్దం భరించలేక తోటలోకి నడిచాడు. పక్షుల అరుపులు తప్ప అంతా నిశ్శబ్దంగా ఉంది. కలకత్తా రొదలో ఇన్నాళ్లు గడిపిన తరువాత, ఇక్కడి నిశ్శబ్ద వాతావరణం దుర్భరంగా ఉంది.

కూతుళ్లిద్దరూ మృదుల, విపుల పూనేలో ఎలా ఉన్నారో! వాళ్ల గురించి తలుచుకోగానే భార్య సుధ గుర్తొచ్చింది.

మృదులకి సంబంధాలు వెతకమని సుధ పోరుపెడుతోంది. తనే... పిల్లలిద్దరూ తమకు నచ్చిన కోర్సులు చదివి, కొన్నాళ్లు ఉద్యోగం చేసి హాయిగా గడపాలనుకుంటున్నారు. అలా స్వేచ్ఛగా ఉంటున్న వాళ్లని ఇంత తొందరగా పెళ్లి అనే పంజరంలో బంధించడం ఇష్టంలేదు తనకి. వయసు మీరితే పెళ్లిళ్లు కావని సుధ భయం. అంతకన్నా మరో పెద్ద భయం... నేడు చుట్టుపక్కల విపరీతంగా కనపడుతున్న కులాంతర, మతాంతర ప్రేమ వివాహాలు...

ఎప్పుడు ఎవర్ని ప్రేమించి ఇంటికి తెచ్చేస్తారోనని కూడా సుధ భయం. సుధకి ఛాందస భావాలెక్కువ. మడి, తడి కావాలి. తనకి అలాంటి పట్టింపులు లేవు. అందుకే కూతుళ్లు తనతో చనువుగా ఉంటారు. ఈ పది రోజుల కోర్సు పూర్తయ్యాక సీరియస్‌గా సంబంధాల్ని వెతకాలి.

పదిరోజుల పాటు తనకీ జైలు జీవితం తప్పదు. కోరి తెచ్చుకున్నదే! స్త్రీల పరిసరాలకు మగవారి నివాసాలకు అడ్డుగోడలున్నాయి. ధ్యానమందిరం, పగోడా చూసాడు.

ధ్యానమందిరం చాలా పెద్ద హాలు. చెట్ల మధ్య ఉంది. హాలులో చిన్నచిన్న నలుచదరాల వంటి మార్వాడీ పరుపులు, దిళ్లు వరుసగా పేర్చి వున్నాయి. కింద కూర్చోలేని వారికోసం ఎత్తుగా పీటల వంటివి ఉన్నాయి. రేపటి నుంచి తను ఇక్కడే అత్యధిక సమయం గడపాలి అనుకున్నాడు ఆనంద్.

తిరిగి ఐదు గంటల ప్రాంతంలో గదికి వచ్చాడు. టీ కోసం బెల్ మోగింది. గబగబ డైనింగ్ హాల్‌కి బయల్దేరాడు. డైనింగ్ హాల్లో మరమరాలు, దోసకాయలతో పాటు, గిన్నెలో ఫలహారం, టీ ఇచ్చారు. రాత్రి డిన్నర్ ఉండదని చెప్పిన మాట గుర్తుకు వచ్చినా ఎక్కు తినలేకపోయాడు అనంద్. టీ తాగి కాస్సేపు అటు ఇటూ తిరిగి పచార్లు చేసాడు. ఎలాగో కాలం గడిపి, ఎనిమిది అయ్యాక గదికి వచ్చాడు. అప్పటికే తన రూమ్మేటు పడుకోడానికి ప్రయత్నం చెయ్యడం గమనించాడు ఆనంద్. భారంగా అరగంట గడిచింది. కళ్లుమూతలు పడలేదు. ఏదో వెలితి!

కడుపు ఖాళీ. ఆకలిగా అనిపించింది. తన సహవాసి అప్పుడే నిద్రపోయినట్టున్నాడు. మెల్లిగా పక్కన ఉన్న బేగ్ తెరిచాడు. పొద్దున్న సీల్దా స్టేషను దగ్గర కొన్న ఆపిల్, స్నిక్కర్ ఉన్నాయి. బయటకు తీసాడు. తినడానికి భయం. కుర్రాడు లేస్తే... అసహ్యంగా ఉంటుంది. తినకుండా డస్ట్‌బిన్‌లో పారేసాడు. మంచి నీళ్లు తాగి నిద్రపోవడానికి ప్రయత్నం చేసాడు. ఈసారి నిద్ర పట్టింది.

★★★

నాలుగు కల్లా గంట మోగింది. శబ్దం వినగానే నిద్రలేచాడు. త్వరగా తయారై మొదటి రోజు ధ్యానమందిరంలో అడుగుపెట్టాడు ఆనంద్. సహాయకుడు తనకు చూపిన పరుపు మీద కూర్చున్నాడు. అప్పటికే చాలావరకు సభ్యులు వచ్చి ఉన్నారు. అందరూ వచ్చాక స్పీకర్లో ఇలా మాటలు వినపడ్డాయి. "అందరూ సుఖాసనంలో కూర్చోండి. మీ శ్వాస మీద ధ్యాస పెట్టండి. వేరే ఆలోచనలు వస్తే రానివ్వండి. కానీ మీ ధ్యాస శ్వాస మీదే ఉండాలి. గంట మోగే వరకూ ధ్యానం కొనసాగించండి"

అందరూ శ్వాస ధ్యాసలో పడ్డారు. రకరకాల ఆలోచనలు! నిశ్శబ్దం అంతటా!

గంట మోగింది. ఆరయి ఉంటుంది.

అందరూ ధ్యానంలాంటి నిద్రలోంచి బయటపడి డైనింగ్ హాల్ కి నడిచారు. వేడి ఇడ్లీలు, కాఫీ! ఆత్మారాముడు శాంతించాక, గదికిపోయి, చీపురుతో గది శుభ్రం చేసి, బాత్రూంలో దూరి స్నానం పూర్తిచేసాడు ఆనంద్. ఆనంద్ బయటకు వచ్చాక అతడి రూమ్మేటు దూరాడు. ఉతికిన లోదుస్తులు ఎండలో వేసి కాస్త సేదతీర్చుకునేసరికి ధ్యానమందిరం గంట మోగింది.

మళ్లీ అదే స్థలం... అదే ధ్యానం. పదకొండున్నరదాకా ఎలా గడిచి పోయిందో రకరకాల ఆలోచనలతో! లంచ్ గంట కొట్టేలోగా ఆనంద్ ధ్యాసలో బంగాళా దుంపల వేపుడు, పప్పు పులుసు ఊరిస్తూ కనిపించాయి. ఎలాగో గంట వినపడింది. ఆనంద్ త్వరగా డైనింగ్ హాల్ కి చేరాడు

కానీ ఆ రోజు పెసరపప్పు, తోటకూర, ఆనపకాయ కూరలు కనపడ్డాయి. ఇష్టం లేని వంటకాలతో తప్పనిసరిగా తిని లేచాడు. గంటన్నర రెస్ట్ అయ్యాక మళ్లీ ధ్యానం. ఐదు వరకు ఎలాగో గడిచింది. టీ టైమ్‌లో కూడా పెద్దగా తినలేకపోయాడు ఆనంద్. అవాళ నిద్రపట్టడం ఆలస్యమైంది ఆలోచనలతో. మరో రెండు రోజులు ఇలాగే గడిచాయి.

మధ్యలో జరిగిన ఒకటి రెండు సంఘటనలు కూడా ఆనంద్‌ని బాగా నిరుత్సాహ పరిచాయి. అతడి రూమ్‌కి దగ్గర్లో ఒక దేవీ ఉపాసకుడు, మరో చిన్నవయసు వ్యక్తి ఉంటున్నారు. రాత్రుళ్లు వాళ్ల గదుల నుండి బిగ్గరగా మాటలు వినపడేవి. రూల్స్‌కి వ్యతిరేకంగా మాటలు వినకూడదనుకున్నా వినపడేవి. ఉపాసకుడు వీరి ధ్యాన పద్ధతులను హేళన చేసేవాడు. అతడితో ఉండే కుర్రాడు రెండేళ్ల పసిపాప తండ్రి. మూడు రోజుల తర్వాత కుర్రాడు కనపడలేదు. తర్వాత తెలిసినదేమిటంటే కోర్సు మధ్యలో వదిలేసి వెళ్లిపోయాడని! అదే గదిలో ఉన్న ఉపాసకుడు మాత్రం ఒక్కడే ఆ గదిలో ఉండేవాడు. ఒకరోజు ఆనంద్ నిద్రపట్టక పచార్లు చేస్తుంటే, ఆ గదిలోంచి మూలుగులు వినపడ్డాయి. తలుపులు తీసి లోపలకు పోయి, చూస్తే జ్వరంతో మూలుగుతూ అపస్మారక స్థితిలో కనపడ్డాడు. అప్పుడే అతనికి ఒక కాలు లేదని, పక్కన ఉన్న కర్రకాలు చూస్తే తెలిసింది. వెంటనే సహాయకుల ద్వారా అతగాడికి వైద్య సహాయం అందజేయడం జరిగింది. ఈ సంఘటన జరిగాక ఆనంద్‌కి కూడా ఇంటిధ్యాస పట్టుకుంది.

ధ్యానమందిరంలో సందేహాలు నివృత్తి చేసే గైడ్‌ని పట్టుకుని తను ఇంటికి వెళ్లడానికి నిశ్చయించుకున్నట్లు చెప్పాడు. గైడ్ ఆనంద్ వంక చూసి "మరొక రెండు రోజులు ఉండి చూడండి. అప్పటికీ అలా అనిపిస్తే మీరు వెళ్లి పోవచ్చు" అని సలహా ఇచ్చాడు.

ఆనంద్ 'సరే'నని తలూపాడు.

ఆరవరోజు ధ్యాన మందిరంలో ధ్యానం చేస్తున్నప్పుడు హఠాత్తుగా జరిగిందది.

ఒళ్ళంతా తేలికగా మారినట్టు, ఆలోచనలు ఆవిరై నట్టు, ఒంట్లో కొత్తశక్తి నూతన ప్రసారం జరుగుతున్నట్టు, ఒక అద్భుత అలౌకిక భావన... మునుపెన్నడూ ఇలా జరగలేదు.

ఇదే సమాధి స్థితా? దీని కోసమే మునులు తపస్సు చేస్తారా?

ఆరోజు గంట త్వరగా కొట్టినట్టనిపించింది. ఆకలి, తిండియావ కూడా బాగా తగ్గింది. మనసంతా ప్రశాంతంగా అలజడిలేని కొలనులా మారింది. లోకమంతా కొత్తగా కనపడింది. పనిలో పనిగా తీరిక సమయాల్లో పగోడాలో ఉన్న వెలుతురు లేని చిన్న గదుల్లో కూడా ధ్యానం చేసినప్పుడు ఇలాంటి అనుభవాలు కలిగాయి.

చూస్తుండగా పది రోజుల కోర్సు పూర్తయింది.

గదిని వదిలిపెట్టి రిసెప్షన్ హాలుకి చేరుకుని లాకర్లో వస్తువులు తీసుకున్నాక, బాకీ పడ్డ బిల్లులు చెల్లించాడు.

అయితే కోర్సు నిమిత్తం వాళ్లు ఎటువంటి రుసుము అడగలేదు. "ఇదొక జ్ఞాన భిక్ష. మీ ముందువారు ఇచ్చిన విరాళాలతో మీకు విద్య నేర్పడమైంది. అలాగే మీరిచ్చిన విరాళంతో మరొకరు నేర్చుకుంటారు. బలవంతం ఏమీ లేదు. ఇచ్చినా, ఇవ్వకపోయినా ఫరవాలేదు!" అన్నాడు నాయకుడు. ఆనంద్‌లోని మధ్యతరగతి మనిషి పదిరోజుల తిండికి, వసతికి రోజుకి ఐదువందల చొప్పున పదిరోజులకి అయిదువేలు కావచ్చని కార్డు ద్వారా పేమెంటు చేసి రసీదు తీసుకున్నాడు. అక్కడ కనపడిన తన రూమ్‌మేటుతో మొదటిసారిగా మాట్లాడేడు.

తన పేరు అక్షయ్‌జైన్‌ట. అతను మార్వాడీ. అతని అమ్మానాన్నా కలకత్తా బాలీగంజ్ లో ఉంటారు. వ్యాపారవేత్తలు. ఇతను అహమ్మదాబాద్‌లో ఐఐఎమ్ చేసి పూనేలో మృదులచేస్తున్న కంపెనీలో పెద్ద హోదాలో ఉన్నాడు. మాటల్లో తను మృదుల గురించి చెప్తే, "యాయా ఐ నో హర్" అన్నాడు. కాస్సేపు ఎమ్ ఎన్ సీ కంపెనీల గురించి మాటలయ్యాక 'బై' చెప్పి గేటు బయటకు వచ్చి రిక్షా ఎక్కాడు ఆనంద్. అతడి మాటల ద్వారా చాల ఫోకస్ ఉన్న వ్యక్తిగా గ్రహించాడు ఆనంద్.

కొత్త అనుభవంతో పాటు కొత్తవ్యక్తితో పరిచయం కూడా ఆనంద్‌లో కొత్త ఉత్సాహం నింపుతోంది.

కుర్రాడు బుద్ధిమంతుడే... గదిలో రూమ్మేటుగా ఉన్నప్పుడు అతగాడి ప్రవర్తన ఎంత సంస్కారయుతంగా ఉండేది! ఒకరోజు తను తుడవటం చూసి మర్నాడు తనకన్నా ముందు లేచి గది ఊడ్చేవాడు. తమ మధ్య మాటలు లేకపోయినా అతగాడి ప్రవర్తన, అలవాట్లు మెచ్చుకోకుండా ఉండలేక పోయేవాడు. చదువుకుని పెద్ద హోదాలో ఉన్నాడు.

ఛటుక్కున ఒక ఆలోచన మెదిలింది. అయితే భార్యను కాస్త ఒప్పించాలి. ఇవాళా రేపు కులాలు గోత్రాలు ఎవరు చూస్తున్నారు? మృదుల కోసం... అక్షయ్ పర్ఫెక్ట్ మేచ్... ఆనంద్‌లో ఆలోచనలు పరిగెడుతున్నాయి.

బాలీగంజ్ పోయేందుకు ఆటో ఎక్కిన అక్షయ్‌జైన్ మొత్తం వివరాలన్నీ మృదులకు ఫోన్లో చెప్తున్నాడు.

# వానప్రస్థం

డా. మజ్జి భారతి

✆ 9440615206

> *ఎప్పుడు వాళ్ల దగ్గరకు వెళ్ళినా, తనెప్పుడు వెళ్లిపోతుందా అని చూస్తుంటారు. చెప్తే గాని ఏ పనీ చెయ్యరు. 'ఏమో! మీకేమి నచ్చుతుందో మాకెలా తెలుస్తుంది?' అనేస్తారు. తనున్నన్నాళ్లూ ముళ్ళమీద ఉన్నట్టుంటారు. అది వాళ్ళ తప్పుకూడా కాదేమో! వాళ్ళు అలా ఉండడానికి కారణం*

తలుపు కొట్టిన శబ్దం వినిపించి తలుపు తీసిన సుశీల ఎదురుగా కనిపించిన మనిషిని చూసి ఆశ్చర్యంతో పాటు ఆనందంలో కూడా మునిగిపోయింది.

"ఏమిటే చెప్పాపెట్టకుండా! కనీసం ఫోన్ కూడా చెయ్యలేదు. ఇంటి అడ్రస్ ఎలా తెలిసింది? ఎలా వచ్చావు? ఎవరు తీసుకువచ్చారు?" ప్రక్కన ఎవరైనా ఉన్నారేమోనని, అటూ ఇటూ చూస్తూ ప్రశ్నల మీద ప్రశ్నలు వేసింది సుశీల, తన ఎదురుగా నిలబడిన, తన ఆప్తమిత్రురాలు సత్యవతిని!

"లోపలికి రానిస్తావా! లేక బయటనుండే మాట్లాడి పంపిస్తావా?" నవ్వుతూ అడిగిన సత్యకు, ప్రక్కకు జరిగి త్రోవిచ్చింది. మంచినీళ్లు తేవడానికి సుశీల వంటగదిలోకి వెళ్లిన ఆ కొద్దిక్షణాలలో హాలునంతా పరిశీలనగా గమనించింది సత్యవతి. హాలులో చిందరవందరగా వస్తువులు... ఏవీ సరైన స్థానాలలో లేవు. షోకేసులో బొమ్మలైతే ఉన్నాయి గాని, ఒక పద్ధతిలో లేవు. ఎక్కడపడితే అక్కడ వాచీలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, రకరకాల బొమ్మలు... పదిమంది పిల్లలను అజమాయిషీ లేకుండా ఒక గదిలో వదిలేస్తే ఎలా ఉంటుందో అలా ఉంది ఈ హాలు! పిల్లలు లేకుండానే ఈ ఇల్లు ఇలా ఉంటే, రేపు పిల్లలు పుడితే ఈ ఇంటి పరిస్థితేమిటి?

పోనీ... వంటగది ఎలా వుందో చూద్దామని అక్కడకు వెళ్ళింది. అక్కడ పరిస్థితి ఇంకా అధ్వాన్నంగా ఉంది. వంటగది నిండా వస్తువులు! ఒక వస్తువు తీస్తే, ఇంకొక వస్తువు పడేటంత ఎక్కువ వస్తువులు. జిడ్డు పట్టిన స్టవ్. సింక్‌లో ఎంగిలి గిన్నెలు...!

సుశీల ఎలా ఉంటుందీ ఇంట్లో? అసలే సుశీలకు శుభ్రమంటే ప్రాణం. వాళ్ళింట్లో ఎక్కడి వస్తువు అక్కడే. ఎన్ని సంవత్సరాలైనా అవి వాటి స్థానంలోనే ఉంటాయి. వాళ్ళింట్లో దుమ్ము అనే మాటే వినిపించదు. ఏ వస్తువైనా అప్పుడే కొన్నట్టు ఉంటుంది. అంత శుభ్రంగా ఉంచుతుంది సుశీల! అటువంటి సుశీల యిక్కడ... ఈ పరిస్థితులలో... ఎడ్జస్ట్ అవుతూ ఉండాలంటే కష్టమే... మనసులోనే బాధపడింది సత్య!

సుశీల భర్త చనిపోయి సంవత్సరమవుతుందేమో! ఒక్కడే కొడుకు. పెళ్లై రెండేళ్లు అయింది, ఇంకా పిల్లలు లేరు. కొడుకు, కోడలిద్దరికీ బెంగుళూరులోనే ఉద్యోగం. సుశీలకు ఒంట్లో బాగులేకపోతే, ఒక్కదానివి అక్కడుండొద్దని, నాలుగు నెలల క్రితమే ఇక్కడకు తీసుకొచ్చాడని వింది. అప్పుడు తాను పెద్దకొడుకు దగ్గరికి అమెరికా వెళ్ళింది. ఇప్పుడు బెంగళూరులోనే

ఉన్న చిన్నకొడుకు దగ్గరికి వచ్చి, సుశీల ఎలా వుందో చూద్దామని వస్తే పరిస్థితిక్కడ ఇలా వుంది. సుశీలను పట్టించుకోదా కోడలు? ఈ ఇంట్లో సుశీల మాటకు విలువలేదా? ఆలోచనలో మునిగిపోయిన సత్య, "ఏమిటే అంత దీర్ఘాలోచన?" అన్న సుశీల మాటతో వర్తమానంలోకి వచ్చింది.

"గదిలోకి పోయి మాట్లాడుకుందాం రా!" సుశీల మాటతో గదిలోకి వెళ్లిన సత్య, ఆ గదిని చూసి తెప్పరిల్లింది. గదిలో ఒక మూలగా మంచం. టేబుల్, రెండు కుర్చీలు. టేబుల్ మీద నీట్ గా సర్దిన డబ్బాలలో బిస్కెట్లు, డ్రై ఫ్రూట్స్, మంచినీళ్ల సీసా. ఎక్కడి వస్తువక్కడ ఉన్నాయి.



చాలా కాలానికి కలిసిన స్నేహితురాళ్ళిద్దరికీ మాటలు తరగడం లేదు.

సుశీలతో మాట్లాడుతోందే గాని, తానీ యింటికి వచ్చి రెండు గంటలైనా, సుశీల కోడలొచ్చి తనను పలకరించలేదని మనసులో అనుకుంటూనే ఉంది సత్య. ఎందుకంటే ఆ అమ్మాయి ఇంటినుండే ఉద్యోగం చేస్తుందని తెలుసు. ఇంకొక బెడ్‌రూమ్ తలుపులు తెరుచుకున్న శబ్దం, వంటగదిలోని గిన్నెల చప్పుళ్ళు వినిపిస్తూనే ఉన్నాయి. ఇంటికొచ్చిన అతిథినే పలకరించలేదంటే, ఆ కోడలు అత్తగారికిచ్చే విలువేమిటో తెలిసిపోతూనే ఉంది. సుశీల మెతకతనాన్ని ఆసరా చేసుకుని, పట్టించుకోవడం లేదేమో కోడలు.

తన కోడళ్ళూ మొదట్లో అంతే. ఇల్లు యిల్లులా ఉండేదా? ఇంటినిండా వస్తువులు... వంట చేసుకోవడానికి బద్ధకమై బయటనుండి తెప్పించుకోవడం... సగం సగం తిని మిగిలింది ఫ్రిజ్‌లో తొయ్యడం... అలా తోసి తోసి... పారెయ్యడానికి కూడా సమయం చిక్కక, అవి కంపుకొడుతూ... ఫ్రిజ్ తియ్యగానే ఏదో చచ్చిన కంపు... యాక్... తలచుకుంటేనే కడుపులో తిప్పినట్టు అవుతుంది. అబ్బబ్బ ఇంటిని చూస్తే వెగటు వచ్చేది. ఎంత ఉద్యోగాలు చేస్తే మాత్రం! ఇంటిని సర్దుకోలేరా! ఇంక ఇలా కాదని తను అయినదానికి, కాని దానికి గట్టిగా నోరు పెట్టబట్టి, ఇరుగుపొరుగుల దగ్గర మర్యాద పోతుందని అప్పటి నుండి తన పద్ధతికి వచ్చారు.

లేకపోతే ఏమిటి? అలా గయ్యాళిలా కనిపించకపోతే కుదరదీ కాలంలో! ఇంక లాభం లేదు. కోడళ్ళు మన దగ్గర భయభక్తులతో ఉండాలంటే ఏమి చెయ్యాలో సుశీలకు నేర్పాల్సిందే!

“ఎలా ఉంటున్నావే ఈ ఇంట్లో? మెత్తగా ఉంటే ఈ కాలంలో కుదరదు” సీరియస్‌గా అంది సత్య.

సత్య ఆలోచనలు అర్థమయ్యాయి సుశీలకు.

తనీ ఇంటికి వచ్చిన మొదటిసారి ఈ ఇంటిని చూసి తనూ సత్యలాగే ఆలోచించింది. వంటగదిని చూస్తే నిజంగా తనకు పిచ్చెక్కిపోయింది. అప్పటికీ తనొస్తున్నానని కాస్త సర్దారు. అయినా తెలిసిపోతూనే ఉంది... జిడ్డు జిడ్డుగా ఉందని!

“ఇలాగేనా ఉంచుకుంటారు వంటగదిని?” బయటకు రాబోయిన మాట నోటిలోనే ఆగిపోయింది, ముప్పయ్యేళ్ల క్రిందట ఇదేమాట తనత్తగారు తనన్న విషయం గుర్తుకొచ్చి! ఎంత చేసినా ఇంకా బాగాలేదని ఆవిడన్న మాటలకు, అప్పుడు తనెంత బాధపడేది? తనేమైనా అంటే ఇప్పుడు కోడలికి కూడా అలాగే అనిపించవచ్చేమో! దానికి తోడు తనప్పుడు ఖాళీగా ఉండేది. ఇప్పుడు కోడలు ఉద్యోగం చేస్తూ, ఇంటిని తనకులాగా ఉంచడం కష్టమేమో!

ఇంటిని శుభ్రంగా ఉంచలేదని అత్తగారేమైనా అంటే, “నా ఇల్లు, నా ఇష్టం” మనసులోనే అనుకునేది, బయటకు చెప్పే ధైర్యం లేక! మరి ఇప్పుడిది తన కోడలి ఇల్లేకదా! ఆమెకు నచ్చినట్టు ఆమె ఇంటిని ఉంచుకుంటుంది. ఇంటిని బాగా ఉంచుకోవాలని ఆమెకు మాత్రం ఉండదా! ఆ కాలంలో అమ్మలు అమ్మమ్మలు ఖాళీగా ఉండి, కూతురింటికి వచ్చి సాయం చేసేవాళ్లు. ఇప్పుడేమిటో... అందరూ జీవితంతో అలసిపోతున్నారు. వాళ్లను వాళ్లు చూసుకునేటప్పటికే వాళ్ల శక్తి అయిపోతుంది. ఇంక కూతుర్లకు, కోడళ్ళకు ఏమి సాయం చెయ్యగలరు? ఎవరింట్లో వాళ్ళు అలవాటైన పద్ధతిలో చేసుకోవడం వేరు. ఇంకొకరింటికి... వాళ్ళెవరైనా కాని, వచ్చి చెయ్యడం వేరు. వాళ్ళింటికి వచ్చి మనమేమి సాయం చెయ్యలేనప్పుడు, వాళ్ల పద్ధతులను గౌరవిస్తే సమస్య ఉండదేమో! వాళ్లకి, మనకీ కూడా మర్యాదగా ఉంటుందేమో!

అందుకేనేమో పూర్వకాలంలో జీవితంలో నాలుగు ఆశ్రమాలన్నారు. బ్రహ్మచర్యం, గార్హస్థ్యము, వానప్రస్థము, సన్యాసం!

పిల్లలు పెద్దవాళ్లై వాళ్లు గార్హస్థ్యం లేదా గృహస్థాశ్రమంలో అడుగు పెట్టగానే పెద్దవాళ్లు వానప్రస్థానికి వెళ్లేవారు. అంటే ఏమిటర్థం? వాళ్ల జీవితాన్ని వాళ్ళని జీవించనివ్వండి. అందులో మీ ఆలోచనలను చొరబడనివ్వకండి. ఇప్పటికైనా ఈ లౌకికబంధాలను వదిలి మీరు ప్రశాంతంగా జీవించండని. ఇప్పుడు వానప్రస్థం అంటూ అడవులకు వెళ్ళిపోలేం గాని, ఒకే ఇంట్లో ఉంటూ అలా బ్రతకడం అలవాటు చేసుకుంటే సరి! ఎప్పుడైతే ఆ ఆలోచన వచ్చిందో, అప్పటి నుండి ప్రశాంతంగా బ్రతకడం అలవాటయింది. కుదిరితే సాయం చెయ్యడం, లేకపోతే నిర్మలంగా కూర్చోవడం. దాంతో కొడుకు కోడలు కూడా హాయిగా ఉంటున్నారు. ఇవన్నీ గుర్తుకొచ్చి నవ్వేసింది సుశీల.

“ఏమిటే నేనింత సీరియస్‌గా మాట్లాడుతుంటే నువ్వు నవ్వుతున్నావు?” కినుకగా అంది సత్య.

“ఈ ఇల్లెవరిది?” సీరియస్‌గా అడిగింది సుశీల.

“అదేమిటే అలా అడుగుతావు? నీ కొడుకుది” సమాధానం చెప్పింది సత్య.

“అంటే నాది కాదు. నా కోడలిది. అంతే కదా!”

"నా ఉద్దేశమదికాదు. నీ కొడుకుదంటే నీది కూడా అవుతుంది కదా!" సర్దిచెప్పింది సత్య.

"నేను చెప్పబోయేది కూడా అదే! నాది కూడా అవుతుంది. కాని నాది కాదు. ఇక్కడే మనం పొరపాటు చేస్తున్నాం. ఇంకా మనది అనుకుంటూ, మనకు నచ్చినట్టు మిగిలినవాళ్ళు ఉండాలనుకుంటున్నాం. ఈ ఇల్లు వాళ్లది, ఇక్కడికి వచ్చినప్పుడు వాళ్లకి నచ్చినట్టు ఉండాలని మనమనుకోవడం లేదు. అదే గొడవలకు కారణమౌతుంది. పూర్వం పిల్లలకు పెళ్లిళ్ళయ్యాక, వానప్రస్థమని పెద్దవాళ్ళు అడవులకు వెళ్లేవారు. పిల్లలొచ్చి అడిగితేనే సలహాలిచ్చేవారు. లేకుంటే లేదు. ఇప్పుడు మనం కూడా అలాగే వుంటే జీవితం ప్రశాంతంగా గడిచిపోతుంది" సుశీల సమాధానం పూర్తికాకుండానే, ట్రేలో పకోడీలు పెట్టుకొని తలుపు తెరుచుకొని వచ్చింది సుశీల కోడలు బృంద, 'నమస్తే ఆంటీ. అత్తయ్యెప్పుడూ మీ గురించే చెప్తుంటారంటూ'.

వంటగదిలో చప్పుళ్ళు పకోడీల ప్రిపరేషనా. తానే అపార్థం చేసుకుందన్న మాట.

బృందను చూసిన సత్యకు తన కోడళ్ళు గుర్తుకొచ్చారు. ఎప్పుడు వాళ్ల దగ్గరకు వెళ్ళినా, తనెప్పుడు వెళ్లిపోతుందా అని చూస్తుంటారు. చెప్తే గాని ఏ పనీ చెయ్యరు. 'ఏమో! మీకేమి నచ్చుతుందో మాకెలా తెలుస్తుంది?' అనేస్తారు. తనున్నన్నాళ్లూ ముళ్ళమీద ఉన్నట్టుంటారు. అది వాళ్ళ తప్పుకూడా కాదేమో! వాళ్ళు అలా ఉండడానికి కారణం తనేనేమో! తనొచ్చిననుండీ వాళ్ల పనుల్లో కనిపించిన తప్పులను సరిదిద్దాలనుకుంటుంది. వాళ్లకది నచ్చదు. వాళ్ల వయసుల్లో తనూ అలాగే ఉండేదన్న విషయం మర్చిపోయి, అది బాగాలేదు... ఇది బాగాలేదు అని చెప్తుంటే వాళ్లకీ విసుగొస్తుంది మరి.

నిజమే సుశీల చెప్పినట్టు వానప్రస్థాన్ని పాటిస్తే మన మర్యాద మనకూ వుంటుంది. మన మనసూ ప్రశాంతంగా ఉంటుంది. సుశీలను చూస్తే ఆ విషయం అర్థమవుతూనే ఉంది. అదీకాక తన కోడళ్ళలా ముఖం ముటముటలాడించుకోకుండా, సుశీల కోడలిలా చేసినదేదో ప్రేమతో చేస్తారు. ఇకనుండి తానుకూడా సుశీల అడుగుజాడలలో నడవాలని నిర్ణయించుకున్నాక మనసుకు హాయిగా అనిపించింది సత్యకు.

## పత్రికా పరిచయం

### అముద్రితగ్రంథ చింతామణి

*1835 లో ఈ పత్రిక ప్రారంభమై, రెండు దశాబ్దాల పాటు తెలుగుసాహిత్యానికి ఎనలేని సేవలు అందించింది. కేవలం అముద్రిత గ్రంథాలను ప్రచురించడమే లక్ష్యంతో ఈ పత్రిక నడిచింది. అప్పటి వరకు చేతివ్రాతలకే పరిమితమైన, ఎన్నో గ్రంథాలను ముద్రించి, ఆ గ్రంథాలను నిక్షిప్తం చేసిన ఘనత సాధించింది. వాటితో పాటు సమీక్షలు, విమర్శలు, చర్చలు, పాఠ్యగ్రంథాలు, కవిపండితుల ఉత్తరప్రత్యుత్తరాలు.. ఈ పత్రికలో ప్రచురించేవారు. ఆధునికాంధ్ర సాహిత్యానికి మూలపురుషులైన వారందరి రచనలు ఈ పత్రికలో వచ్చాయి. ఆ తర్వాత కాలంలో.. 1890 నుండి ఇదే స్ఫూర్తితో న్యాయపతి సుబ్బారావు పంతులుగారి ఆధ్వర్యంలో "చింతామణి" పత్రిక, ఓ నాలుగు సంవత్సరాలు నడిచింది. ముఖ్యంగా.. మొట్టమొదటిగా నవలల పోటీ నిర్వహించిన ఘనత ఈ పత్రికకి ఉంది!*

# కధామంజరి
# బాలకధ

# దేవుడు, దెయ్యాలు, నమ్మకాలు

కథామంజరి బాల కథ

వసుంధర

✆ 9885620065

> ***"మంచిని నమ్ముకుంటే ఎక్కడైనా ఎంత కాలమైనా ఆదరణ లభిస్తుంది. చెడుని నమ్ముకున్నవాళ్లు శిక్ష అనుభవించక తప్పదు. వాళ్లు శిక్ష తప్పించుకుంటే, అది నాలాంటి వాళ్లకు తప్పుడు సంకేతాన్నిస్తుంది. ఇకమీదట నేనూ నీ మార్గాన్నే అనుసరిస్తాను.***

ఆరో తరగతి చదివే సుబ్బుకి ఓ సందేహమొచ్చి తన తాతయ్య వద్దకెళ్లి, "మంచివాళ్లూ, చెడ్డవాళ్లూ కూడా దేవుణ్ణి భక్తితో పూజిస్తారు కదా! దేవుడు ఇద్దరికీ వరాలిస్తాడా? అవి ఇద్దరికీ ఉపయోగపడతాయా?" అనడిగాడు.

తాతయ్య నవ్వి, "నీకు పరీక్షల్లో మంచి మార్కులు రావాలి. అవి దేవుణ్ణి పూజించి వరమడిగితే వస్తాయా? రావు. అందుకు కష్టపడి చదవాలి. అంటే నీ ఆశయం సాధించడానికి స్వయంకృషిని నమ్ముకోవాలి. ఔనా?" అన్నాడు.

"ఔను కానీ, నేనడిగిన ప్రశ్నకి సమాధానం ఇది కాదు కదా!" అన్నాడు సుబ్బు.

"ఎందుక్కాదు? దేవుడంటే వరాలడిగేందుకు చేసిన బొమ్మ కాదు. మంచిని రక్షిస్తాడనే నమ్మకమే దేవుడు, చెడుని శిక్షిస్తాడనే భయం దేవుడు. ఆశయసాధనకు చేసే స్వయంకృషి దైవపూజ. మంచిని నమ్మితే దేవుణ్ణి నమ్మకపోయినా నష్టముండదు. ఈ విషయం అర్థం కావడానికి నీకో కథ చెబుతాను" అంటూ కథ మొదలెట్టాడు తాతయ్య...

ఓ పాడుబడ్డ కోటలో ఆడా మగా, పిల్లా జెల్లా, ముసలీ ముతకా, దయ్యాలున్నాయి. వాటిలో కొన్ని అప్పుడప్పుడు బయటికెళ్లి మనుషుల మధ్య కొన్నాళ్లు మసిలి వచ్చేవి. వాటి అనుభవాలు వినడానికి పిల్ల దయ్యాలు ఉబలాటపడేవి.


ఆ కోటలో ఓ పోకిరి దయ్యముంది. అది ఈ మధ్యే రంగాపురం వెళ్లి శ్రీను అనబడే ఓ దైవభక్తుడి ఇంట్లో కొన్నాళ్లుంది. అక్కడ అది అర్ధరాత్రి వంటింట గిన్నెలు చప్పుళ్లు చేసేది. పడకటింట మంచాలు కదిపేది. ఇంట్లో వస్తువుల్ని కలగాపులగం చేసేది. పెరట్లోంచి నక్కలా ఊళలు పెట్టేది. రాత్రిళ్లు తెల్లచీర కట్టుకుని, జుట్టు విరబోసుకుని, నిప్పుల్లాంటి కళ్లతో తిరుగుతూ కనిపించి ఇట్టే మాయమయ్యేది. శ్రీను ఇవన్నీ పక్కింటి రవికి చెప్పి, "ఇంట్లో దయ్యం చేరిందని మేమంతా అనుమానిస్తున్నాం. నువ్వు దయ్యాల్ని నమ్మవు కాబట్టి ఇంకేదైనా కారణముండొచ్చేమో చెప్పు" అన్నాడు.

రవి హేతువాది. నిజం తెలుసుకోవాలన్న కుతూహలంతో అతడో రాత్రి శ్రీను ఇంట్లో పడుకుంటే, ఆ రాత్రి పోకిరి దయ్యం మరింత విజృంభించింది. రవి పక్కన కూర్చుని పులిలా గాండ్రించి నిద్ర లేపింది. విరబోసుకున్న జుట్టుతో, నిప్పులాంటి కళ్లతో అతణ్ణి ఉరిమురిమి చూసింది. ఆ క్షణంలో పుట్టిన భయంతో కాసేపు ఒళ్లు బిగుసుకుపోయిందతడికి.

ఇంత జరిగినా రవి ఆ ఇంట్లో దయ్యం ఉన్నట్లు ఒప్పుకోలేదు. "నువ్వూ, నీ ఇంట్లోవాళ్లూ అదేపనిగా చెప్పినవి నా మనసు

మీద చెరగని ముద్ర వేశాయి. ఆ ప్రభావంతో మీరన్నవన్నీ చూసిన భ్రమ నాక్కలిగింది. ఒకవేళ నిజంగానే దయ్యమున్నా, దానివల్ల హాని లేదు. ఎవ్వరూ భయపడకండి. కొన్నాళ్లుండి అదే పోతుంది” అన్నాడు.

ఈ విషయం రవి పక్కింట్లో ఉండే రమణకి తెలిసింది. అతడు నాస్తికుడు. దేవుణ్ణే కాదు, దయ్యాల్నీ నమ్మడు. దయ్యం లేదని నిరూపించడానికి ఓ రాత్రి తనూ శ్రీను ఇంట్లో పడుకున్నాడు. చిత్రమేమంటే అతడికి చప్పుళ్లు వినిపించలేదు. దయ్యం కన్పించలేదు. “మా ఇంట్లో కంటే ఎక్కువ ప్రశాంతంగా మీ ఇంట్లో నిద్రపోయాను” అన్నాడతడు శ్రీనుతో. కానీ శ్రీను నమ్మలేదు. ‘అతడు అబద్ధమైనా చెబుతుండాలి. లేదా నిద్రమాత్ర వేసుకునుండాలి’ అనుకున్నాడు.




పోకిరి దయ్యం కోటకు వెళ్లి ఈ వివరాలు చెప్పి, “ఉండబట్టలేక మీకీ విశేషాలు చెప్పడానికొచ్చాను కానీ, అక్కడ నాకింకా చాలా పనుంది. మరికొన్నాళ్లు శ్రీను ఇంట్లో ఉండి వినోదిస్తాను. తర్వాత ఆ రవి, రమణల పని కూడా పడతాను” అంది.

అక్కడున్న ఓ ముసలి దయ్యం ఇదంతా వింది.

అది పోకిరి దయ్యంతో, “మనుషుల్ని తక్కువ అంచనా వెయ్యకు. వాళ్లకి బలం తక్కువ. ధైర్యం తక్కువ. ఐనా తమకంటే బలమైన ఏనుగుల్నీ, క్రూరజంతువుల్నీ లొంగదీసి బానిసల్ని చేసుకుని ఆడించే తెలివుంది, చాతుర్యముంది. ఒకే ఒక్క సృష్టికర్తని కూడా అనేక పేర్లతో విడదీసిన ఘనులు వాళ్లు. వాళ్లతో తలపడడం ప్రమాదం” అని హెచ్చరించింది.

పోకిరి దయ్యం ఆ సలహా పట్టించుకోలేదు, “నేను మళ్లీ శ్రీను ఇంటికి వెడుతున్నాను. ఒక వారంలో తిరిగొచ్చి, నేను చెప్పేది విన్నాక, నీది ముసలి చాదస్తమని ఇక్కడున్నవాళ్లంతా గ్రహిస్తారు” అని వెళ్లిపోయింది.

అక్కడున్న పిల్ల దయ్యాల్లో ఓ సన్న దయ్యం, ఓ లావు దయ్యం ఉన్నాయి. రెండింటికీ దేవుడిపై నమ్మకం లేదు. ఐతే సన్న

దయ్యం మంచిది. లావు దయ్యం ఆకతాయిది. రెండింటికీ మనుషుల మధ్య కొన్నాళ్లుండి రావాలని కోరిక. అందుకని అవి పోకిరి దయ్యం తెచ్చే కబురు కోసం ఎదురుచూస్తున్నాయి. ఐతే వారం కాదు, మూడు వారాలు గడిచినా పోకిరి దయ్యం తిరిగి రాలేదు. ఏం జరిగిందో తెలుసుకుందుకు అవి రంగాపురం వెళ్లాయి.

ఈలోగా రంగాపురంలో దయ్యాన్ని పట్టించడానికి శ్రీను ఓ మంత్రగాణ్ణి పిలిచాడు. వాడా ఇంట్లో మసలుతున్న పోకిరి దయ్యాన్ని గుర్తించి, మంత్రాలతో బంధించాడు. తనని విడిచిపెట్టమనీ, మళ్లీ ఆ ఇంటి జోలికి రాననీ దయ్యం వాణ్ణి బ్రతిమాలింది. ఐనా వాడు కరగలేదు. దాన్ని సీసాలో కెక్కించి, సీసాకి బిరడా బిగించి, శ్రీనుకి ఇచ్చి, "నెల రోజుల పాటు దీన్ని మీ ఇంట్లో ఉత్తరపు గదిలో ఉంచు. అంతవరకూ మళ్లీ ఏ విడ్డూరం జరక్కపోతే, నాకు వెయ్యిన్నూటపదార్లు కానుకగా ఇవ్వు. ఆ రాత్రే సీసాని ఊరి చివర చింతచెట్టు కింద గొయ్యి తీసి పాతిపెట్టి భూస్థాపితం చెయ్యి" అని వెళ్లాడు.

సన్న దయ్యం, లావు దయ్యం వచ్చేసరికి సీసా ఇంకా ఆ ఇంట్లో ఉత్తరపు గదిలోనే ఉన్నది. రెండూ అదృశ్యరూపాలతో ఆ గదిలోకెళ్లి సీసాని తాకబోయి, ఎవరో తోసినట్లు వెనక్కి పడ్డాయి. అప్పుడు సీసాలో ఉన్న పోకిరి దయ్యం, "పెద్దల హెచ్చరికని నిర్లక్ష్యం చేసినందుకు అనుభవిస్తున్నాను. మనుషుల్ని భయపెట్టాలనుకుంటే, ఉన్న స్వేచ్ఛని కోల్పోయి, వారం రోజుల్లో భూస్థాపితం కాబోతున్నాను. ఈ సీసాని మనుషులు మాత్రమే తాకగలరు. ఇక నా గతి ఇంతే!" అంది దీనంగా.

"అలా దిగులు పడకు. నేను వీళ్ల పనిమనిషిని ఆవహించి ఈ ఇంట్లో చేరి అందర్నీ మంచి చేసుకుని, నీకు విముక్తి కలిగిస్తాను. కానీ నేను దయ్యాన్నని తెలిసిపోతే, నాకూ నీగతే పడుతుందని భయంగా ఉంది" అంది సన్న దయ్యం.

"నీకా భయమొద్దు. నువ్వు మంచిని నమ్మావు. మంచిని అడ్డుకోవడం దేవుడికి కూడా వీలు కాదు. మంత్రాలు దేవుడికి సంబంధించినవి కాబట్టి, అవీ నిన్నేం చెయ్యలేవు" అంది పోకిరి దయ్యం.

వెంటనే లావు దయ్యం, "నాకూ దేవుడంటే నమ్మకం లేదు కాబట్టి నేనూ దీనికి తోడుగా ఉంటాను" అంది ఉత్సాహంగా.

దీనికి పోకిరి దయ్యం, "ఆకతాయివి. అల్లరి చెయ్యడం, భయపెట్టడం నీకిష్టం కదా! అలాంటివాళ్లు నమ్మకమున్నా లేకున్నా దేవుడికి భయపడాలి. శ్రీను ఇంట్లో నీకు రక్షణ ఉండదు. రవి ఇంటికో, రమణ ఇంటికో వెళ్లు" అంది.

అప్పుడు సన్న దయ్యం శ్రీను ఇంట్లో పనిమనిషి గౌరిని ఆవహించింది. ఆ రోజామె పనుల్ని ఇంటిల్లపాదీ మెచ్చుకున్నారు.

లావు దయ్యం కూడా అలాగే రవి పనిమనిషిని ఆవహించి వాళ్లింట్లో పనికి వెళ్లింది.

రవిని భయపెట్టి ఆ సీసా బిరడా తీయించాలని దాని పథకం! ఐతే అక్కడ రవికి దేవుడిపై నమ్మకం లేదు కానీ, రవి భార్య మాలతికి దైవభక్తి ఎక్కువే. ఆమె లావు దయ్యంతో ఎక్కువగా దేవుడి గురించి మాట్లాడేది. దాంతో అది రెండ్రోజులకే రవిని భయపెట్టే ఆలోచన మానుకుని, రవి పనిమనిషిని వదిలి రమణ పనిమనిషిని ఆవహించింది.

ఐతే రమణ ఇంట్లో భార్యాభర్తలిద్దరూ నాస్తికులే! దేవుణ్ణీ, దయ్యాల్నీ నమ్మని వాళ్ల వద్ద లావు దయ్యం ఆటలు సాగలేదు.

వారం గడిచింది. పోకిరి దయ్యాన్ని భూస్థాపితం చేసే సమయం వచ్చింది. స్వతహాగా భయస్థుడైన శ్రీను, ఆ రాత్రి తనకి తోడుగా రమ్మని రవి, రమణల్ని సాయమడిగాడు. వాళ్లు సరేనన్నారు.

ఆ రాత్రి పోకిరి దయ్యమున్న సీసాతో శ్రీనుకి తోడుగా రవి, రమణ ఊరి చివర చింతచెట్టు కిందకి చేరుకున్నారు. వాళ్లతో పాటే అదృశ్యరూపాలతో బయల్దేరిన సన్న దయ్యం, లావు దయ్యం, చింతచెట్టు రాగానే ఎగిరి దానిమీద వాలాయి.

శ్రీను, రవి, రమణ వంతులవారీగా గొయ్యి తవ్వాలనుకున్నారు. రమణ వంతు వచ్చేసరికి మిగతా ఇద్దరూ గోతికి కొంచెం దూరంలో కూర్చున్నారు. శ్రీను సీసాని పట్టుకున్నాడు.

అప్పుడు సన్న దయ్యం చెట్టుమీంచి దూకి శ్రీను పక్కన కూర్చుని, "ఇన్నాళ్లూ మీ పనిమనిషిని ఆవహించి మీ అందరికీ సేవలు చేశాను. ప్రతిఫలంగా నాదో చిన్న కోరిక తీరుస్తావా?" అన్నది. అంతే! శ్రీను హడిలిపోయాడు. ఎలాగో ధైర్యం తెచ్చుకుని నెమ్మదిగా రవికి విషయం చెప్పాడు. రవి శాంతంగా, "ఏమిటి నీ కోరిక?" అనడిగాడు సన్న దయ్యాన్ని. అది మొత్తం కథంతా చెప్పి, "సీసాలో ఉన్నది నా పెద్దక్క. బుద్ధి తక్కువై తప్పు చేసింది. ఇక మీదట అలా జరుగదని నాదీ హామీ. దానికి స్వేచ్ఛ ప్రసాదించండి" అంది.

తను నిజంగానే దయ్యంతో మాట్లాడుతున్నానా అని రవికి అనుమానమొచ్చింది. ఆ విషయం ధ్రువపర్చుకుందుకు, "అలాగే చేస్తాం కానీ, ఒక షరతు. నీ సేవలు శ్రీను ఇంట్లోవాళ్లకి బాగా నచ్చాయి. కాబట్టి నువ్వు శాశ్వతంగా వాళ్లింట్లో పనిమనిషిగా ఉండిపోవాలి. అందుకు ఇప్పుడున్న పనిమనిషిని ఆవహించకపోయినా ఫరవాలేదు" అన్నాడు.

సన్న దయ్యం సరేనంది. వెంటనే శ్రీను సీసాని సన్న దయ్యానికి అందించబోయాడు. సరిగ్గా అప్పుడే లావు దయ్యం పైనుంచి కిందకు దూకింది. అదిరిపడ్డ శ్రీను సీసాని విసిరేస్తే, అది సరిగ్గా వెళ్లి రమణ తవ్వుతున్న గోతిలో పడింది. రమణ ఆశ్చర్యంగా, "గొయ్యి తవ్వడం ఇలా పూర్తయింది. అలా సీసా పడింది" అంటూ దాని మీద మట్టి పొయ్యసాగాడు.

సన్న దయ్యం కోపంగా, "ఏయ్! మనమనుకున్నదేమిటి? నువ్వు చేసిందేమిటి?" అని అరిచింది లావు దయ్యం మీద.

"మంచిని నమ్ముకుంటే ఎక్కడైనా ఎంత కాలమైనా ఆదరణ లభిస్తుంది. చెడుని నమ్ముకున్నవాళ్లు శిక్ష అనుభవించక తప్పదు. వాళ్లు శిక్ష తప్పించుకుంటే, అది నాలాంటి వాళ్లకు తప్పుడు సంకేతాన్నిస్తుంది. ఇకమీదట నేనూ నీ మార్గాన్నే అనుసరిస్తాను. నా మనసు స్థిరంగా ఉండాలంటే ఆ సీసా భూస్థాపితం కావలసిందే" అంది లావు దయ్యం!

తాతయ్య సుబ్బుకి ఈ కథ చెప్పి, "తర్వాతేం జరిగిందీ అనడక్కు. మనుషులైనా, దయ్యాలైనా, దేవతలైనా, రాక్షసులైనా– దేవుడి కంటే ఎక్కువగా మంచిని నమ్మాలి. ఆ నమ్మకం సుఖసంతోషాల్నీ, జయాల్నీ ఇస్తుంది. చెడుని నమ్మినవారు కూడా ఇది నమ్ముతారు. ఐనా చెడుని వీడకపోతే, వారికి ఆ నమ్మకమే శాపమై భూస్థాపితమయ్యేంత పతనానికి దోహదం చేస్తుంది. ఇది గ్రహిస్తే దేవుడున్నాడా, దయ్యాలున్నాయా అన్న ఆలోచన వ్యర్థం. అర్థమైందా?" అన్నాడు.

"అర్థమైంది తాతయ్యా! ఇకమీదట నాకు మంచితనమొక్కటే దేవుడు. స్వయంకృషి ఒక్కటే ఆశయసాధనకు ఉపకరణమైన దైవపూజ. ఆ మేరకు నేను నీ కథలో దయ్యాల్ని కూడా నమ్ముతాను" అన్నాడు సుబ్బు.

# కుక్కతోక పట్టి గోదారి ఈదినట్లు


కథామంజరి బాల కథ

కాశీ విశ్వనాథం పట్రాయుడు

✆ 9494524445

> *"నాయనా నువ్వు చదువుకున్న కుర్రాడివి. మనమీద మనం ఆధారపడాలి తప్ప ఇతరుల మీద ఆధార పడకూడదని నీకు తెలియదా? నాలుగు కాళ్ళ జంతువులన్నీ ఈదగలుగుతాయి. వాటికి ఈత వచ్చిందని, జంతువుల తోక పట్టుకొని నీటిలో ఈద కూడదు. మరీ ముఖ్యంగా కుక్క తోక పట్టుకుని"*

పూర్వం గోదారి ఒడ్డున ఉన్న బొమ్మూరులో వీరయ్య, వీరమ్మ దంపతులు నివసిస్తూ ఉండేవారు. వారి కొడుకు వీరేశం. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. వీరయ్య ఇంట్లో ఒక పెంపుడు కుక్క ఉండేది. కొడుకు వీరేశం ఎక్కడికి వెళితే అక్కడికి కుక్క కూడా వెంట వెళ్ళేది.



ఒకసారి కార్తీకమాసంలో వీరేశం స్నేహితులతో కలిసి గోదారి ఒడ్డున ఉన్న తోటలోకి వనభోజనానికి వెళ్ళాడు. అందరూ కలసి కోతికొమ్మచ్చి ఆడుకున్నారు. కాసేపు కబుర్లు చెప్పుకున్నారు. 'తగ్గేదెలే' అనుకుంటూ చిలిపి తగాదాలు పెట్టుకున్నారు. ఇసుకలో కబడ్డీ ఆడారు. ఒకరిపై ఒకరు ఇసుకను జల్లుకున్నారు. ఆడి, ఆడి అలసిపోయారు. వంటినిండా ఇసుకతో చిరాకేసి వీరేశం తప్ప మిగతా స్నేహితులందరూ గోదాట్లోకి దిగారు. కేరింతలతో ఈత కొట్టారు. కాసేపటి తర్వాత ఒడ్డుకు వచ్చి అలసట తీర్చుకుని మళ్ళీ గోదారిలోకి దిగి స్నానం చేసారు. ఇదంతా వీరేశం

నిలబడి చూస్తున్నాడు. వీరేశం కుక్క కూడా గోదాట్లోకి దిగి ఈత కొట్టింది.

స్నేహితులందరూ వీరేశానికి ఈత రాదని గేలి చేశారు. వీరేశం అది తట్టుకోలేకపోయాడు. కుక్కకు ఈత వచ్చు కాబట్టి దాని సాయంతో ఈదాలి అనుకున్నాడు. ధైర్యం చేసి ఒడ్డుకు వచ్చిన కుక్కని మళ్ళీ నీట్లోకి తోసి దాని తోకని పట్టుకున్నాడు. కుక్క గోదాట్లో ఈదుకుంటూ ముందుకెళ్ళింది. కనుచూపు మేరలో ఉన్న జాలరులు ఇదంతా గమనిస్తున్నారు. కొంతసేపటి తర్వాత కుక్క మూతి మాత్రమే బయటకు ఉంచి ఈదుకుంటూ ముందుకెళ్తోంది. వీరేశానికి ఈత రాకపోవడం వల్ల బరువుకు నీటిలో మునిగిపోయాడు. ఇది గమనించిన జాలరులు వీరేశాన్ని రక్షించారు. "నాయనా నువ్వు చదువుకున్న కుర్రాడివి. మనమీద మనం ఆధారపడాలి తప్ప ఇతరుల మీద ఆధార పడకూడదని నీకు తెలియదా? నాలుగు కాళ్ళ జంతువులన్నీ ఈదగలుగుతాయి. వాటికి ఈత వచ్చిందని, జంతువుల తోక పట్టుకొని నీటిలో ఈదకూడదు. మరీ ముఖ్యంగా కుక్కతోక పట్టుకుని" అని చెప్పారు జాలరులు.

కుక్కతోక పట్టుని గోదారి ఈదడమంటే ఏంటో అప్పుడు అర్థమయ్యింది వీరేశానికి.

మన సమాజంలో కొంతమంది వ్యక్తులు ఎవరు ఎన్ని మాటలు అన్నా 'దున్నపోతుమీద వానపడ్డట్టు' పట్టించుకోరు. దేనిమీదా శ్రద్ధ పెట్టరు. అలాంటి వ్యక్తులను నమ్మి వారి మీద ఆధారపడితే 'కుక్కతోక పట్టి గోదారి ఈదినట్లే' అవుతుంది. వీళ్లు చివాట్లు తింటారా లేదా వారి పని పూర్తి అవుతుందా లేదా అన్నది పక్కన పెడితే వాళ్ళని నమ్ముకున్న వాళ్ళు మాత్రం నిండా మునిగిపోతారు. సరిగ్గా అలాంటి వాళ్ళని ఉద్దేశించి వాడేదే 'కుక్కతోక పట్టి గోదారి ఈదడం' అనే జాతీయం.

# వాల్తేరత్త

## "గొరుసు"

✆ 9985406253

### విశిష్ట అతిథి కథ

> ***"నానెంత ఒడ్డీ యాపారం సేసినా, నానూ మడిసి జలమే ఎత్తేను. ఆడపుటకే పుట్టి, పాలిచ్చి పెంచేను. నా పేగు తీపి ఒవులికి అరదమవుతాది సెప్పు? నా సిమ్మాసెలం ఒచ్చేత్తాడొచ్చేత్తాడని నా మనసంతాది బాబూ... !"***
> ***ఇక వినలేక పోయాను. వరాలత్త మాటలు వింటుంటే, దుఃఖం తెరలు తెరలుగా కమ్ముకొస్తోంది.***

విజయనగరం దగ్గరలోని కోరుకొండ సైనిక్ స్కూల్లో మా రెండోవాడికి సీటు రావడంతో పాతికేళ్ళ తరవాత మళ్ళీ ఇలా విశాఖపట్నం మీదుగా వెళ్లబోతున్నందుకు గొప్ప థ్రిల్ గా ఉంది.

సికంద్రాబాద్ రైల్వేస్టేషన్ కు బయలుదేరే ముందు కూడా అమ్మా నాన్నలిద్దరూ వంతపాడినట్టు "రమణా, ఎలాగూ అంతదూరం వెళ్తున్నావు. తిరుగు ప్రయాణంలోనైనా విశాఖపట్నంలో దిగి వరాలత్త ఇంటికి వెళ్ళిరా" అని మరీమరీ చెప్తూ, ఆ ఇంటి గుర్తులు కొన్ని చెప్పారు.

వాళ్ళు చెప్పిన గుర్తులే కాకుండా, నాకు మరికొన్ని గుర్తున్నాయి. నాకు ఊహ తెలిసిన దగ్గరనుండి, మేం హైదారాబాద్ వచ్చేసే వరకూ, కనీసం పన్నెండుసంవత్సరాలైనా ఆ పరిసరాల్లో పెరిగుంటాను. ఆ ఇల్లూ, వీధీ ఇంకా కళ్ళకు కట్టినట్టున్నాయి. మద్దిలపాలెంలోని రామాలయం, ఆ కోవెల పక్కనే కూరగాయలు మొదలుకొని, మాంసం, చేపలూ, పెండలం దుంపలూ... రకరకాల తినుబండారాల్ని అమ్మే మార్కెట్టూ. దాన్ని దాటి కాస్త ముందుకి వెళ్తే... పెద్ద చేదబావి. ఆ బావి చుట్టూ ఆడవాళ్ళు పెద్దపెద్ద ఇత్తడిబిందెల్లోకి నీళ్ళు తోడుతున్న దృశ్యం...!! అక్కడికి కనుచూపుమేరలో పెంకుటిల్లు. అదే వరాలత్త ఇల్లు. అందులో ఒక భాగంలో అద్దెకుండేవాళ్ళం మేము.

అయినా, అంతగా వరాలత్త ఇంటిని గుర్తించలేకపోయినా, ఆవీధిలో ఎవర్నడిగినా ఇట్టే చూపిస్తారు. వరాలత్తని ఎరగనివారెవరు! మద్దిలపాలెంలోనే కాదు... ఆచుట్టుపక్కల నక్కవానిపాలెం, రేసవానిపాలెం, పీతలవానిపాలెం, సీతమ్మధార, ఇసకతోట జనాలకు వరాలత్త పేరు బాగా తెలుసు. ఇంకా నాకు తెలియని వీధుల్లో వారిక్కూడా వరాలత్త పేరు 'నోటెడ్'. అందుకు గల ఒకే కారణం వరాలత్త చేసే 'వడ్డీ వ్యాపారం'.

వరాలత్త వడ్డీ వ్యాపారం చేస్తే మట్టుకు ఇన్ని వీధుల్లోని వాళ్ళకు తెలియాల్సిన అవసరం ఏమిటన్న ప్రశ్నకి సవాలక్ష కారణాలు లేకపోవచ్చుగాని, 'డబ్బు' అవసరం ఉన్న మనిషి, అప్పు వాసనని పసిగట్టినట్టు అంచెలంచెలుగా అలా పాకుతూ, వరాలత్త వాకిట్లోకి చేరేవాడు.

వరాలత్త ఇంటి చుట్టూ ప్రహరీగోడ. లోపల కొబ్బరీ, జామ, మునగ చెట్లున్నట్టు గుర్తు... ఎందుచేతంటే, ఆ చెట్ల కాయల్ని వీధిలో జనాలకి అమ్మేది వరాలత్త. అప్పుడు నాన్న ఆంధ్రా యూనివర్సిటీలో ఉద్యోగం చేసేవాడు.

వరాలత్త నేపద్యంలోకి మరికాస్త వెళ్తే, ఆమెతోపాటు ఆ ఇంట్లో మరో రెండు జీవాలుండేవి. వరాలత్త మొగుడు... నూకరాజు; పుత్రరత్నం... సింహాచలం. నూకరాజు యూనివర్సిటీలోనే ఎటెండర్ గా చేసేవాడు. ఆవిధంగా నాన్నకి వాళ్ళింట్లో మేం ఉన్న పోర్షన్ చూపించాడట.

రోజువారీగా తాగడం అతని హాబీ. తాగినప్పుడు నిప్పుకోడిలా నిటారుగా ఉంది, పల్లెపదాల్ని వల్లెవేస్తూ చిందులేసే నూకరాజు, తాగనప్పుడు వానకు తడిచిన కోడిపెట్టలా ముడుచుకుపోయి, వణికిపోయినట్టు భయంగా, బేలగా ఉంటాడు.



వరాలత్తకి నోరు పెద్దదనీ, గయ్యాళనీ, రాకాసనీ, చమత్కారనీ, జగడాలమారనీ, మందరనీ, కైకనీ... అబ్బో, రకరకాల పేర్లు పెట్టి, వరాలత్త చాటుగా చెవులు కొరుక్కునేవారు జనం. వడ్డీ వ్యాపారం చెయ్యడం వలన కాబోలు, మనిషి ధీమాగా, కాస్త కరుగ్గా, ఎదుటి మనిషిని సవాలు చేస్తున్నట్టుగా ఉండేది. నూకరాజు కన్నా అంగుళం పొడవు ఎక్కువగా ఉండి, ఎత్తుకు తగ్గ లావుతో, గుండ్రని పసుపు రాసుకున్న ముఖంతో, నుదుట రూపాయికాసంత ఎర్రని బొట్టుతో, దివిటీలా వెలుగుతుండేది నాకళ్ళకి.

నిజానికి వరాలత్త నాకు అత్త వరసవదు. మా అమ్మా, నాన్నల్ని అన్నయ్యా, వదినా అని పిలవడంతో నేను అత్త వరస పెట్టి పిలిచేవాడ్ని. వరాలత్తకి చదవటం, రాయటం తెలుసు. తనకు చదువు ఎలా వచ్చిందో చెప్పేటప్పుడు గొప్ప అనుభూతికి లోనయ్యేది.

“మా సిన్నప్పుడు భీముడిపట్నం దగ్గరుండీ ఉప్పుగల్లీలో ఉండీవోరిమి. మా నాన్న జవానుగా ఉజ్జోగం చేసీవోడక్కడ. ఆల్లక్కడ ఉప్పు పండించీవోరు. సీమదొరలూ, దొరసాన్లూ వచ్చీవోరక్కడికి. పంతుల్నెట్టి మాకు సదుం సెప్పించీవోరు. అదేటో... ఈ మాయదారి సదువంటే సెడ్డ బయిం. పంతుల్ని సూడగానే జడిసిపోయి, మాయమ్మ సోళ్లూ, గంట్లూ పోసుకునే గాదుల్లో దాగుండీదాన్ని. అయితేటి, సదువొచ్చీదాకా ఉచ్చోయించీసీవోడు పంతులు. అదిగలాగొచ్చిన గునింతాల సదువు నానొడ్డీయాపారం సేయనందికి పనికొచ్చినాది.”

వరాలత్త కొడుకు సింహాచలం రమారమీ నా ఈడువాడే. నక్కవానిపాలెం స్కూల్లో చదివేవాడు. నేనప్పుడు డైరీఫారానికీ ‘జూ’కీ మధ్యనున్న ‘విశాఖ వేలీ’లో చదివే వాడ్ని. అయితే, ఒకే ఇంట్లో ఉండడం వలన మేం బాగా స్నేహంగా ఉండేవాళ్ళం. వరాలత్తకి ఆ ఊళ్ళో చాలా బంధువర్గం ఉంది. మద్దిలపాలెంలోనే కాస్త దూరంలో వరాలత్త అన్నయ్య, ఇద్దరు తమ్ముళ్లూ ఉండేవారు. వరాలత్తకి తండ్రి లేదు కాని, తల్లి మాత్రం చిన్నకొడుకు దగ్గరుండి, తక్కిన ఇద్దరు కొడుకులూ ఇచ్చే నెలభత్యం డబ్బుల్ని జాగ్రత్తగా తెచ్చి వరాలత్త చేతిలో పెట్టి, వడ్డీకి తిప్పమనేది. ఆ వయసులో ముసలమ్మకి వడ్డీ యావ ఉండడం ఆశ్చర్యం కలిగించేది.

“మా ఇంట్లో దొబ్బితినీసి, డబ్బులొట్టుకెల్లీ కూతురుకిత్తాది ముసిల్కండి” వరాలత్త చిన్నమరదలు కయ్యిమని అరిచేది అప్పుడప్పుడూ. నేనెప్పుడూ సింహాచలంతో ఆడుకోవడం మూలాన వాళ్ళింట్లోనే ఎక్కువ సమయం గడపడంతో వరాలత్త దినచర్య పరిశీలించేవాడ్ని. తెల్లవారింది మొదలు, రాత్రి నిద్రపోయేదాకా ఎవరో ఒకరు వచ్చి, వరాలత్తని బతిమాలి, అప్పు పుట్టించుకు వెళ్ళేవారు. వరాలత్త దగ్గర డబ్బు తీసుకోవాలంటే తప్పనిసరిగా ఏదో వస్తువు తాకట్టు పెట్టాల్సిందే. నోటు రాయించుకొని డబ్బులివ్వడం చాలా అరుదు.

ఎక్కువగా నగలు తీసుకొచ్చేవారు; లేదంటే అప్పటికప్పుడు ఒంటిపైనున్న నగల్ని వలిచి ఇచ్చేవారు. జడబిళ్ళ మొదలు, పాపిటబిళ్ళలు, చెవిదుద్దులు, బుట్టలు, ముక్కుపుడకలు, కాడలు, బులాకీలూ, మెడలోని గొలుసులూ, పుస్తులతాడూ, బంగారమో, వెండో... ఏదో ఒకటి తప్పనిసరి. నగలు తేలేనివాళ్ళు చేతివాచీలూ, రేడియోలూ, టేపు రికార్డర్లూ, బిందెలూ, ఇత్తడి చెంబులూ, దేగిశాలూ లాంటి వస్తువులు తెచ్చేవారు.

ఇలాంటి సామాన్లతో వరాలత్త ఇంట్లోని మచ్చు కిక్కిరిసిపోయేది. వస్తువు ఖరీదు కన్నా వడ్డీ ఎక్కువైపోవడంతో చాలామంది వస్తువుల్ని వదిలేసేవారు. అలా ఇంట్లో ఇత్తడి, రాగి వస్తువులు పేరుకుపోయి ఉండేవి.

ఏ వస్తువు తీసుకున్నా తెల్లని కాయితంముక్కపై తాకట్టు పెట్టిన వాళ్ళ ఇంటిపేరుతో సహా, తీసుకున్న తేదీని రాసి అతికించడమో, దారంతో ఆ వస్తువుకు కట్టడమో చేసేది. ఇక వీటన్నింటి వివరాల్నీ చిత్రగుప్తుడి చిట్టాలాంటి తెల్లకాగితాల పుస్తకంలో రాసేది. బంగారునగల్ని పెద్ద ఇత్తడి మరచెంబులో వేసి, మూత బిగించి, దాన్ని ఇంట్లో ఉన్న రంగంపెట్టెలో దాచేది. నగను బట్టి, వచ్చిన వాళ్ళ అవసరాన్ని తెలుసుకొని, వడ్డీ రేటు మార్చేది. ఎవరొచ్చి అడిగినా, 'నా దగ్గిర నేవు' అంటూనే, వాళ్ళతో బతిమాలించుకొని మరీ ఇచ్చేది. డబ్బు దేనికవసరమో వచ్చినవాళ్లు చెప్తుంటే ఆశ్చర్యం వేసేది.

"వరాలప్పా పలాసానుండి మా ఈరకోడూ, ఈరకత్తీ ఒచ్చేరు. మాయమ్మి పురుడై ఓరం అయ్యింది కదా, ఆళ్ళకి మనవన్ని సూన్నందుకి ఉప్పుడు తీరుబాటైంది. వచ్చినోరికి మరేద సెయ్యాల. ఇంట్లో దమ్మిడీ నేదమ్మా, నీమీదొట్టు! మీ అన్నియ్య కరగ్పూరెల్లేడు. కోడ్ని కోసి, గారిలొండెట్టకపోతే సిన్నతనం కాదేటప్పా? కమ్మ కట్టీరూ? రెండొందలుంటే సూడుమీ"

అదీ... అలాంటి చిన్నాచితకా అవసరాల కోసం నగల్ని తాకట్టు పెట్టేవారు. వరాలత్త ఎంత కచ్చితంగా డబ్బులిచ్చేదో, అంత కచ్చితంగానూ వడ్డీ, అసలూ వసూలు చేసేది. నెల మొదటివారంలో చాలా బిజీగా ఉండేది. మొదటి తారీఖున మాత్రం ఎన్ని పనులున్నా గబగబ పూర్తి చేసుకొని, యూనివర్సిటీకి వెళ్ళిపోయేది. మొగుడికి వచ్చే జీతం కోసం రోజంతా అక్కడే ఉండిపోయేది. వరాలత్త వెళ్లలేదంటే, జీతం డబ్బుల్లో సగం తాగేసి, ఏ జంక్షన్ దగ్గరో దొర్లుతాడు. 'పలానా దగ్గర మీ ఆయన తాగేసి, రోడ్డుకి అడ్డంగా పడిపోయాడని' చెపితే, మొగుడ్ని తిట్టుకుంటూ ఇంటికి ఈడ్చుకు వచ్చేది. పరామర్శించడానికి వాళ్ళమ్మ వస్తే, కోపం నసాళానికి ఎక్కి, ముసలమ్మని సంచి దులిపినట్టు దులిపేసేది.

"ఈ తాగుముచ్చోడ్ని నాకు కట్టబెట్టి, నా బతుకులో నిప్పులోసేవు నా యార్లా. ఈ తాగుబోతు సచ్చినోడితో కాపరం సేయలేనమ్మో! ఇనేవర్సిటీలో ఉజ్జోగవున్నాదని సూసినావుగాని, ఆడు తాగుబోతెదవో, ముండలముటాకోరో, జూదగుండడో ఏటీ సూడకుండా నా నోట్లో బుగ్గోసేసినావే రంకుముండా..." పెద్దపెద్ద కేకలతో కలకత్తా కాళయ్యేది!

కోపంలో ఎన్ని తిట్టినా తల్లంటే చాలా ప్రేమ వరాలత్తకి. తల్లిని ఏ కోడలైనా తిట్టిందని తెలిస్తే, కొంగు నడుముకు బిగించి, తగువుకు వెళ్ళేది. ముసలమ్మ ఏ వేళప్పుడు వచ్చినా, ఇంట్లో ఉన్నదేదో తినడానికి పెట్టేది. మొగుడి జీతం అందిన మర్రోజు నుండీ, ఊరిమీదకు వడ్డీ వసూళ్లకోసం బయలుదేరేది.

"పూర్ణా మార్కెట్లో పళ్ళమ్మీ దాలియ్యమ్మ ఆర్నెల్ల బట్టీ వడ్డీ కట్నందికి రానేదు. ఇయ్యాల దాని కొప్పట్టుకు నాక్కూరానా?"

"కాల్టెక్సులోని కనకారావు ఒడ్డీ కట్టకుంతన్నాడు. ఆడి కాల్రొట్టుకునాగినేక పోతే నాను ఒరాలమ్మనే కాదు..." అంటూ!

"అమ్మా సిప్పుయాడ్డు సిన్నారావు అసలూ, ఒడ్డీ ఇత్తానన్నాడు; ఎల్లీసొత్తాను" వాళ్ళమ్మని ఇంటికి కాపలా ఉంచి!!!

"ఓలమ్మా, సావులమదుమ్ సన్నాసమ్మ ఒడ్డీ కట్నందికి ఒత్తానన్నాదే. పూరాగా మూడొందల పాతిక. జాగర్తగా లెక్కెట్టు సుమీ." ఆవిడకి వసూళ్ళ పని పురమాయిస్తూ వెళ్ళి , సాయంత్రానికి తిరిగి తిరిగి అలిసిపోయి వచ్చేది. ఆశీలుమెట్ట మేకల కబేళా దగ్గరున్న సారాకొట్టును దర్శించుకొని, ఏ రాత్రికో తూలుతూ వచ్చేవాడు నూకరాజు. మేమంతా నిద్రకు ఉపక్రమించే వేళప్పుడు...

'హరి హరి నారాయణా...

ఆది నారాయణా...

కరుణించి మమ్మేలు...

కరుణలోచనుడా...' అని గొంతెత్తి పాడుతూ, తప్పటడుగులు వేస్తూ వచ్చే నూకరాజుకి తోడుగా వీధిలోని కుక్కలన్నీ వంత పాడినట్టు చుట్టూ చేరి మొరిగేవి.

వడ్డీ వ్యాపారంలో వరాలత్తా, తాగుడులో నూకరాజూ తలమునకలవడం తప్ప, సింహాచలం ఏం చదువుతున్నాడో ఇద్దరికీ పట్టేది కాదు. వరాలత్తకి మొగుడైనా, కొడుకైనా 'డబ్బు' తరవాతే! ఒక్క క్షణం తీరికలేనట్టు, ఇంటి పనుల్లో, వడ్డీ పనుల్లో విశ్రాంతి లేకుండా ఉండే వరాలత్తని చూస్తే, ఒక్కొక్కసారి జాలి వేసేది. సరిగ్గా సింహాచలం స్కూల్ నుండి వచ్చేసరికి ఇంటిదగ్గర కాపలాగా ఉండే వాళ్ళ అమ్మమ్మ కనిపించేది.

'తిన్నందుకొచ్చేవా' అంటూ ముసలమ్మని వెక్కిరించేవాడు సింహాచలం. "ఏట్రా ఇరగబడిపోతన్నావూ... నాను నా కూతురింట్లో తిన్నందుకొచ్చేనేట్రా? నీ మావయ్యలు నాక్కూడెట్టకుంటా తగిలేసినారంతావా, సచ్చినోడా? నీ అయ్య బేవార్స్. ఆడు తిరవైనోడైతే నా కూతురికిన్ని పాట్లేటిరా? నీడపట్టునుండి సంసారం సేసును. బాబుకి తగ్గ గండడివి." ముసలమ్మ పెద్దనోటితో తగువేసుకొని, గొడవని పొడిగించేది.

వసారాలో మెట్లపై కూర్చొని మాఅమ్మకు ఫిర్యాదులు చేసేది... "సూడుమీ, సిన్నా పెద్దా నేకంటా ఎలాగ పెల్లిబడిపోతన్నాడో సిగురు లమ్డీకొడుకు! సీమ్మిరపకాయంత నేడు, నామీదకే తిరగబడతన్నాడు" అంటూ.

మనవడితో తగువాడి అలిసిపోయేది ముసలమ్మ. తరవాత మా అమ్మనుద్దేశించి "సాయిత్రమ్మా పొయిలో అగ్గేసినావేటి? సిన్నగ్గినిప్పొట్రమ్మీ. సుట్ట కాల్చుకుంతాను" అంటూ, ఆ పని నాకు అప్పజెప్పేది. పొయ్యి లోనుంచి కాలుతున్న కర్రను తెచ్చి ముసలమ్మకి ఇవ్వడమూ, పొడుగాటి చుట్టను పెదాలమధ్య బిగించి, నిప్పుతో వెలిగించుకొని, గుప్పుగుప్పుమని పొగ వదిలి, పక్కనున్న పాదుల్లోకి తుపుక్కుమని ఉమ్మి, చుట్టని తిరగేసి, కాల్తున్నవేపు నోట్లో పెట్టేసి, అడ్డపొగ పీలుస్తూ, నా వేపు చూసి, కళ్ళతో నవ్వేది.

ముసలమ్మని చిత్రంగా చూడడం నాకు అలవాటు. ఆమె ముక్కుకి రెండువైపులా కాడలుండి, మధ్య దూలానికున్న కన్నంలోంచి, పై పదవి వరకూ జార్నట్టున్న బులాకీ చూస్తే, ఏనుగు దంతాల మధ్య వేలాడే ఏనుగుతొండం గుర్తొచ్చేది. జాకెట్టు వేసుకునేది కాదు. శుభ్రంగా చీరను చుట్టుకొని, తలవెంట్రుకల్ని ఆముదంతో తడిపేసి, కుడిచెవికి దగ్గరగా కొప్పు చుట్టేది. మోచేతుల వరకూ ముగ్గుల పచ్చని పొడిపించుకున్నట్టుగా ఆ ముడతలిడిన చర్మంలో కనిపించేవి. తల పోటని మందారాకుల్నీ, ఉసిరిపప్పునీ దంచుకొని, వెంట్రుకలకి పట్టించేది. గంధం అరగదీసి, నుదుటికి పూసేది. 'ఒళ్ళు సలుపులమ్మా' అంటూ, పాలుగారే పిచ్చిచెట్ల ఆకులు తుంచి, ఆ పాలను ఒళ్ళంతా రాసుకునేది. తాపీగా చుట్ట కాలుస్తూ, మా అమ్మతో కబుర్లకి దిగేది.

"సాయిత్రమ్మా ఉప్పుడేటో ఎంత సంపాదిత్తన్నా ఒవులికీ సాలకంటన్నాది. నా పెనివిటి మిలట్రీలో ఉండీతప్పుడు పదకొండు రూపాయల జీతం తెచ్చీవోడు. నా నలుగురు పిల్లల్నీ ఎలాగ సూసీదాన్నో! గంటన్నవూ, సల్దిగెంజీ, పిండోడిమ్... శాన, జరుగుబాటైపోయాది. వుప్పుడు మాయదారి కాలవొచ్చి పడిపోనాది. మావు ఉప్పుగల్లీలో ఉండీతప్పుడైతే కానీకీ, అర్దనాకీ

సేట నిండా సందువాలూ, ఇంతేసి రొయ్యలూ ఒచ్చీవి. సీమదొరలు రాజ్జవేలీతప్పుడు డబ్బు తక్కువగాని, తిన్నందుకి కొదవుండీది కాదమ్మా..." అలా ఫ్లాష్ బేక్ లోకి వెళ్ళిపోయి, వినేవాళ్ళ బుర్ర తినేసేది. మనకు స్వతంత్రం రాకముందు కథల్ని, బ్రిటిష్ వాళ్ళ పాలనలోని సంగతుల్నీ సినిమా రీల్ లాగా తిప్పేది.

సెలవు రోజు వచ్చిందంటే చాలు, నేనూ, సింహాచలం ఆడుకుంటూ అలా ఇసకతోటకూ, వెంకోజీపాలేనికీ మధ్యనున్న జీడిమామిడి, జామతోటల్లోకి వెళ్లిపోయేవాళ్ళం. ఆ తోటలకు రెల్లివాళ్లు కాపలా ఉండేవారు. వాళ్ళ కన్నుగప్పి కాయల్ని దొంగిలించడం మా పని. మమ్మల్ని వాళ్ళు గమనించకుండా ఉండేందుకు నేలకు చాలా దగ్గరగా, వంగి ఉండే జీడిమామిడి కొమ్మల కిందుగా దూరి, పాకుతూ కాయల్ని తెంపేవాళ్లం. పొరపాటున వాళ్ళు మమ్మల్ని గమనిస్తే, లేడి పిల్లల్లా దౌడు తీస్తూ, బీచ్ వైపు పరిగెత్తేవాళ్లం. సన్నటి సరివిడి కర్రల్ని పట్టుకొని, మా వెనక పరిగెట్టుకొస్తూ, వాళ్ళ రెల్లి భాషలో....

అరెరె... బారిజెల్లి బారిజెల్లి దారుగుండ్రే

గొచ్చిరి కాయలు తిరుగురే సిండి పిల్లుసురే

అంటూ అరిచేవాళ్లు. 'కాయల్ని కోసుకెళ్తున్నారు, పట్టుకోండని' దాని అర్ధమట. అది సింహాచలమే చెప్పేడు. ఇంకా వాళ్ళ రెల్లిభాషలో చాలా బూతులు తిట్టేరనీ, అవి నాతో చెప్పడం తనకిష్టం లేదనీ అనేవాడు. వాళ్ళ భాష తెలియక పోవడంతో అవి నాకు తిట్లలా అనిపించేవి కాదు.

జీడిపళ్ళని తినేసి, జీడిపిక్కల్ని జేబుల్లో దాచుకొని, జామకాయల్ని కొరుకుతూ బీచి దగ్గరకు చేరేవాళ్ళం. సముద్రపుఘోషని వింటూ, ఎండకు తళతళ మెరుస్తున్న ఇసుకలో కాళ్ళు కాలుతున్నా అలాగే నడుస్తూ, తెల్లని పాలనురగలు కక్కుతూ, మాకన్నా ఎత్తుగా వచ్చే కెరటాల్ని చూస్తూ, ఒడ్డునున్న కన్నాల్లోకి పీతల్ని పోనీకుండా ఆ రంధ్రాలు కప్పెడుతూ, గవ్వలూ, శంఖాలూ, అందమైన రాళ్లూ ఏరుకుంటూ... చీకూ చింతా లేని రోజులవి!!

అలా బీచ్లో నడుస్తూ జాలరిపేట దగ్గరకు వచ్చేసరికి జాలర్లు, తల్లీ పిల్లా అంతా కలిసి సముద్రంలోంచి ఒడ్డుకు చేరబోతున్న పడవల్ని కలిసికట్టుగా లాగి, వలల్లో పడిన చేపల్ని ఇసకలో కుప్పగా పోసేవారు. సూర్యకిరణాలు తెల్లని పొలుసులపై పడి, చేపలన్నీ వెండిబిళ్ళల్లా ధగధగమని మెరిసేవి. సిగ్గుబిళ్ళలూ, నల్లపూసలూ తప్పించి, ఒంటిమీద నూలుపోగైనా లేని మా ఈడు జాలర్ల ఆడ, మగ పిల్లల్ని చూసి, గొప్ప సిగ్గేసి, మా తెరిచిన నోళ్లమీద అరచేతితో చప్పుడు రాకుండా బాదుకునేవాళ్ళం. జాలరిపేటనుండి ముందుకు వెళ్తుంటే, విశాలమైన నల్లటి సముద్రంలో దూరంగా పెద్ద ఓడలు లంగరు వేసి కనిపించేవి. అవి కదలక మెదలక ఉండడం ఏంటో అప్పుడు అర్ధమయ్యేది కాదు. చీకటి పడే సమయానికి ఎదురుగా ఉన్న యారాడ కొండపైని లైట్ హౌస్, అందమైన విశాఖనగర కన్యను కాపలా కాసే ఒంటికన్ను రాక్షసుడిలా తిరుగుతూ కనిపించేది.

సాయంత్రం వరకూ తిరిగి, అలిసిపోయి, రామకృష్ణ బీచ్ మీదుగా, మహారాణిపేట నుండి కె.జి.హెచ్. అప్పెక్కి, ఏ.వి.ఎన్. కాలేజీ డౌన్ దిగి, కొత్తరోడ్డుకొచ్చి, మా దగ్గరున్న చిల్లరడబ్బులతో సిటీబస్సెక్కి, మద్దిలపాలెంలో దిగేవాళ్లం.

విశాఖలో ఎక్కువగా తాటిచెట్లూ, కొబ్బరిచెట్లూ ఉండడంతో, సింహాచలం దగ్గర వాటిని ఎలా ఎక్కాలో, ఎలా ఆ కాయల్ని దొర్లించాలో నేర్చుకున్నాను. తాటికాయల్ని కొట్టి, చూపుడువేలితో, బొటనవేలితో ముంజని ఎలా తియ్యాలో, ఎలా తినాలో సింహాచలమే నేర్పాడు.

తోటల్లోనుంచి దొంగిలించుకొచ్చిన జీడిపిక్కల్ని దొంగచాటుగా కర్రల్ని ఏరి, నిప్పు రాజేసి అందులో వేసేవాళ్ళం. అవి రసం కక్కుతూ ఫట్పట్ మని శబ్దం చేస్తూ ఎగిరేవి. నల్లగా కాలిన జీడిపిక్కల్ని నిలువుగా ఎలా కొట్టాలో, పప్పు ముక్కలవకుండా నేర్పుగా ఎలా తియ్యాలో కూడా సింహాచలమే చెప్పేవాడు. పూర్ణా మార్కెట్కి వెళ్లినప్పుడు కూడా ఇలాగే పనసపిక్కల్ని దాచి తెచ్చి, కాల్చుకు తినేవాళ్లం.

అప్పుడప్పుడూ సింహాచలం కొండకి అమ్మా నాన్నలతో కలిసి వెళ్ళేవాడ్ని. కొండపైనుంచి కనిపించే ప్రకృతి రమణీయత ఇంకా నా మనసులో మెదులుతూనే ఉంది. కొండ నిండా పెద్దపెద్ద సంపెంగ వృక్షాలు. తరవాత ఎక్కడ సంపెంగలు కనిపించినా నాకు సింహాచలమే గుర్తొచ్చేది.

వరాలత్తతో కలిసి అనకాపల్లి నూకాలమ్మ జాతరకీ, విజయనగరం పైడితల్లమ్మ జాతరకీ వెళ్ళేవాడ్ని! చేపలు కొనడానికి వరాలత్తతో వెళ్ళడం గొప్ప సర్దాగా ఉండేది. అమ్మతో వెళ్తే, వాళ్ళు చెప్పిన రేటుకే కొనేసేది. వరాలత్త అలా కాదు. గీచిగీచి బేరాలాడుతూ, వాళ్ళ మాటల్లో మాట కలుపుతూ, వాళ్ళకి కోపం తెప్పించేది. చాలామంది జాలర్లు వరాలత్తకి బాగా తెలుసు.

“గురమ్మా ఈ వాలుగ ఎంతకిస్తావు? ఈ ఒంజరం ఎంత? ఈ కానాకడతలేటి ఇలాగ్గుండైపోనాయి? పీతలేటమ్మా వోసనేస్తన్నాయి?” వరలత్త ప్రశ్నలకు మండిపడేవారు. ముఖాలు చిట్లించుకొని కొరకొరా చూసేవారు. రెండు చేతుల్లో చేపని పట్టుకొని, కత్తిపీటలపై బలం చూపిస్తూ గొంతుక్కూర్చున్న వారి తీరు నవ్వు తెప్పించేది.

“ఒలమ్మా, ఒడ్డీల వరాలప్పా… కొన్నావు శానా, ఎల్లోలమ్మా బేరవాడ్డానికొచ్చినాది సవతకారి తల్లి” ప్రతీ అక్షరాన్నీ విడదీస్తూ, రాగం తీస్తూ, వరాలత్త చేతిలోని చేపల్ని విసురుగా లాక్కొని తాటిబుట్టల్లో వేసుకునేవారు. దూరంగా ఉన్నప్పుడూ మనకేసి చూస్తూ “రా బాబూ, రాయోలమ్మా…సందువాలు కొన్నందుకి రా బాబూ. జెల్లసూడుమీ, ‘ఏక్సాసుగెనాగున్నాదో’… ఎగస్టా ముక్కేత్తాను రా బాబు” అంటూ ఇంగ్లీషు పదాలు వల్లిస్తూ పిలిచి, బేరం చెడిపోతే, తిట్లకు దిగుతారు. చేపల బజారు సర్దాగా అనిపించేది.

వరాలత్త వడ్డీ వ్యాపారం మూడు పువ్వులూ ఆరు కాయలుగా ఉంది. దాంతో పాటు చీటీలు వెయ్యాలనే ఆలోచన కూడా వచ్చినట్టు అనిపించింది. తన అన్నాతమ్ముళ్లతో ఎక్కువగా మాటాడేది కాదు వరాలత్త! వాళ్ళు ముగ్గురూ తన కన్నా బాగా డబ్బున్నవాళ్ళన్న ఆత్మన్యూనత. వాళ్లకన్నా బాగా ఎక్కువ డబ్బు సంపాదించి, దర్జాగా బతకాలన్న వరాలత్త ఆలోచన పెనుభూతంగా మారబోతున్నట్లనిపించేది.

తనకున్న బంగారాన్ని తీసుకెళ్లి బేంకులో ఉంచి దానిపైన తక్కువ వడ్డీకి డబ్బు తెచ్చి, బయట వడ్డీలకు తిప్పేది. చిట్టీలు వేసే క్రమంలో తానే ఏజెంట్. ముందుగా మొదటి నెల, పాట లేకుండానే చీటీ ఎత్తి, మళ్ళీ ప్రతీ నెలా తన వంతు కమిషన్ తీసుకునేది.

ముందుగా చీటీలు వేస్తూ, పదిమందితో మొదలుబెట్టి, అరవైమందిని తయారు చేసింది. పదివేల చీటీ నుండి, లక్ష వరకూ ఉన్నట్టు గుర్తు. చీటీల్లో తన ముగ్గురన్నదమ్ముల్నీ కలుపుకుంది. ఒకపక్క వడ్డీ వ్యాపారం, మరోపక్క చీటీలు…ఇంటికి ఎప్పుడూ వచ్చీపోయీ జనం! ‘డబ్బు’ అనే మాట ఇంట్లో ‘రామ జపం’ అయిపోయింది. ఊరిపైకి వెళ్ళి వడ్డీలు వసూలు

చెయ్యడానికి వీలు దొరికేది కాదు. సింహాచలాన్ని వడ్డీలు వసూలు చెయ్యడానికి పంపడం మొదలుబెట్టింది వరాలత్త. బడి ఎగ్గొట్టి వడ్డీ వసూళ్ల కొసం తిరుగుతున్న సింహాచలం గురించి మా అమ్మ బెంగపడేది. నాన్నతో ఒకసారి ఆ విషయాన్ని కదిపింది.

'సింహాచలం స్కూలు మానేసి ఇలా తిరుగుతుంటే వాడి భవిష్యత్తు మాటేమిటని' అడిగింది. 'అది వాళ్ళ సొంత విషయం. మనం జోక్యం చేసుకోకూడదని' చెప్పాడు నాన్న.

తల్లి పురమాయించే పనుల్లో వడ్డీలు చెల్లించే వాళ్ళ ఇళ్లకు ఉదయాన్నే వెళ్లిపోయేవాడు వాడు. తెచ్చిన డబ్బుల్ని లెక్కకట్టి ఒప్పజెప్పేవాడు మొదట్లో! ఆతరవాత వరాలత్త పని చెప్పకపోయినా బడి ఎగ్గొట్టి ఊరు మీద తిరిగేవాడు. వాడు లీలామహాల్లో కనిపించాడనీ, నవరంగ్ థియేటర్ ముందు తిరుగుతున్నాడనీ, నాకూ వాడికీ తెలిసిన మిత్రులు చెప్పడంతో, వాడిపైన ఏదో అనుమానం పొడచూపింది. కాకపోతే, సరిగ్గా స్కూలు వదిలే సమయానికి మాత్రం పుస్తకాలతో ప్రత్యక్షమయ్యేవాడు.

ఒకరోజు రాత్రి మేం అన్నాలు తింటున్న సమయానికి వరాలత్త ఇంట్లోనుంచి ఏదో గొడవ వినిపించడంతో ఎంగిలి చేతులతోనే పరిగెత్తుకెళ్ళాం. కర్ర తీసుకొని సింహాచలాన్ని బాదుతూ కనిపించింది వరాలత్త. మూలకు ఒదిగిపోయి, దిండు అడ్డు పెట్టుకొని, దెబ్బల్ని తప్పించుకుంటూ ఏడుస్తున్నాడు సింహాచలం.

అమ్మ గబగబా వెళ్ళి వరలత్త చేతిలోని కర్ర లాక్కుంది. శివమెత్తినట్టు గట్టిగా అరుస్తూ, సింహాచలం వేపు వెళ్తోంది వరాలత్త. అమ్మ అడ్డుగా వెళ్ళి "ఏం జరిగింది? ఎందుకలా గొడ్డును బాదినట్టు బాదుతున్నావు?" అని అడిగింది.

"నీకు తెల్దు సావిత్రొదినా... ఈ గుంట లమ్డీకొడుకు ఏటి చేసేడో సూడుమీ. ఇనేవర్సిటీలోని సీపరు పద్దాలు దగ్గిర వడ్డీ డబ్బులు రెండొందలు వసూలు చేసి, నాకదివ్వలేదని సెప్పేడు. ఇయ్యాల నానటుకాసి ఎల్తే, పద్దాలు కనిపించి 'మీ అయ్య వడ్డీ డబ్బులిచ్చేడా వరాలప్పా' అనడిగింది. ఆ డబ్బులేయిరా అనడిగితే, బస్సులో పోనాయంతన్నాడు. ఆ ముక్క నిన్న సెప్పనేదు. ఈడి మాట ఎనాగ నమ్మీదమ్మా? నా తాగుబోతు మొగుడితోనే పడతన్నాను... అది సాలనట్టు ఉప్పుడీడు తయారౌతున్నాడు నన్ను ముంచీడానికి!" అంది వరాలత్త.

"ఏదో తెలీక చేసేడు. వాడ్ని వడ్డీ వసూళ్లకి పంపకు. బుద్ధిగా స్కూలుకి పంపు" అంటూ వరాలత్తని కాస్త మందలించింది అమ్మ.

సింహాచలం నావేపు చూసి, సిగ్గు పడినట్టు మొహాన్ని గోడకేసి తిప్పుకున్నాడు. మళ్ళీ ఒకరోజు ఉదయమే, మేము నిద్ర లేవకముందే సింహాచలం పెడబొబ్బలు పెడుతున్నాడు. వరాలత్త కొబ్బరి చీపురుతో వాణ్ని వాయిస్తోంది.

"ఒరేయ్ నాను నీ నుంచి సచ్చీదా? బతికీదా? నాను పాపారావుగోడికి ఏటి సెప్పీదిరా?"

నూకరాజు అడ్డుకోబోయాడు గానీ, అతన్ని ఒకపక్కకి లాగేసింది వరాలత్త. అమ్మా, నాన్నా ఇద్దరూ వరాలత్తని శాంతపరచాలని చూశారు.

"ఏటన్నియ్యా, ఈ పోరంబోకు సచ్చినోడితో నాకు ఉరయిపోనాది. కంచరపాలెం పాపారావు నా కాడ వొచీ ఎట్టాడు. నిన్నను ఆడొచ్చి, అసలూ ఒడ్డీ ఒట్టుకొచ్చేను, వొచీ ఇచ్చీమన్నాడు. మచ్చు మీద ఇత్తడి గలాసులోనెట్టినాను... ఏదీ?

అవుపించనేదు. ఇల్లంతా ఎతికీసినాను! దొరకనేదు! ఈ బేవార్సోడిని అడిగితే... నాకు తెలీకుంటా మొన్నెప్పుడో సేతికి ఎట్టుకేల్లేదంటా... బడి నుండి ఇంటికొచ్చీతప్పుడు దారిలో పడిపోనాదని సెప్తున్నాడు. దాన్నొవుడికి దొబ్బెట్టీసినాడో ఏటో! నానా పాపారావుకి ఏటి సెప్పీదన్నియ్యా? నిన్నని దొరకనేదంటే, ఇయ్యాలొత్తానని ఎల్నాడు!"

అమ్మకీ, నాన్నకీ కూడా ఏం సమాధానం చెప్పాలో పాలుపోలేదు. సింహాచలం ఏడుపు ఆపేసి, ఎన్ని దెబ్బలు తినడానికైనా సిద్ధమన్నట్టు చూస్తున్నాడు. మొండిగా ఉన్న వాడిని చూస్తుంటే ఎందుకో భయమేసింది నాకు.

రోజులు గడుస్తున్నాయి. వరాలత్తకు రాబడి పెరుగుతోంది. చీటీల వలన మంచి లాభాలొస్తున్నాయి. ఒకటో తారీఖున చీటీ పాటల్లో మునిగితేలేది. వచ్చిన వాళ్లందరి మధ్యా లీడర్లా వ్యవహరించే వరాలత్త తీరు హుందాగా కనిపించేది. చదువు లేకపోయినా, డిగ్రీలు చదవకపోయినా, వరాలత్తకున్న లౌక్యం, ధైర్యం ఆమెను ముందుకు నడిపిస్తున్నాయనిపించేది.

ఆ పెంకుటిల్లు తీసేసి, రెండంతస్తుల డాబాఇల్లు కట్టాలని కలలుకనేది. ఆమెకు వస్తున్న రాబడి చూస్తుంటే, ఆ పని త్వరలో చేసి తీరితుందని అనిపించేది నాకు!

అలా కాలం గడుస్తున్న క్రమంలో నాన్నకి హైదరాబాదుకి బదిలీ కావడం జరిగింది. నాకు ఊహ తెలిసిన దగ్గర నుండీ పెరిగిన విశాఖపట్నం వదిలి వెళ్లాలంటే ఏడుపొచ్చింది. రోజూ కనిపించే సింహాచలం, వరాలత్తా, వరాలత్త పెంకుటిల్లూ, చుట్టలు కాల్చే ముసలమ్మా, విశాఖ బీచీ, కొండలూ, పండిన అనాసలూ, సంపెంగలూ, రెల్లివాళ్ళ తిట్లూ, యారాడకొండా, జీడితోటలూ, తాటితోపులూ, చేపలమార్కెట్టూ... వీటన్నిటినీ వదిలిన రోజు మనసంతా మబ్బు పట్టినట్టుగా... చాలా దిగులేసింది.

వరాలత్త కూడా మేము వెళ్తున్నామని తెలియగానే కాస్త చిన్నబోయింది. "రమణా మళ్ళీ ఎప్పుడొత్తావు? నాక్కూతూరు నేకపోయిందిగాని, ఉంటే నీక్కట్టబెట్టీసి, ఇల్లరికం ఉంచీసుకోని, నా వొడ్డీ యాపారవంతా అప్పజెప్పీద్దును నీకు!" అంది.

మేం ఇల్లు ఖాళీ చేసి రైల్వేస్టేషన్ కు వచ్చినప్పుడు సింహాచలం, వరాలత్తా మాతోపాటే వచ్చారు. రైలు కదిలేవరకూ మాదగ్గరే ఉన్నారు. రైలు కదలబోతున్నప్పుడు అమ్మా, వరాలత్తా కళ్ళొత్తుకున్నారు. వరాలత్త కనుమరుగైందాకా కిటికీలో నుంచి చూస్తూ చెయ్యి ఊపుతూనే ఉన్నాను. చివరగా నాకు కనిపించినవి స్టేషన్ లో రాసి ఉన్న 'వాల్తేరు' అన్న అక్షరాలు.

హైదరాబాదుకు వచ్చేసినా, తరవాత చాలా రోజుల వరకూ వరాలత్తని 'వాల్తేరత్త'గా సంబోధించుకుంటూ, వాళ్ళతో గడిపిన జీవితాన్నీ, ముచ్చట్లనీ ఎన్నాళ్ళో నెమరు వేసుకున్నాం!

★★★

సైనిక్ స్కూల్లో ఎడ్మిషన్ పని ముగించుకొని విశాఖ బయలుదేరాను. పాతికేళ్ళ క్రితం విశాఖకీ, ఇప్పటి విశాఖకీ ఎంతో తేడా కనిపించింది. ఎల్లమ్మతోట కాస్తా జగదాంబ జంక్షన్ గా మారింది. మేం చిన్నతనంలో ఆడుకున్న వెంకోజీపాలేనికీ, ఇసకతోటకీ మధ్యనున్న జీడితోట మాయమై, ఎం.వీ.పీ. కోలనీగా అవతరించింది. గాజువాక దగ్గరలోని గంట్యాడ మొదలు... బాలచెరువు, నెల్లిముక్కు, గంగవరం వరకూ వ్యాపించి ఉండిన అందమైన పల్లెలూ, పొలాలూ మట్టిలో కలిసిపోయి, స్టీల్ ప్లాంట్ అవతరించింది. విశాఖ జలసముద్రం పెరిగినట్టులేదు గాని, జనసముద్రం మట్టుకు ఈ పాతికేళ్లలో పదొంతులు పెరిగినట్టుంది.

అలా ముందు రోజు విశాఖ అంతా కలదిరిగి, మర్రోజు ఆటో తీసుకొని వరాలత్త ఇంటికి బయలుదేరాను. ఆటో రామాలయం దగ్గరే ఆపించి, నడుస్తూ ముందుకు వెళ్తున్నాను.

గతం కళ్ళ ముందు గిరికీలు కొడుతోంది. అనిర్వచనీయమైన ఆనందం... నా నరనరాల్లో వ్యాపిస్తున్న తెప్పరిల్లే వీలుకాని భావోద్వేగం!

అదే చేదబావి. నీళ్ళు తోడేవాళ్లు మాత్రం ఎవరూ కనబడలేదు. బావిలోకి తొంగి చూశాను. చుక్క నీరు లేదు. ఎండిపోయిన అడుగు కనిపిస్తోంది. అక్కడ్నుండే వరాలత్త ఇంటికోసం చుట్టూ చూశాను. ఆశ్చర్యం! పెంకుటిల్లు మాటే లేదు. అన్నీ డాబాలే కనిపించాయి. వరాలత్త ఇల్లు అనుకున్న స్థానంలో మూడంతస్తుల అందమైన మేడ కనిపించింది. దాన్ని చూడగానే గొప్ప సంతోషం కలిగింది.

వరాలత్త నన్ను గుర్తు పడుతుందా? నన్ను నేను ఎలా పరిచయం చేసుకోవాలి? అందమైన డాబా... అనుకున్న లక్ష్యాన్ని సాధించిన వరాలత్త వడ్డీలతో, చీటీలతో లక్షలు గడించి ఉంటుంది. ఆ ఠీవి, దర్పం మరింత వన్నె తిరిగి ఉంటాయి. సింహాచలం ఈ వయసులో ఎలా ఉంటాడు? ఉద్యోగం చేయాల్సిన ఖర్మ లేకుండా వరాలత్త అన్నీ సమకూర్చి ఉంటుంది. నూకరాజు సారా మానేసి విస్కీలో తేలిపోతూ ఉండుంటాడు కాబోలు. రకరకాల ఆలోచనల హోరు. తడబడే అడుగులతో, ఉద్వేగభరితమైన మనసుతో వరాలత్త డాబా ముందుకు వచ్చి నిలుచున్నాను. గేటు దగ్గర కాలింగ్ బెల్ స్విచ్ పై చూపుడువేలితో నొక్కేను. తెల్లటి జూలుకుక్క 'భౌ'మంటూ పరిగెత్తుకొచ్చింది. దాని వెనక ఒక ఆడమనిషి... బహుశా, సింహాచలం భార్యేమో!!

"ఎవరండీ?"

"వరాలమ్మగారి ఇల్లు ఇదే కదండీ?" లోపలనుండి వరాలత్త వస్తుందేమోనని చూశాను.

"ఆ పేరు గలవారెవరూ ఈ ఇంట్లో లేరండీ" అంటూ నన్ను అనుమానంగా చూడడం గమనించి...

"పాతికేళ్ళ క్రితం ఇక్కడో పెంకుటిల్లు ఉండేదండీ..." నసిగినట్టు అన్నాను.

"మేం ఈ ఇంట్లో అద్దెకుంటున్నాం. ఇంటిగలవాళ్లు 'డాబా గార్డెన్స్'లో ఉంటారు. మీరు చెప్పినవాళ్ళ తాలూకా కావచ్చు... అదిగో, ఆ ముందు కనిపించే మునగచెట్టు వేపు తిన్నగా వెళ్ళండి. అక్కడున్న కమ్మరింట్లో ముసలమ్మ ఉంటుంది. వరాలమ్మ ఆవిడే అనుకుంటాను"

అదిరిపడి అటువేపు చూశాను. ఆమె చెప్పిన మాటలు చేదుగా అనిపించాయి. మనసంతా వికారమైపోయింది. నమ్మలేని నిజంలా తోచింది. మారుమాటాడకుండా మునగచెట్టు వేపు అడుగులు వేశాను. వరాలత్త ఈ పాకలో ఎందుకుందో, ఉండాల్సిన కర్మ ఏమిటో అర్థం కాలేదు.

ఒంటిరాట తాటికమ్మరిల్లు! ద్వారం కూడా తెలియకుండా కిందనున్న చూరు. నా అడుగుల చప్పుడికి "ఎవరదీ?" అన్న మాటలు వినిపించాయి లోపలనుండి. ఒక్కసారిగా ఒళ్ళు జలదరించింది. ఆ మాట తీరూ, కంఠస్వరం వరాలత్తదే! నిలబడి ఉన్న నేను, కాస్త వంగి చూరు కిందుగా చూశాను. చూరు కింద నులకమంచం పైనుండి లేచి, బయటకు వచ్చింది వరాలత్త!

ఆమెనలా చూడగానే మతిపోయినట్లైంది నాకు.

"ఎవురు బాబూ, ఒవులింటికొచ్చినావూ?" ఆ ప్రశ్నకు సమాధానం చెప్పే స్థితిలో లేనట్టు, వరాలత్తను ఆపాదమస్తకం ఆశ్చర్యపోతూ చూస్తున్నాను. గుండెలోనుంచి తన్నుకొచ్చిన ఒక దుఃఖపు అల నా కళ్ళను కప్పేసింది. చందమామలా గుండ్రంగా ఉండి, పసుపు రాసుకున్న ముఖంలో రూపాయిబిళ్ళంత ఎర్రని బొట్టు... నిండైన విగ్రహం.... ఏదీ? నూకరాజు చనిపోయాడా?

చిక్కి శల్యమైన శరీరం... ముగ్గుబుట్టలా పండిపోయిన తల... లోతైన కనుగుడ్లు... ఎముకలు తేలిన దవడలు... వళ్ళంతా ముడతల్తో వంగిన నడుము... నాలో నుంచి నేను తేరుకోలేని స్థితిలో...!

"ఎవులు బాబూ?" అంది వరాలత్త మళ్ళీ.

"నేను వరాలత్తా రమణని" దుఃఖంతో నా గొంతు పూడుకుపోయింది.

"ఏ రవణా?" భృకుటి ముడుస్తూ, నా కళ్లలోకి చూసింది.

"నా చిన్నతనంలో మీ ఇంట్లో అద్దెకుండేవాళ్ళం. సింహాచలం నేనూ ఆడుకునేవాళ్ళం. అమ్మ... సావిత్రమ్మ, నాన్న యూనివర్సిటీలో ఉద్యోగం చేసేవాడు!"

ఒక్కసారిగా కంపించినట్టుగా వణుకుతున్న చేతులతో నా రెండు భుజాలను పట్టి కుదుపుతూ...

"రవణబాబూ ఈ వరాలత్త ఇంకా గేపకమున్నాదేటి?" వరలత్త కళ్ళు తటాకాలయ్యాయి! దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. పెద్దగా ఏడుస్తూ నా ఒళ్ళు తడుముతోంది. నా అరచేతిని వరాలత్త వీపుపై ఉంచి, ఆమెను అలా కాసేపు వదిలేశాను. దుఃఖం నుండి తేరుకొని, నా చెయ్యి పట్టుకొని ఇంట్లోకి తీసుకెళ్లి, నులకమంచం పైన కూర్చోబెట్టింది. ఇంటిని పరిశీలనగా చూశాను.

నేను కూర్చున్న నులకమంచం, నా చిన్నతనంలోనే చూసిన రంగంపెట్టె, మూలగా పొయ్యి, నాలుగైదు పాత్రలు. దండెం పైన రెండు చీరలూ, మరికొద్దిగా సామాను. అంతకన్నా ఎక్కువగా ఏమీ లేవు. చితికిపోయిన వరాలత్త బతుకు నేపథ్యం గురించి ఆత్రుతతో అడిగాను.

"బోల్డు జరిగిపోనాయి రవణబాబూ. నా బతుకు ఈదికుక్కల పాలైపోనాది. నా నోట్లో బుగ్గోసేసినారు మంద. నా కడుపు కాలిపోనాది నాయినా. నా సిమ్మాసెలం నాక్కాకుంటా ఎలిపోనాడు రవణబాబూ" ఒక్క క్షణం ఆగింది వరాలత్త.

ఏం జరిగిందో నాకు అర్థం కావట్లేదు. సింహాచలం ఏమయ్యాడో తెలీదు. పెళ్లి చేసుకొని వేరు కాపురం పెట్టి, వరాలత్తని చూడకుండా ఉన్నాడా?

కొద్దిసేపు మౌనంగా ఉండి, మళ్ళీ మొదలెట్టింది.

"రవణబాబూ, తవరీ ఊరొగ్గేసి ఎలిపోయినాక ఏటి జరిగిందంటే ఏటి సెప్మంతావు నాయినా! సీటీల మీద సీటీలేసినారు జనం. ఒడ్డీ యాపారవూ జరుగుబాటుగానే సాగినాది. నా సిమ్మాసెలం నన్నొగ్గేసెల్లిపోనాడు రవణబాబూ! నా

రంగంపెట్టిలోన మరసెంబులో దాసిన తాకట్టు సొమ్మొట్టుకు పారిపోన్డు. ఊరి జనవంతా నామీద కెలుపోచ్చీసినారు. నా కన్నోరూ, కట్టుకున్నోడూ అంతా నన్నే తిట్టేరు. నానుండే సిమ్మాసెలం అలా పారిపోనాడన్నారు. నాను సేసిన తప్పేటి? ఆడ్ని ఒడ్డీలు ఒసూలు చెయ్యనందుకి పంపి, డబ్బు రుసి సూపినానని కాకుల్లా పొడిసీసినారు. సిమ్మాసెలాన్ని ఎంత ఎతికించినా నాబం నేకపోనాది. ఒడ్డీకియ్యడం, సీటీలెత్తడం తప్పో, ఒప్పో నాకు తెల్దు.”

“నా మొగుడు తాగుబోతోడై, తెచ్చిందంతా తాగుడుకే తగలేసి, తీరామోసి తాగుడికి నన్నే డబ్బులడిగీవోడు. మాకేటున్నాయి... బూవా? పుట్రా? డబ్బా? దస్కవా? ఏటీ నేదు. మాయమ్మ... సచ్చి ఏ సొరగానుందోగాని, అదిచ్చిన పసుపుకుంకాల జాగవులో నాను ఒడ్డీ యాపారంలో గడించి పెంకుటిల్లేసేను. దాని సలవ్వల్లే గెంజి తాగినాం. పెల్లం సంపాదనకాసించీ, మొగుడూ మొగోడేనా బాబూ? నానూ అందార్నాగా దరిజాగా బతకాలనుకున్నాను. బతకనందుకి ఈ పాపిస్టి యాపారం సేయకూడదని తెలిసినా తప్పనేదు. నా మొగుడు సంపాదిత్తే నాకీ కరమేటి రవణబాబూ. నా సిమ్మాసెలం నాకాడే ఉన్ను. ఆడెలిపోనాక ఏడాదికి తాగితాగి నా పెనిమిటి సచ్చిపోనాడు.”

“ఆనక నా మీద పడ్డాది బాబూ, పిడుగునాటి దెబ్బ. మరి కోలుకోలేకపోన్ను. నాకాడ సీటీలేసిన్నంజి నన్ను దగా జేయిస్సి, రెండు నచ్చల సీటీ పాడీసుకుని, పారిపోనాది. మొగుడూ, పిల్లా అంతా మాయవైపోన్రు. నాను ఎనాగైపోనానో బాబూ. సిమ్మాసెలం ఎత్తుకెలిపోయిన్నగలన్నీ సేయించి, ఊరోల్లందరికీ ఇచ్చీసరికి నాకాడ ఏటీ మిగల్నేదుక!”

“ఆ రెండులచ్చలూ ఎత్తుకెల్లిపోయిన నంజి ఎక్కడున్నాదో తెలీకంటాపోనాది. సికాకులమెల్లి పతి ఎయ్యించినాము. అది డబ్బొట్టుకొని దేసం దాటీసిందన్నారు. మరిక ఏటిసేసి ఏటి నాబం? ఏడిత్తే వత్తాదా? సీటీలోన ఆకరుగా మా తమ్ముడుండిపోనాడు. ఆ నంజి ఎలిపోగానే ఒవులూ సీటీ కట్నందికి రానేదు. ఇచ్చీవోరికి ఎలాగివ్వాలో తెలీనేదు. ఊరి జనం దిగిపోనారు. ఇల్లు తనకా ఎట్టైనా ఇత్తానన్నాను.”

“‘ఊరు మొగుల్లికి ఇచ్చేత్తే నామాటేటప్పా’ అన్నాడు తమ్ముడు. ఆడికి గూడమొయ్యా డబ్బున్నా... ‘ఆపదలోనున్నాదప్పు... దాన్నిబ్బందుల్లో ఎట్టీడం ఎందుకని నేదు’ రవణబాబూ! అప్పనని కూడా సూడకుండా, నంజా, నమిడీ అని బూతులాడీసినాడు. పోలీసుటేసన్లో ఎట్టించేత్తానన్నాడు. ఏటిబాబూ, డబ్బు కాడ అప్పేటి? సెల్లేటి? నన్నా యింట్లో నుంచి బయటకీడ్సీసినాడు. నా సావానంతా ఇసిరీసినాడు. ఆడ్నెప్పుడు ఎర్నమ్మ ఎత్తుకుపోతాదోగాని, అలాగ రాలిపోనాడు బాబూ ఆడు. అడ్డొచ్చిందని మాయమ్మని తన్నీసినాడు. నాయిల్లాడిపేర రాయించీసుకున్నాడు. నానొంటరిదాన్ని. ఏటి సెయ్యగల్ను సెప్పు? నా నుండే మంచవట్టీసింది మాయమ్మ. కూతురు బతుకు బుగ్గైపోనాదని కునుకునేక, కునుకునేక ఏకంగా ఒక్కపాలే మంచంలోనే కునికీసింది బాబూ. మాయమ్మ సచ్చిపోనాక దిక్కునేకుంటా ఒంటరిపచ్చినైపోనాను.”

వరాలత్త ఇలా నాతో మాటాడుతూ ఉండగానే ఎవరో ఆడమనిషి చెవిదుద్దులు తెచ్చి డబ్బు కావాలని అడగడమూ, వరాలత్త రంగంపెట్టె తెరిచి, డబ్బు తీసి ఇవ్వడమూ జరిగిపోయింది.

ఆశ్చర్యపోతూ నోరు తెరిచాను. తనిలా చితికిపోవడానికి కారణభూతమైన వడ్డీవ్యాపారాన్ని ఇంకా వదలలేకపోవడం! నా ఆలోచన పసిగట్టినట్టు “రవణబాబూ నాను బతకనందుకి ఏ ఆదరవు నేకపోతే ఎలాగ? నాకాడికి ఒడ్డీలకి ఒచ్చీ జెనం పూరాగా తగ్గిపోనారు. వొయిజాగులో ఈదీదిలోనా పయినాన్సు కంపినీలూ, చిట్టుపండులూ పుట్టగొడుగుల్లా లెగిసిపోనాయి. అయినా నాకాడ పెట్టుబడీ నేదు. ఏయమ్మో, నామీద్దయున్నమ్మ ఇలాగ అప్పుడప్పుడూ ఒత్తాది. అయినా,

నాకు తెలకడుగుతాను రవణబాబూ, పెల్లాన్నీ, పిల్లల్నీ సూడకుంటా, పేకాటకీ, తాగుడుకీ, ముండలకీ జీతవంతా కరుస్సేయిసి, ఇంట్లోకి దమ్మిడీ ఇయ్యకుంతా ఏడిపిత్తే, కడుపున కాసుకున్నదానికి, పిల్లలు పస్తుంటే పేనం ఎంత సూరుమంతాదో నీకెరికినేదా బాబూ? దయిరం లేనిదాయి సత్తాది! నాలాటిదాయి ఏ ఒడ్డీ యాపారవో, కూరగాయల కొట్టో, కిల్లీ కొట్టో... మరోటో మరోటో.... శివరికి పడుసుకోనైనా పిల్లలకి కూడెడతాది. ఏటంతావు బాబూ.... నా మొగుడు తాగనందికి ఆపీసులో నోన్లు తీసి, బయట అప్పులుమీనప్పులు చేసీసేడని నాకానక తెలిసింది. అప్పిచ్చినోరు ఒల్లకుంతారా బాబూ? ఆడికొచ్చీ పించినీ అంతా జమ కట్టించీసుకుంతన్నారు. వుప్పుడు నాగ్గెంజోసీవోరేరీ? రేపట్నాడు నా సిమ్మాసెలం ఒచ్చీసి, ‘ఒలమ్మ నాకేటి దాసినావే?’ నాకేటి సంపాదించినావే?’ అనంటే నానేటి సెప్పేది బాబూ. ఆడికోసవే కూడేత్తున్నాను. ఇదిగో రవణబాబూ, నా సిమ్మాసెలం బేగొచ్చియ్యాలని అనకాపిల్లి నూకాల్తల్లికీ, యిజీనగరం పైడితల్లమ్మకీ, మాఊరి కనకమాలచ్చిమికీ, బెజోడ కనకదుర్గమ్మకీ ముడుపులు కట్టేను. సిమ్మాసెలం నన్నొగ్గీసెల్లిన కాడ్నుండీ యిలాగే ముడుపులు కడతన్నాను గాని, ఆయమ్మోర్లుకి నామీద దయనేదు! నానేనూతిలోనో పడిపోయి పేనాలొగ్గిద్దును, కానీ రేపో, ఎల్లుటో నా సిమ్మాసెలం ఎలుపొత్తాడని పేనాలుగ్గబట్టుకోనున్నాను. నాన్నేకపోతే ఆడు వొంటరైపోడేటి బాబూ...!”

“నానెంత ఒడ్డీ యాపారం సేసినా, నానూ మడిసి జలమే ఎత్తేను. ఆడపుటకే పుట్టి, పాలిచ్చి పెంచేను. నా పేగు తీపి ఒవులికి అరదమవుతాది సెప్పు? నా సిమ్మాసెలం ఒచ్చేత్తాడొచ్చేత్తాడని నా మనసంతాది బాబూ...!”

ఇక వినలేక పోయాను. వరాలత్త మాటలు వింటుంటే, దుఃఖం తెరలు తెరలుగా కమ్ముకొస్తోంది. ఆ వాతావరణంలో ఎక్కువసేపు ఉండలేననిపించింది. అయినా ఆమె దుఃఖంలోనుంచి తెప్పరిల్లే వరకూ ఉండి, మెల్లగా లేచి నిలుచున్నాను. వరాలత్త దగ్గర సెలవు తీసుకున్నాను. తలెత్తి వరాలత్త కళ్లలోకి చూడకుండా, గబగబా అడుగులు వేస్తూ, రామాలయం వేపు నడిచాను.

రైల్లో ప్రయాణిస్తున్నా... కళ్ళ ముందు ఆ అభాగ్యురాలే! విశాఖపట్నం నుండి హైదరాబాదుకి ఒక చేదు అనుభవం మోసుకుపోవాలనిపించక, ఆనాటి ‘వాల్తేరు వరాలత్తనే’ నెమరు వేసుకుంటూ, కళ్ళు మూసుకున్నాను. మనోనేత్రంలో మాత్రం నేటి వరాలత్త వాస్తవరూపం కదలాడుతూ నన్ను భయపెడుతోంది.

సింహాచలం బతికి ఉన్నాడో, లేడో.. చివరికి వస్తాడో, రాడో తెలీదుగాని, ఆ తల్లిపేగు మాత్రం కడదాకా కొడుక్కోసం అలా దిక్కులు పిక్కటిల్లేలా అరుస్తూనే ఉంటుందేమో!!!

*(ఆంధ్రజ్యోతి, ఆదివారం 5 నవంబర్ 2000 నుండి పునర్ముద్రణ)*

# ఆకాశం
# ఇంత విశాలంగా ఎందుకుంది?

కీ.శే. రంధి సోమరాజు

**కథామార్గదర్శి కథ**

> ***భారత దేశమంతటా ఈ కొత్త కంపెనీ ఎడ్వర్‌టైజ్ కావాలి. అప్పుడు కాని.. సేల్స్ అందుకోవు! ఒక వారం రోజుల్లో మొత్తం దేశమంతా అన్ని దినప్రతికల్లోనూ, బహుళ ప్రచారమున్న వారపత్రికల్లోనూ అడ్వర్‌టైజ్ కావాలని మామగారు నిర్ణయించారు. ఈ పనికి లక్షల మీద డబ్బు ఖర్చు చేయవలసివుంది. వెంటనే తను.. "ఎందుకండీ అంత ఖర్చు? పైసా ఖర్చు కాకుండా అంత విలువా సాధిస్తాను. చూస్తూ వుండండి!" అన్నాడు.***
> ***మామగారు "ఏమి చేస్తావయ్యా?" అన్నారు.***

సత్యమూర్తి గొప్ప వ్యవహార జ్ఞానమున్నవాడు. బహు మేధావి. లాభం లేనిదే ఏ పనీ తలపెట్టడు. అది ఆర్థికంగానూ కావొచ్చు, మానసికపరమైనదీ కావొచ్చు! ఈ విషయంలో ఇతరుల బాధలు, కష్టాలు, నష్టాలు అతనికి వంటబట్టవు. అతని తృప్తే తృప్తి. అందుకు ఏ కించిత్తు కష్టం సంభవించినా అణచుకోలేని బాధ అతనిలోంచి పెల్లుబుకుతుంది, దాన్ని అతను సహించలేడు. ఆ బాధ తీరేవరకూ నిద్రపోడు, నిద్రపోతే, సత్యమూర్తి పూర్తి నిద్రలోకి తరలిపోవలిసిందే. ఇంతటి పట్టుదల మనిషికి వుండకూడదు. కాని అదే అతని జీవితమయింది!

వాళ్ళ బాటిలింగ్ కంపెనీలోని డ్రైవర్ కమ్ సేల్స్‌మన్ రాజు. మంచివాడే, కాని చేసిన చిన్న పొరపాటు.. మేనేజింగ్ డైరెక్టరు సత్యమూర్తిని దహించి వేసింది. కళ్ళు ఎర్రబడిపోయాయి. పళ్ళు బిగిసి పోయాయి. పెదవి చలించింది. అయినా ఆ చేష్ట, డ్రైవరు రాజు చేసిన ఆ అసందర్భపు ప్రేలాపన.. అందులో తనను ఎంతగానో గౌరవించే డీలరు ముందు.. శరీరం వూగిపోయింది! వీడి పని పట్టాలి. మనసు కెవ్వున అరిచింది. వీడిని సర్వనాశనం చేసిగాని వదలకూడదు!

ఆ ఊహ ప్రళయంగా విచ్ఛిన్నమై, శిరోవేదనై విజృంభించింది.

మనసు ఏ పనిమీదికి పోవడం లేదు. ఇంతటి అవిధేయతను తన శరీరం తట్టుకోలేదు. తొందరగానే శిక్షించాలి. 'వాడికి శిక్ష – తన మనసుకు శాంతి' ఇదే తన కోరిక.

వాడికి తెలియకుండా వాణ్ని శిక్షించాలి. క్రమంగా కొన్నాళ్ళకు గాని, వాడికా శిక్ష ఫలానా అందుకు పడిందని తెలియకూడదు. అప్పుడు వాడు తన గుండెల్లో కుమిలి కుమిలి దహించుకుని పోవాలి. నిలువునా ఆ మంటల్లో వాడు బూడిద కావాలి. ఒకటి ఉద్యోగం ఊడిపోవడం, రెండు... గుండెల్నిండా పొగలు జిమ్మే బాధ!

అంతే జరగాలి. లేకపోతే మేనేజింగ్ డైరెక్టర్ సత్యమూర్తిగారు చెప్పినా నీకు సరుకు దింపేది లేదు అంటాడా? ఎన్ని గుండెలు? ఆ డీలరు సాలూరు బుగత అంతగా బతిమాలినా "మీ ఎమ్.డి.కి నేను చెప్తాను. నీకేం భయం లేదు" అని అంటున్నా, ఎన్ని అనవసరమైన మాటలన్నాడు. వాడిలో తన మీద అక్కసు వుంది. అట్టడుగువానికి తన యజమాని మీద, అందులో నిజాయితీపరుడైన యాజమాని మీద ఎందుకు ఆ అక్కసు? వాడి మొహం.. వాడికి పెద్ద మొనగాడై పోయినట్టు; వాడికి కొన్ని ప్రిన్సిపల్సా...?



"ఇవాళ చాలా అర్జంటు. సరుకు నాకు దింపెయ్! సత్యమూర్తిగారికి నేను ఫోను చేసి చెప్తాను, నీకే యిబ్బందీ వుండదు" అంటున్నా సరుకు ఫలానా వారికి ఇవ్వడానికి బయలుదేరాను. కాదు, నేను బయలుదేరలేదు, వాళ్ళే బయలుదేరతీశారు. మధ్యలో ఈ అడ్డగోళ్ళ వ్యవహారమేమిటి? ఎవరికి ఇమ్మన్నారో వాళ్ళకే ఇస్తాను. మధ్యలో నువ్వెవరివయ్యా తంటసంలా...ఆ డీలరు మాత్రం నీలాటివాడు కాడేమిటి? డబ్బంతా కట్టి, అతను కొనుక్కుంటే మధ్య నువ్వేమిటి అడ్డు తగుల్తావు? నీకు మా సత్యమూర్తిగారు చెప్పినా యివ్వను." అంటూ విసురుగా సవాలు చేస్తున్నట్టే అన్నాడు.

"ఒరేయ్.... మాకు డబ్బు గురించిన బాధలేదు. నువ్వే మాట్లాడు ఫోను, మీ సత్యమూర్తిగారు ఇమ్మంటేనే ఇయ్యి! ఒక్క క్షణం, నిమిషాల మీద ఫోను వచ్చేస్తుంది. వైజాగే కదా.... ఆపరేటర్లందరూ తెలిసినవాళ్ళు! క్షణాల మీద కాల్ వచ్చేస్తుంది. సరుకు వాళ్ళకు రేపు ఇవ్వొచ్చు. ఆగు!" అంటూనే ఉన్నాడు.

కాని విసురుగా లారీ ఆపకుండా దూసుకుపోయాడు.

"ఈ యవ్వారంలో సత్యమూర్తిగారెవరయ్యా మధ్య? ఇలాంటి పని ఆయన చెయ్యనున్నా చెయ్యను. చెప్పుకో నీ తాతతో.. " అంటూ వెళ్ళిపోయాడు.

'చెప్పుకో నీ తాతతో' ఈ పనికిమాలిన మాట.. సత్యమూర్తి గుండెల్ని దహించి వేస్తోంది. చిన్న చీమలాంటివాడు, నోరెత్తడానికి వీలులేనివాడు, అంతమాట అనడమా... నో... నో...! ముందు ఈ అవిధేయతకు శిక్ష పడాలి. అప్పుడు కాని

తన మనసు శాంతించదు. ముందు వాడు చేసిన పని సమంజసమైనదా కాదా... అని కాదు. ఆ మాట, దాని తీరు చూస్తూ వుంటే, ఏమాత్రం సహించడానికి వీలులేనట్లుగానే వుంది. మరీ ఘోరం! ఆ సాలూరు బుగత.. రాజును తనముందు నిలబెట్టి నిలదీసినప్పుడు, "తప్పుపని మా సత్యమూర్తిగారు చెయ్యమనరు. ఒక వేళ ఆయన అన్నా.. నే చేయను! చెప్పుకో నీ తాతతో....!" అన్నట్టు తన మొగం మీదే అన్నాడు. ఇది మరీ అన్యాయం.. ఏదో పొరపాటై పోయింది. అంటే సరిపోయేది !

'సాలూరు బుగతకూ, తనకూ ఎంతో స్నేహమున్నట్టు రాజుకు తెలుసు, తెలిసి కూడా ఇలా చేయడం, రాజు అంతరాంతరాల్లో తనను లోకువ చేయాలనే... 'అందులో పెద్దల ముందు తనను అవహేళన చేయాలనే లక్షణమే కనిపిస్తోంది. ఇలాంటివాడు ఉండతగడు, ఇలాంటి బుద్ధి హర్షించ తగ్గదికాదు. ముందు ఇలాంటివాణ్ని ఏరిపారెయ్యకపోతే, మిగిలిన పనివాళ్ళూ బరితెగిస్తారు. ఎడ్మినిస్ట్రేషన్ పూర్తిగా దెబ్బతింటుంది. అంచేత వీడి పని పట్టాలి. ఇందుకు శిక్షిస్తున్నట్టు తెలియకుండా శిక్షించాలి. అప్పుడు మిగిలినవాళ్ళు ఒళ్ళు దగ్గరుంచుకుంటారు!' అనుకున్నాడు.

కాని ఏమిచేస్తే ఇంతపని కరెక్ట్‌గా జరుగుతుందో .... అన్నది ఊహాపథంలో తేలి చావడంలేదు. ఎలా శిక్షించాలి? అద్భుతమైన శిక్షపడాలి. కళ్ళు పేలిపోవాలి. ఒక్కసారి ఒళ్ళు జలదరించాలి. అబ్బా ఇంతలోతైన ఆలోచనా అనుకోవాలి. అప్పుడు కాని తన మనసు కుదుటపడదు.

సత్యమూర్తికి నిద్ర రావడంలేదు, ఆలోచన తెమలడంలేదు. తను ఎన్నెన్నో గొప్ప పనులు చేశాడు. చిన్నప్పటినుంచీ తను హీరో! తన పెళ్ళి విషయంలోనే తను మహాద్భుతమైన తెలివిని ప్రదర్శించాడు, ఆవిడ యిప్పటికీ ఆ సంఘటన మరిచిపోదు. అసలు ఆ సంఘటన ప్రపంచంలోనే 'ఎవ్వరూ మరచిపోలేరు.

సరోజ, తన మేనమామతో సినిమాకు స్కూటరు మీద బయలుదేరి, టిక్కెట్లు దొరక్క ఇంటికి చిరాగ్గా తిరిగి వెళ్ళిపోతూ వుంది. మేనమామను చిన్నచిన్న 'చివాట్లు వేస్తూనే వుంది. 'నీ మొహం నీకేమీ చాతకాదు' అనడం తనకు వినిపించింది. క్షణంలో ఎదురుగా వస్తూన్న తన బుల్లెట్ వాళ్ళ స్కూటరు పక్క ఆగడం, "ఏం వెళ్ళిపోతున్నారు" అని తను అనడం జరిగిపోయింది.

సరోజ మొగం మీద నరాలు విరిగి పోతున్నట్టున్నాయి. "ఈయనగారు టిక్కెట్లు కూడా సంపాదించలేని మొనగాడు. ఆఫ్ట్రాల్ సినిమా టిక్కెట్లు!" అంది.

ఆ మాటలోని ఎన్నెన్నో అర్థాలు సులువుగానే వూహించగలిగిన సత్యమూర్తి, "అదేమిటి నే తెస్తాను రండి...." అన్నాడు. వెంటనే సరోజ మేనమామ, అతనూ పాతికేళ్ళవాడే.. "బుకింగ్ క్లోజండీ" అన్నాడు.

"ఆఫీసర్ల టిక్కెట్లుంటాయి. లేపోతే ఎక్స్‌ట్రా చైర్స్ వేయిస్తాను. సరోజ మొదటి రోజునే చూడాలి!" అన్నాడు. "వద్దులెండి. ఎక్స్ట్రా చైర్స్ నాకిష్టముండదు.' అంది.

"కాదు, ఇవ్వాళ మీరీ ఆట తప్పక చూస్తారు! అందులో తేడా వుండదు." అన్నాడు.

"అయితే, మీరు వెళ్ళండి." అంటూ మేనమామ సరోజ వైపు చూశాడు.

సరోజ సత్యమూర్తితో సినిమా చూసేందుకు సిద్ధమైనట్లుంది. ఉండడమేమిటి సత్యమూర్తి బుల్లెట్ మీద కూర్చోడానికి వచ్చేసింది.

మేనమామ దిగాలుగా యింటికి దారి తీశాడు.

తను తిన్నగా థియేటరు యజమానిని కలుసుకున్నాడు. ఆఫీసర్లు రాకపోవడం వల్ల ఆ టిక్కెట్లూ అమ్మకం అయిపోయినట్లు తెలిసింది.

'సరోజ'ను తను ఒకసారి కళ్ళారా చూశాడు. సరోజ ఎంత గొప్ప వారింటి బిడ్డో.. క్షణాల మీద అంచనా వేసేసుకున్నాడు. థియేటరు యజమానిని పక్కకు పిలిచాడు. ఏమి మాట్లాడాడో ఏమో.... పదినిమిషాలలో వీధిలో ఓ బోర్డు వేలాడింది. "ఈ రోజున మొదటి ఆట అనివార్య కారణాల వల్ల ప్రదర్శించలేకపోతున్నాం. మీరు కొన్న టిక్కెట్లు రెండవ ఆటకు చెల్లుతాయి. అకారణంగా వచ్చిన కష్టాల వల్ల ఈ ఇబ్బంది. క్షమించండి."

చేసేది లేక, ప్రజలు కొంచెం కొంచెం తిట్టుకుంటూ రెండవ ఆటకు రాలేనివారు, టిక్కెట్లు అమ్మేసుకుంటూ ఇళ్ళకు వెళ్ళిపోయారు.

మొత్తం సరోజ, సత్యమూర్తి ఇద్దరే ఆ ఆటను ఆవేళ కనులారా చూశారు. రెండు ఆటల డబ్బు అప్పటికప్పుడు థియేటర్ యజమాని కిచ్చి, ప్రదర్శన జయప్రదం చేశాడు. ఆ థ్రిల్ సరోజ గుండెల్లో అపార ప్రేమానురాగాలను మొలకెత్తించింది. తరువాత సరోజతో పెళ్ళి, గొప్ప ఆస్తి, ఎంతో సుఖం పెనవేసుకొని తన వాకిట నిలిచాయి. ఆపైన ఈ విషయం తెలిసిన మామ కోటయ్యనాయుడుగారు తనను బహు మేధావిగా నిర్ణయించుకున్నారు. కొత్త కంపెనీ మెషీన్ టూల్స్ వ్యవహారాలు చూడమని తనను నియమించారు. ఇందులోనూ ఓ అమృతాన్ని సాధించాడు తను. భారత దేశమంతటా ఈ కొత్త కంపెనీ ఎడ్వర్‌టైజ్ కావాలి. అప్పుడు కాని.. సేల్స్ అందుకోవు! ఒక వారం రోజుల్లో మొత్తం దేశమంతా అన్ని దినప్రతికల్లోనూ, బహుళ ప్రచారమున్న వారపత్రికల్లోనూ అడ్వర్‌టైజ్ కావాలని మామగారు నిర్ణయించారు. ఈ పనికి లక్షల మీద డబ్బు ఖర్చు చేయవలసివుంది. వెంటనే తను.. "ఎందుకండీ అంత ఖర్చు? పైసా ఖర్చు కాకుండా అంత విలువా సాధిస్తాను. చూస్తూ వుండండి!" అన్నాడు.

మామగారు "ఏమి చేస్తావయ్యా?" అన్నారు.

కాని, తనను శంకించలేకపోయారు. తన శక్తి సామర్థ్యాల మీద వారికి గొప్ప నమ్మకం!

ఆఫీసులో మూడో రోజున దొంగలు పడ్డారు. కాని, ఏమీ పోలేదు. ఇనప్పెట్టెలోని లక్షా యాభై వేలు చెక్కు చెదరకుండా అలానే ఉన్నాయి. ఇనప్పెట్టెను తెరవడానికి దొంగలు ఆక్సీ ఎసటలీన్ ఫ్లేమ్ కూడా ఉపయోగించారు. వాచ్‌మన్‌ను ఓ స్తంభానికి కట్టివేసి మారు తాళాలతో తెరవడానికి యత్నించారు. కాని ఆ ఫైర్‌ప్రూఫ్ సేఫ్ వాళ్ళకు లొంగలేదు. నిజంగా పెట్టె తయారు చేసిన కంపెనీవారిది కదా ఆ క్రెడిట్! అదే భావాన్ని వ్యక్తం చేస్తూ తను, తమ ఆఫీసు లెటర్ హెడ్ మీద నైస్‌గా టైపు చేయించి, ఆ కంపెనీ వారిని అభినందిస్తూ, 'తమ డబ్బును అన్యాక్రాంతం కానివ్వని ఆ సేఫ్‌కు ధన్యవాదాలర్పిస్తూ' ఓ చిన్న ఉత్తరం రాశాడు. అంతే! వారం రోజులు తిరక్కుండానే ఆ ఇనప్పెట్టెల కంపెనీవారు తను రాసిన ఉత్తరాన్ని ఫోటో ప్రింట్ తీసి బ్లాకుగా మలచి తమ ఎడ్వర్టయిజ్‌మెంట్‌లో నైస్‌గా ఇరికించి ప్రచురించారు. దేశంలోని అన్ని దిశల్లోని పత్రికల్లోనూ అడ్వర్‌టైజ్ చేశారు.

దీనితో అనుకున్న పని పూర్తి అయింది. ఆ లెటరు హెడ్‌లో తమ కంపెనీ ఎక్కడ వున్నదీ, ఏమేమి తయారుచేసేది.. పూర్తి

వివరాలు ఉన్నాయి. వారం రోజులు తిరక్కుండా తమ కంపెనీకి కొల్లలుగా దేశంలోని అన్ని మూలల నుంచి ఎంక్వయిరీస్ వచ్చిపడ్డాయి.

మామగారు తన ప్రజ్ఞకు దిగ్భ్రాంతి చెందారు. ఎంతగానో అభినందించారు!

కానీ ఖర్చు కాకుండా లక్షలు కలిసొచ్చే పనులు చేయగలిగిన తనకు, ఈ డ్రైవర్ రాజు విషయం మనసును వేధించేస్తోంది. ఇది తను భరించలేడు!

లీగల్ ఎవేజన్ చేసి తను కంపెనీకి లక్షలు లక్షలు ఆర్జించి పెట్టాడు. ఇవి చెప్పుకోడానికి బాగుండవు. కాని డైరెక్టర్లందరూ కథలు కథలుగా చెప్పుకుంటూ, తనను రకరకాలుగా ప్రశ్నిస్తూ, తను చేసిన పనులు తనకే చెప్తూ రకరకాలుగా ఉవ్విళ్ళూరిస్తున్నప్పుడు, 'ఎలా వస్తాయయ్యా ఇలాంటి ఊహలు?' అన్నప్పుడు, తనకు కలిగే ఆనందం చెప్పలేనిదికదా... అందులోమామగారు మరీను!

తను పడుతూన్న ఈ బాధ చూడలేక మామగారు రెస్క్యూలోకి వచ్చారు. తన ఆవేదన అర్థమై, అవగతమై "నీకెందుకయ్యా యింత బాధ, వాడి పని నేను చూసుకుంటాను, నాకు వదిలెయ్యి. వాడ్ని ఏడేడు చెరువుల నీళ్ళూ నేను తాగిస్తాను!" అన్నారు.

కాని, మామగారికి ఈ క్రెడిట్ దక్కనివ్వడం తనకు సుతరాం యిష్టంలేదు. తన జీవితానికి ఫైల్యూరు వుండకూడదు. మరీ హార్ట్‌కు తీసుకోవడం వల్లనే, ఈ విషయమై సరియైన ఆలోచన కుదరడంలేదు. అప్పుడే చప్పున స్ఫురించింది. "ఆగండి మామగారూ" అన్నాడు.

తను ఎయిర్‌లో హైదరాబాదు నుంచి వైజాగ్ వచ్చాడు. లారీ లోడ్ చేయించుకుంటూన్న డ్రైవర్ రాజు కనిపించాడు. గతం అంతా ఏమాత్రం గుర్తు లేనట్టుగా. "ఏమోయ్ రాజూ... ఏమిటి అలా చిక్కిపోయావ్? అదే నీ వరసేమీ బాగులేదు. టి.ఎ. కోసం రేయింబవళ్ళు ట్రిప్పులు పడేట్టు చూసుకుంటున్నావు. ఇదేమిటి... ఇంత నీరసంగా కనిపిస్తున్నావు. ఉండు డాక్టరుకు చీటీ యిస్తాను. పట్టుకెళ్ళి ఒళ్ళు చూపించుకో! ఆరోగ్యం లేనిది మనం ఎంత సంపాదిస్తే ఎందుకయ్యా... " అని డాక్టరుకి స్లిప్ టైపు చేయించి రాజుకి ఇచ్చాడు.

రాజు సంబరపడ్డాడు. నిజానికి ఎప్పటినుంచో తనూ డాక్టరు దగ్గరకు వెళ్ళాలనే అనుకుంటున్నాడు.

"మీ దయండీ" అంటూ చీటీ పుచ్చుకున్నాడు. రాజుకు అన్ని సదుపాయాలూ చేయమని సెక్రటరీని పిలిచి, రాజు ముందే ప్రెస్ చేస్తూ చెప్పాడు. రాజు ఉబ్బి తబ్బిబ్బయ్యాడు.

ఏ.సి. రూమ్‌లోకి పోయి స్థిమితంగా కూర్చొని డాక్టర్‌తో తను ఏమి మాట్లాడాడో ఎవరికి తెలుసు?

మరునాడు రాజుకు టి.బి. అన్న రిపోర్టు ఆఫీసుకు చేరింది. స్లైట్లీ ఎటాక్డ్! చాలు దాని ఆధారంగా బాట్లింగ్ కంపెనీలలో క్షయ వ్యాధిగ్రస్తులు పని చేయకూడదన్న మిషతో, కంటేజియస్ డిసీజ్ ఉన్న వర్కర్స్ పని చేయనీయకూడదన్న ఫ్యాక్టరీ రూల్సు ప్రకారం, రాజుకు ఉద్వాసన చెప్పక తప్పలేదు.

తీసేస్తూ రాజును చూసి సత్యమూర్తి కన్నీరు పెట్టాడు. "నీ కెప్పుడు ఏది కావలిసినా నన్నడుగు. ఎన్నాళ్ళోయ్... మళ్ళీ నెల్లాళ్ళల్లో నీ పనిలో నువ్వుంటావ్."

సత్యమూర్తిని మామగారు మరోసారి అభినందించారు. లేబరు గొడవలేమీ రాకుండా యింత చక్కగా వ్యవహారం చక్కదిద్దినందుకు మరీ మరీ కొనియాడారు.

కాని ఈ ఆనందం పట్టుమని పదిరోజులు నిలవలేదు. రాజు మరో కంపెనీలో ఎక్కువ జీతానికి ఉద్యోగానికి కుదిరాడు.

సత్యమూర్తి మొగం పాలిపోయింది. ఆకాశం యింత విశాలంగా ఎందుకుంది. అనుకున్నాడు. దాన్ని చించి ముక్కలు ముక్కలు చేసి పీసెస్ కింద, చిన్నిచిన్ని నలుసులు కింద చేసెయ్యాలనుకున్నాడు.

కాని, అది మరో ఆకాశం!

# రచన

## రజతోత్సవ విహంగవీక్షణ సంపుటి

### విన్నపాలు!

తెలుగుకథ మనుగడకు నడుం కట్టుకుని, ఉద్యమంలా కృషి చేస్తున్న సాహితీసంస్థలు చాలానే ఉన్నాయి. వ్యాపారసంస్థలు కూడా, వ్యాపారదృష్టి ఉన్నాసరే, తమ పరిధిలో తెలుగుకథకి ఊతం ఇస్తున్నాయి. సమూహాలు, సంఘాలు .. మొదలైనవి కూడా కథాసాహిత్యాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి తమతమ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి! అయితే... ఒంటరిగా ఈ తెలుగు కథాసాహిత్యాన్ని ఎంతో ఎత్తుకు తీసుకువెళ్ళడానికి, నడుం కట్టుకుని, పరిధుల్లేని త్యాగాలు చేసి, నేటికి మూడు దశాబ్దాలుగా కృషిచేస్తున్న 'రచన'శాయిగారి గురించి పరిచయం చేయవలసిన అవసరం లేదు. అప్పటికే తెలుగుపత్రికలు ఒకొక్కటే మూతపడుతున్న వేళ, అంతర్జాల సౌకర్యం కూడా లేని రోజుల్లో .. ఉద్యోగం, ఆరోగ్యం, ఆస్తులు, సంసారం, సొంత జీవితాలను పక్కన పెట్టి, కేవలం తెలుగుకథను ముందుకు తీసుకువేళ్ళే ఓ గట్టి ఆలోచన, సంకల్పంతో, 1991లో 'రచన' మాసపత్రికని ఆరంభించారు. మనదేశంలోనే కాదు, సముద్రాలు దాటి సుదీరతీరాల్లో ఉన్న తెలుగువారి దగ్గరకు కూడా తీసుకువెళ్ళారు. ఇది మా 'తెలుగువారి సాహితీ సంపద' అని గర్వంగా చెప్పుకునేలా ఆ పత్రికను, ఒంటరిగా ఒంటిచేత్తో పాతికసంవత్సరాలకు పైగా నడిపారు. ఇల్లు ఒళ్ళు గుల్లై, ఒంటరైపోయినా సరే, సంచిక ఆగింది కాని, ఆయన నడకను ఇప్పటికీ ఆపలేదు. పాతికసంవత్సరాల "రచన" లో ఆణిముత్యాలను ఏరి, ఆరు సమగ్ర గ్రంథాలుగా మాలలు కట్టి ఓ ఏడెనిమిది సంవత్సరాల క్రిందట అందించారు. ఇంకా మిగిలిపోయిన ఆణిముత్యాల్లాంటి కథలు, కబుర్లు అవీ-ఇవీ .. అన్నీ బాపుగారి బొమ్మలతో సహా మరో ఐదు ముత్యాలహారాలు అందించాలని నాలుగయిదు ఏళ్ల క్రిందట ప్రయత్నాలు మొదలెట్టి, మధ్యలో కరోన ఆటంకం కలిగించినా సరే, వాటిని ఓ కొలిక్కి తెచ్చి ఇప్పుడు అందిస్తున్నారు. ప్రతీ తెలుగువారు ఈ సంపుటాలను భద్రపరిచి, వీలునామాలో పొందుపరచగల ఆస్తి కాగలదని నమ్ముతున్నాం! తెలుగునాట గ్రంథాలయాల్లో కూడా ఈ సంపుటాలు ఉండవలసిన అవసరం ఉంది! ఎనభయ్యవ వసంతంలోకి అడుగుపెట్టినా సరే, తెలుగుకథ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న 'రచన' శాయిగారు చేపట్టిన ఈ అసాధారణ కార్యానికి, ఉడతాభక్తిగా చేయగలిగే సహాయం ఒక్కటే... శాయిగారి ఉత్తరానికి స్పందించి, ఆ రచన సంపుటాల ప్రచురణలో భాగస్వామ్యం కావలసిందిగా ఈ విన్నపం ద్వారా మీ అందరినీ అభ్యర్థిస్తున్నాం!

అన్నట్టు ఆ భాగస్వామ్యం ఖరీదు రూ. 14,300/-.

ఈ మొత్తాన్ని రెండు వాయిదాలలో చెల్లించి, పుస్తకాలను అందుకోవచ్చును.

**కథామంజరి బృందం**

"రచన" శాయిగారి ఉత్తరం కోసం ఇక్కడ నొక్కండి.